# భారతీయ పుణ్యనదులు

రచన

డా॥ కె. మలయవాసిని

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2015

**BHARATIYA PUNYA NADULU**

*By*
**Dr. Malayavasini**

T.T.D. Religious Publications Series No.1167
© All Rights Reserved

First Print : 2015

Copies :

Price :

*Published by*
**Dr. D. Sambasiva Rao**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

విశాలమైన పరమాత్ముని సృష్టిలో 84 లక్షల జీవరాసులున్నాయని ప్రతీతి. ఈ జీవరాసుల మనుగడ కొరకు పరమాత్ముడు పంచభూతాలను సృష్టించాడు. అవి నింగి, నేల, నీరు, నిప్పు, గాలి – ఈ అయిదింటిని భగవత్ స్వరూపాలుగా మనం భావిస్తాం. వీటి ప్రాధాన్యం దేనికదే అయినా, మన పూర్వీకులు నీటికి కొంత అధిక ప్రాధాన్యాన్ని కల్పించారు. పరమాత్ముడు నీటిని భూమి మీద నదులు, సముద్రాల రూపంలో సృష్టించాడు.

మానవ జీవనానికి నిత్యోపయోగమైన (ప్రాణాధారమైన) నీటిని నదులు అందిస్తున్నాయి. మన హిందూ ధర్మం ప్రకారం నదులను మాతృభావనతో నదీమతల్లులుగా భావిస్తాం, ఆరాధిస్తాం. మానవ జీవనంలో నదులు విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ప్రాచీన నాగరికతలు, నగరాలు, రాజధానులు అన్నీ దాదాపు నదీతీరాలలోనే వెలిశాయి. ఒక రకంగా నదులు ప్రాణికోటికి జీవనాధారాలు. ఆహార సముపార్జనకు కానీ, విలాసజీవనానికి కానీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో నదులు మూలాధారాలు అవుతున్నాయి. అందుకే మన వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ నదీ వైశిష్ట్యాన్ని తెలియజేస్తున్నాయి.

భారతదేశం పుణ్యభూమి, కర్మభూమి. ఈ దేశంలో ఎన్నో ప్రసిద్ధ నదులు, పవిత్ర నదులు, జీవనదులు ప్రవహిస్తూ మానవుల మనుగడకు సహకరిస్తున్నాయి. అటువంటి నదుల ప్రాధాన్యం, విశేషాలు, పుట్టుపూర్వోత్తరాలు, ఉత్సవాలు, పుష్కరాలు మున్నగు అంశాలను ప్రజలందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో తి.తి.దేవస్థానం "భారతీయ పుణ్యనదులు" అనే పేర ఈ గ్రంథాన్ని ముద్రిస్తున్నది.

ఈ గ్రంథ రచయిత్రి ఆచార్య కె.మలయవాసిని గారు. వీరు ఈ గ్రంథాన్ని చక్కటి పరిశోధనాత్మక దృష్టితో, విశ్లేషణాత్మకంగా అందించారు. వారికి మా కృతజ్ఞతలు.

భారతీయ పుణ్యనదులు అనే ఈ గ్రంథాన్ని తి.తి.దే గోదావరి పుష్కరాల దృష్ట్యా తయారుచేసి భక్త లోకానికి అందిస్తున్నది. ఈ గ్రంథాన్ని భక్తమహాశయులు ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దే.తిరుపతి

# మనవి

**"ఆకాశా ద్వాయుః వాయో రగ్నిః అగ్నే రాపః అద్భ్యః పృథివీ పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽన్నంఅన్నా త్పురుషః"**

– తైత్తరీయోపనిషత్తు

ఆకాశం నుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి భూమి, భూమి నుండి ఓషధులు, ఓషధుల నుండి అన్నం కలిగాయి. అన్నం నుండి మానవుడు పుట్టాడు, అని ఉపనిషద్వాక్యం.

**'ఆపః పునస్తు పృథ్వీమ్, పృథ్వీపూతా పునాతుమామ్'** అని ఆర్యోక్తి, నీరు భూమిని శుభ్రపరుస్తుంది. అంటే పవిత్రంగా చేస్తుంది అని భావం. సౌరకుటుంబంలో భూమిమీద మాత్రమే పుష్కలంగా నీరు ఉందనీ – అది ఘనరూపం లోనూ, ద్రవరూపం లోను, వాయురూపం లోనూ కూడా భూమి మీద లభ్యమవుతుందని శాస్త్రజ్ఞులు పరిశోధించి చెప్తున్నారు. అందువల్ల భూమిమీద జీవులు ఉండటానికి ఆధారం నీరే అని నిర్ధారించారు. **'ఉదకం నారాయణ స్వరూపం'** అన్నారు మన ఋషులు. వైజ్ఞానికంగా చూస్తే నీటికి ఒక వైచిత్రి ఉంది. ఏ పదార్థమైనా ఘనరూపంలో ఎక్కువ సాంద్రతకల్గి ద్రవరూపంలోను వాయురూపంలోనూ ఆ సాంద్రత క్రమేపీ తగ్గిపోతూ ఉంటుంది. అయితే నీటికి మాత్రం అత్యధిక సాంద్రత నాలుగు డిగ్రీల సెంటిగ్రేడు వద్ద ఉంటుంది. అంటే ఉష్ణోగ్రత నాలుగు డిగ్రీలకంటె తగ్గినప్పుడు కూడా సాంద్రత తగ్గిపోతుంది. వాని వల్లనే ఘనరూపంలో ఉన్న మంచుముక్కలు ద్రవరూపంలో ఉన్న నీటిపై తేలియాడతాయన్నమాట. నీటికి గల ఈ స్వభావమే భూమిమీద జీవనానికి ఆలంబనం. చలికాలంలో ధ్రువప్రాంతాలలో సముద్రాలలో మంచు పేరుకుపోయినా క్రిందనీరు ద్రవరూపంలో ఉండటం వల్ల జలచరాలన్నీ హాయిగా జీవించగలుగుతున్నాయి.

ఇంతటి మహత్తుగల నీరు భూమి మీద నదుల రూపంలో ప్రవహించి ప్రాణికోటికి జీవనాన్ని అందిస్తున్నది. ఆ యా నదుల జన్మవృత్తాంతాలు, పౌరాణిక విశేషాలు, పరీవాహక వివరాలు తెలుగు పాఠకులకు తెలియ జేయడానికి చేసిన ప్రయత్నమే ఈ రచన.

ఈ నదుల గురించి వ్రాసే అవకాశం కల్పించిన తిరుమల తిరుపతి దేవస్థానం ఎడిటర్ ఇన్ ఛీఫ్ గారికి కృతజ్ఞతలు.

ఈ **'భారతీయ పుణ్యనదులు'** శ్రీఅలమేలుమంగా వేంకటేశ్వరులకు అభిషేకోదకం అందించే "దివ్యతీర్థ కలశం" కావాలని ఆకాంక్ష.

ఈ రచన ఆ ఏడుకొండల స్వామికే సమర్పితము.

భక్తితో

మలయవాసిని

జయ శ్రావణము-కృష్ణత్రయోదశి

శుక్రవారం, తేది 22-8-2014

## నదుల సూచిక


| | | |
|---|---|---|
| I | **నదులు - ప్రాశస్త్యము** | 1 |
| II | **నదులు - మానవ జీవితము** | 4 |
| III | **నదులు - జీవనదులు** | 8 |
| IV | **నదులు - ఉపనదులు** | 9 |
| V | **నదులు - నదములు** | 10 |
| VI | **నదులు** | 11 |
| | **1. గంగానది** | 11 |
| | 1.1 సోని | 20 |
| | 1.2 కూసి | 21 |
| | 1.3 రామగంగ | 21 |
| | 1.4 గోమతి | 21 |
| | 1.5 శోణభద్ర | 22 |
| | 1.6 తమస | 22 |
| | 1.7 గండకి | 22 |
| | 1.8 సరయు | 23 |
| | **2. యమున** | 25 |
| | 2.1 చంబల్ | 28 |
| | 2.2 క్షిప్ర | 29 |
| | 2.3 కౌన్ | 30 |
| | 2.4 బెత్వా | 30 |
| | **3. సరస్వతి** | 31 |
| | **4. బ్రహ్మపుత్ర** | 36 |
| | **5. సింధు** | 38 |

5.1 జీలం 40

5.2 చీనాబ్ 41

5.3 రావి 42

5.4 బీయాస్ 43

5.5 సట్లెజ్ 43

**6. మహానది** 45

**7. నర్మద** 47

**8. తపతి** 52

8.1 పూర్ణ 54

**9. మహీ** 55

**10. సబర్మతి** 57

**11. గోదావరి** 60

11.1 శబరి 71

11.2 ప్రణహిత 73

11.3 మంజీర 73

11.4 మాచ్‌ఖండ్ 73

**12. కృష్ణానది** 74

12.1 తుంగభద్ర 78

12.2 భీమ – భీమరథి 82

12.3 మూసీ 84

**13. పినాకిని – పెన్నానది** 86

13.1 చిత్రావతి 88

**14. కావేరి** 89

**15. తామ్రపర్ణి** 93





**16. పంపానది** 95

**17. బాహుద** 96

**18. పెరియారు** 97

**19. అడయార్** 98

**20. పాలార్** 98

**21. వైగై** 99

**22. లూని** 100

**23. అంబ** 100

**24. వశిష్ఠ** 101

**25. బ్రాహ్మణి** 101

**26. విశ్వామిత్రి** 102

**27. రంగమతి** 103

**VII ఆంధ్రదేశములోని చిన్న నదులు** 104

**VIII నదులు – ఉపయోగములు** 109

**IX నదులు – పూజలు** 114

**X నదులు – దేశసమైక్యత** 124

**XI నదులు – ప్రాజెక్టులు** 127

భారతీయనదులు పుట్టిన ప్రదేశము – నిడివి 128

నదీనామ విశేషములు 130

**XII నదీ స్తోత్రాలు** 134

# I. నదులు - ప్రాశస్త్యము

భగవంతుని సృష్టి అతివిచిత్రమయినది. ప్రాణికోటికి అత్యవసరమయిన నీరు, గాలి మొదలయినవాటిని భగవంతుడు పుష్కలంగా సృష్టించాడు. ఏ ప్రాణి జీవించాలన్నా నీరు, గాలి ముఖ్యం. మానవులకు, జంతువులకు, పక్షులకు, వృక్షాలకు అన్నిటికి ప్రాణమున్న ప్రతిజీవికి నీరు ఎంతో అవసరం. అసలు నీటికి 'జీవనము' అని మరో పేరు కూడా ఉంది. ఈ నీరు మనకు నదుల ద్వారా లభిస్తోంది. నదీ ప్రాశస్త్యాన్ని గురించి వేదవాఙ్మయం ఎంతగానో వివరించింది.

ఋగ్వేదంలో పదవమండలంలోని 75వ సూక్తంలో మొదటి ఋక్కులో నదీస్తుతి ఉంది. అందులో సింధునది ఆధిక్యతను కొనియాడారు. ఈ సింధునది ప్రధాన నదులైన – గంగ, యమున, సరస్వతి, శతద్రి, పురుష్ణి, అసిక్ని, ఆర్జికేయ అనే నదులతో ప్రవహిస్తోంది. అంతేకాదు అసిక్ని నది ఉపనదులయిన – మరుద్వృధ, వితస్త, సుషోమ అనే నదులతో కూడా ప్రవహిస్తోంది.

**ఇమం మే గంగే యమునే సరస్వతీ**
**శతుద్రి స్తోమం సచతా పరుష్ణ్యా**
**అసిక్న్యా మరుద్వృధే వితస్తయాౖ ౖర్జీ**
**కీ యే శృణుహ్యా సుషోమయా॥**

– ఋగ్వేదం10మం.75సూ.

ప్రధానంగా ఋగ్వేదంలో ఇరవై అయిదు నదులు నిర్దేశింపబడ్డాయి. వితస్త, అసిక్ని, పురుష్ణి, విపాట్, శతద్రి అనే అయిదు నదులు సింధునదికి ఉపనదులు. అసిక్ని – నేడు చంద్రభాగగా పురుష్ణి – ఇరావతి / రావిగా వ్యవహరింపబడుతున్నాయి.

ఈ 'సింధు' అనే నామమే ప్రాచీనార్యులు భరతవర్షానికి పేరుగా వ్యవహరించారు.

గ్రీకులు సింధుశబ్దాన్ని 'ఇండస్'గా వ్యవహరించారు. ఆ 'ఇండస్' శబ్దమే కాలక్రమంలో 'ఇండియా'గా రూపొందింది.

సింధునదీ పరిసరాత్మకమైన వింధ్యహిమాచల మధ్యభాగాన్ని – పారశీకులు – హిందూస్థాన మని వ్యవహరించారు.

ఇండియా, హిందూస్థాన్ అనే రెండు పేర్లూ 'సింధు' – అనే నదీనామం నుండే ఉత్పన్నమయ్యాయి.

'నీరు' మానవునికి అన్నాన్ని ప్రసాదిస్తోందనే ప్రధానవిషయం – వేదాలలో ఉండడంతోపాటు కొన్ని శాసనాలలోకూడా ప్రత్యేకంగా పేర్కొనడం గమనించదగ్గ విషయం.

విజయనగర సామ్రాజ్య స్థాపకులు హరిహరరాయలు, బుక్కరాయలు. ఈ అన్నదమ్ములలో బుక్కరాయల కుమారుడు భాస్కరభవదూరమహీపతి. ఇతడు క్రీ.శ. 1369లో పోరుమామిళ్ల చెఱువు నిర్మాణం చేయించినప్పుడు వేయించిన శాసనములోని కొన్నిశ్లోకాలు జలప్రశస్తిని వివరిస్తున్నాయి. ఆ శాసనాన్ని రచించిన కవి లింగయమాచనార్యుడు.

**"ఆపోవా ఇదగ్ం సర్వమిత్యామ్నాయ ప్రమాణతః**
**జలదేవాన్నసంభూత: అన్నం బ్రహ్మేతి చ శ్రుతిః**

అంతా నీరే అనడానికి వేదాలే సాక్ష్యం. నీటి నుంచి అన్నం సృష్టింప బడుతుంది. అన్నం పరబ్రహ్మం అని వేదవాక్కు.

**చరాచర జగద్బీజం జలమేవ న సంశయః**
**కిం పునర్బహు నోక్తేన జలాధిక్యం వదామ్యహమ్॥**



చరాచర జగత్తునకు హేతువు నీరే అనడంలో సందేహంలేదు. పలుమాటలు ఎందుకు? నేను నీటి గొప్పతనాన్ని గురించిచెప్తాను.

**గంగాధరో హరస్యోపి విష్ణురంబోధిమందిరః**
**బ్రహ్మా జలజసంభూత: తస్మాత్ సర్వాధికం జలం॥**

ఈశ్వరుడు గంగను స్వతః శిరస్సున ధరించాడు. విష్ణువు సాగరం లోనే ఇంటిని నిర్మించుకున్నాడు. నీటిలో పుట్టిన కమలంలో బ్రహ్మదేవుడు జన్మించాడు. అందువలన నీరు అన్నింటికంటే గొప్పది."

అంటూ శాసనంలో నీటి ఆధిక్యతను వివరించారు, లింగయ మాచనార్యుడు.

ఇంతటి మహత్త్వం గల నీరు నదుల ద్వారా ప్రవహిస్తూ మానవులకు మేలు చేకూరుస్తున్నది.

* * *

# II. నదులు - మానవ జీవితము

భారతదేశంలో ఎన్నో నదులు పెద్దవి, చిన్నవి, బుల్లివి లెక్కలేనన్ని ఉన్నాయి. వాటి పుట్టుక, పేర్లు, ఎంతో రమణీయంగా ఉంటాయి.

భారతీయులు నదులను పవిత్రంగా భావించి పూజిస్తున్నారు. అందుకే మన వాళ్లు నదులను పుణ్యనదులు అని పిలుస్తున్నారు. నదీ స్నానము పుణ్యప్రదమని నమ్ముతున్నారు. పూర్వకాలంలో నదీస్నానంతో మానవుని దినచర్య ప్రారంభమయ్యేది. నిత్యము ప్రవహించే నది ఉండే ఊళ్లో మాత్రమే ఉండమని హితవు.

అప్పిచ్చువాడు, వైద్యుడుతోబాటు ఎప్పుడును ఎడతెగక పారు ఏరును కూడా ప్రత్యేకంగా చెప్పి అవన్నీ ఉన్న ఊళ్లో ఉండమనీ, అవి చొప్పడకున్నట్టి ఊరు చొరకుము సుమతీ! అంటూ నది లేని ఊళ్లోకి వెళ్లవద్దు అన్నాడు సుమతీ శతక కర్త. అంటే నది మానవుడికి అంత ముఖ్యమన్న మాట. మామూలు ఊర్ల సంగతే ఇలా ఉండగా ఇక పెద్ద పెద్ద రాజధాని నగరాల సంగతి చెప్పాలా?

ఇక్ష్వాకుల రాజధాని అయోధ్య సరయూ నదీతీరంలోను, కురువంశీకుల రాజధాని హస్తినాపురం యమునానదీ తీరంలోను ఏర్పడ్డాయి. దక్షిణాదిని విజయనగర సామ్రాజ్యం తుంగభద్రానదీతీరాన స్థాపించినట్లు చరిత్ర చెబుతూంది.

నగరాలు, సామ్రాజ్యాలు మాత్రమే కాక దేవతలు కూడా నదీ తీరాలలోనే వెలిసి ఉన్నారు. మన పవిత్ర క్షేత్రాలు చాలా వరకు నదీ తీరాలలోనే ఉన్నాయి.

గంగానదీ తీరాన కాశీలో విశ్వనాథుడు, గోదావరీ తీరాన భద్రాద్రిలో శ్రీరాముడు, నర్మదా నదీతీరాన ఉజ్జయినిలో ఓంకారేశ్వరుడు, కృష్ణానదీ



తీరాన విజయవాడలో కనకదుర్గ, శ్రీశైలములో మల్లికార్జునుడు, పెన్నానదీ తీరాన నెల్లూరిలో శ్రీరంగనాయకుడు, పంపానదీ తీరాన అన్నవరములో సత్యనారాయణస్వామి వెలసి ఉన్నారు.

హిందూదేశమని పేరు రావడానికి కారణం ఒక నది. ఆ నదిపేరు సింధు అని తెలుసుకున్నాం. మనదేశం పేరుకి నదులకి సంబంధం ఉంది. హిందూ దేశంలోని ఒక రాష్ట్రానికి కూడా నదులవల్లనే పేరువచ్చింది. అది అయిదు నదులకు సంబంధించి ఉంటుంది. అది 'పంజాబ్'. పంజాబ్ అంటే అయిదు నదుల మధ్య దేశము అని అర్థం. ఈ అయిదు నదులూ మళ్లీ సింధు నదికి ఉపనదులు. నదుల గురించి విడిగా వివరంగా చెప్పుకునేటప్పుడు వాటిని చెప్పుకుందాము.

దేశము, రాష్ట్రము కాకుండా కొన్ని జిల్లాలు కూడా నదీపరంగా పేరు పొందాయి. అవి మన ఆంధ్రదేశంలోనే ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణాజిల్లా అని.

ఒక ప్రసిద్ధపట్టణం పేరు కూడా నది వల్ల వచ్చింది. ఆ పట్టణం అటు పుణ్యక్షేత్రంగానూ ఇటు విద్యలకు కాణాచిగానూ కూడా పేరుపొందింది. ఆ పట్టణము కాశీ. అయితే కాశీ అనే పేరు నదులవల్ల రాలేదు. కాశీకే 'బెనారస్' అని మరో పేరు కూడా ఉంది. బెనారస్ అసలు రూపం 'వారణాసి'. వారణాసి ఉచ్చారణలో క్రమంగా బెనారస్ అయింది. ఈ వారణాసి అనే పేరు రెండు నదులవల్ల వచ్చింది. వరుణ, అసి అనే రెండు ఉపనదులు, ఇక్కడ కలుస్తుండటం చేత ఈ తావుకి వారణాసి అనే పేరు వచ్చింది.

'వారణాసి' లో రెండు నదులు ఉన్నట్లే – రెండేసి నదులు కలిసి ఒకే పేరుగా పిలువబడే నదులు కొన్ని ఉన్నాయి. తుంగభద్ర, కృష్ణవేణి, చంద్రభాగ మొదలయినవి.

తుంగ + భద్ర – తుంగభద్ర అయింది

కృష్ణ + వేణి – కృష్ణవేణి

చంద్ర + భాగ – చంద్రభాగ

వీటి పేర్లు వింటే ఒకే నది అనిపిస్తుంది. కాని ఇవి రెండు నదులు కలవగా ఏర్పడిన పేర్లన్నమాట.

గంగానది పేరు వినని హిందువులు ఉండరు కదా. ఇకపోతే 'గంగ' అని చివర వచ్చే నదులు ఐదు ఉన్నాయి.

రామగంగ, పంచగంగ, కిషన్‌గంగ, వైన్‌గంగ, ధ్యానగంగ

మన దేశంలోని నదులకు మనదేవతలతో ఎంతో సంబంధం ఉంది. నదులు మనకి దేవతా స్వరూపాలు.

గంగ విష్ణువు కూతురు.

నర్మద శివుని కూతురు.

తపతి సూర్యుని కూతురు.

మహేంద్రతనయ అనే నది ఇంద్రుని కూతురు. ఇలా దేవుళ్ల తోటేకాక ఋషిపుంగవులతో సంబంధమున్న నదులుకూడా ఉన్నాయి.

ఒక్క గోదావరికే – సప్తర్షులతో సంబంధం ఉంది. గోదావరికి వృద్ధ గౌతమి అనే పేరు గౌతమ మహర్షివల్లనే వచ్చింది.

గుజరాత్‌లో 'విశ్వామిత్రి' అనే నది ఉంది.

భారతీయులు నదులను స్త్రీమూర్తులుగా భావించారు. అందుకే నదుల పేర్లన్నీ చూడండి ఎలా ఉన్నాయో.



తపతి, నర్మద, గంగ, కృష్ణవేణి, గోదావరి, కావేరి, శబరి, మంజీర... ఈ పేర్లు భారత స్త్రీలు చాలామంది ఇప్పటికీ పెట్టుకుంటూనే ఉన్నారు. సముద్రాన్ని పురుషుడనీ నదులన్నీ అతని భార్యలనీ అన్నారు.

అయితే రెండు నదుల పేర్లు మాత్రం మగవాళ్ల పేరుల్లా ఉంటాయి. అసలు ఆ పేరులోనే 'పుత్ర' అని వస్తుంది. పుత్ర – అంటే కుమారుడు అని కదా అర్థం. ఇవి బ్రహ్మపుత్ర, సోనెపుత్రలని.

నదులు మానవులకు ఎన్నో విధాల ఉపయోగపడుతున్నాయి.

త్రాగడానికి, వ్యవసాయానికి నీరు ఇస్తున్నాయి.

మంచి ఒండ్రు మట్టిని తెచ్చిభూమిని సారవంతం చేస్తున్నాయి. తమ జలపాతాలతో లెక్క కట్టలేనంత విద్యుచ్ఛక్తిని ఇస్తున్నాయి. ఆహారంగా ఉపయోగపడే చేపలు, ఇళ్లకట్టుబడికి అవసరమయ్యే ఇసుక ఇస్తున్నాయి.

అరణ్యాల గుండా ప్రవహిస్తూ వస్తూ ఎన్నో ఔషధులను తెచ్చిపెడు తున్నాయి.

ఇన్ని విధాల గొప్పతనం కలిగిన ఈ నదులను గురించి తెలుసు కోవలసినది ఎంతోఉంది.

ఈ నదులన్నీ మళ్లీ నదములనీ, నదులనీ, జీవనదులనీ, ఉపనదులనీ, విభాగాలుగా అనేకం ఉన్నాయి. వాటిని గురించి వివరంగా తెలుసుకుందాము.

* * *

## III. నదులు - జీవనదులు

హిమాలయాల్లో పుట్టిన నదులను జీవనదులు అంటారు. జీవనది అంటే ఏమిటి? జీవనది అంటే నిరంతరం నీరు పుష్కలంగా ఉండి మంచి ప్రవాహవేగం ఉన్న నదులన్నమాట. సాధారణంగా నదులు వర్షాకాలంలో పొంగి పొర్లుతూ ఉంటాయి. ఎండాకాలం వచ్చేసరికి ఎండిపోయి ఇసుక తిప్పలు మాత్రమే బయటపడి ఉంటాయి. కానీ ఎండాకాలంలో కూడా నీరు ఉండే నదులు కొన్ని ఉన్నాయి. వాటిని జీవనదులు అంటారు. గంగ, సింధు, బ్రహ్మపుత్ర, యమున - ఇవి జీవనదులు.

అయితే ఈ నదులలో ఎండాకాలంలో నీరు ఎండిపోకుండా ఎలా ఉంటుంది? ఈ నదులలో నీరు కూడా ఎండిపోతుంది. కానీ వీటికి ఎండాకాలంలో కూడా నీరు దొరుకుతుంది. ఎందువల్లనంటే ఇవి పుట్టిన స్థలాలు చాలా గొప్పవి. హిమాలయ పర్వతాలలో కదా ఈ నదుల పుట్టుక. ఈ పర్వతాలన్ని మంచుతో కప్పబడి ఉంటాయి. ఎండాకాలంలో ఆ మంచుకరిగి నీరై వాగులుగా ప్రవహిస్తూ ఈ నదులకు నీటిని అందజేస్తాయి. అందువల్ల ఈ గంగ, సింధు మొదలయిన నదులలో నీటికి కొరత ఎప్పుడూ ఉండదు.

ఏడాది పొడుగునా గంగానదిలో పడవ ప్రయాణం నిరభ్యంతరంగా చేయవచ్చు.

జీవనదులంటే ఏమిటో తెలుసుకున్నాము. ఇప్పుడు నది - ఉపనది గురించి చెప్పుకుందాము.

* * *

## IV. నదులు - ఉపనదులు

కొన్నిటికి నదులనీ, కొన్నిటిని ఉపనదులనీ వ్యవహరిస్తున్నాం. అయితే మరి నదికి ఉపనదికి తేడా ఏమిటి?

గంగ, సింధు, నర్మద, తపతి, గోదావరి, కృష్ణా మొదలయినవి నదులు. యమున, తుంగభద్ర, శబరి మొదలయినవి ఉపనదులు. ఈ పేర్లు విన్నాక నదులకు ఉపనదులకు తేడా తెలుసుకోవచ్చు.

'నదీనాం సాగరో గతిః' అని నదులన్నీ సముద్రంలోనే కలుస్తాయనే మాట ఉంది. ఏ నది ఎక్కడ పుట్టినా, ఎంతదూరం ప్రవహించినా చివరికి అది వెళ్ళి సముద్రంలో కలిసి తీరవలసినదే. అలా తిన్నగా ప్రవహిస్తు వెళ్ళి నేరుగా సముద్రంలో పడే వాటిని నదులని అంటారు.

కొన్ని ప్రవహిస్తూ, ప్రవహిస్తూ మధ్యలో మరో నదిలో కలిసిపోతాయి. అలా నదితో కలిసి అప్పుడు ఆ నదితోపాటు సముద్రంలో సంగమిస్తాయి. అలా మధ్యలో మరో నదితో కలిసిపోయే వాటిని ఉపనదులని అంటారు.

పటంలో చూసినప్పుడు నదుల, ఉపనదుల చిత్రం చూస్తే నదే పాయలుగా విడినట్లు కనిపిస్తుంది. కాని అది నిజం కాదు. ఎక్కడో పుట్టి, ప్రవహిస్తూ వచ్చి ఒక పెద్దనదితో కలిసే వాటిని ఉపనదులంటారు.

యమున గంగకు ఉపనది. అంటే యమున ప్రవహిస్తూ వచ్చి గంగానదితో కలసిందన్నమాట. అలాగే శబరి గోదావరికి, తుంగభద్ర కృష్ణకు ఉపనదులు.

* * *

# V. నదులు - నదములు

నది అనే మాట ఒక్కటే ఇప్పుడు వాడుకలో ఉంది. కాని మన పూర్వులు ప్రవాహాన్నిబట్టి నదులని నదములని రెండు పేర్లు పెట్టారు.

పడమర దిక్కున పుట్టి తూర్పుకు ప్రవహించే వాటిని నదులనీ పడమర దిశగా ప్రవహించే వాటిని నదములనీ పేరు.

గోదావరి, కృష్ణ, కావేరి మొదలయినవి పడమటి కనుమలలో పుట్టి తూర్పుదిశగా ప్రవహించి బంగాళఖాతములో కలుస్తున్నాయి. కాబట్టి ఇవన్ని నదులన్నమాట.

నర్మద, తపతి, మాహి మొదలయిన నదులు తూర్పున వింధ్య పర్వతాలలో పుట్టి పశ్చిమంగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్నాయి. కాబట్టి అవి నదములన్న మాట.

నది, ఉపనది, జీవనది, నదము వీటి గురించి తెలుసుకున్నాము. ఇప్పుడు మన నదుల పుట్టుక చరిత్ర మొదలయిన విశేషాలు వివరంగా తెలుసుకుందాము.

* * *

# VI. నదులు

## 1. గంగానది

భారతదేశపు నదులలో గంగానది అన్నిటా గొప్పది. 'గంగాస్నానం– తుంగా పానం' అన్నారు. అంటే గంగానదిలో స్నానం, తుంగానదిలో నీళ్లుత్రాగడం ఎంతో పుణ్యమన్న మాట. హిందువులు గంగానదిని గంగామాతగా పుణ్యమూర్తిగా భావిస్తారు.

ఈ నది హిమాలయపర్వతాలలో గంగోత్రి అనే చోట పుట్టింది. పర్వతాల మీదుగా ప్రవహిస్తూ వచ్చి ఈ నది హరిద్వార్ వద్ద మైదాన ప్రదేశంలో ప్రవేశిస్తున్నది. ఈ హరిద్వార్ అనే దాన్ని వైష్ణవులు హరిద్వారమనీ, శైవులు హరద్వారమనీ అంటారు. హరి అంటే విష్ణువు, హరుడంటే శివుడు అని అర్థం.

గంగానది ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాల గుండా ప్రవహించి కలకత్తా దగ్గర సముద్రంలో పడుతోంది. సముద్రమట్టానికి 13,800 అడుగుల ఎత్తు నుండి ఈ నది ప్రవహిస్తూ వచ్చింది. భాగీరథి, అలకనంద, మందాకిని అనే పాయలు కూడా వచ్చి కలిసాక గంగానది వెడల్పు పెరిగింది. ఇన్ని పాయలగుండా మండువేసవిలో కూడా మంచు కరిగి మెండుగా నీటిని పొందుతోంది గనుకనే గంగానది సర్వకాలాలలోనూ జీవనదిగా సాగిపోతోంది.

ఈ గంగానది ఒక్క భూలోకంతోనే కాకుండా స్వర్గ, పాతాళ లోకాలతో కూడా సంబంధం కలిగి ఉంది. దీనికి స్వర్గలోకంలో మందాకిని అనీ, భూలోకంలో భాగీరథీ అనీ, పాతాళలోకంలో భోగవతి అనీ పేర్లు.

**పుట్టుక :** గంగాదేవి సాక్షాత్తు విష్ణువు పాదాల నుండి పుట్టిందని మన పురాణాలు చెప్తున్నాయి. మనం విష్ణ్వాలయానికి వెళ్లినప్పుడు తీర్థం ఇస్తూ

పూజారి 'శ్రీవిష్ణుపాదోదకం పావనం శుభం' అంటూ ఇవ్వడం వింటూ ఉంటాం. దాని అర్థం ఈ నీరు విష్ణుమూర్తి పాదములనుండి పుట్టినది అని, అసలు గంగ అంటే నీరు అనే అర్థం కూడా ఉంది.

విష్ణుమూర్తి వామనావతారంలో బలిచక్రవర్తిని అడిగి మూడు అడుగుల నేల దానంగా తీసుకున్నాడు. ఒక అడుగు భూమిమీద, రెండో అడుగు ఆకాశంలోను, మూడో అడుగు బలిశిరస్సున నిలిపాడు. ఆకాశంలో విష్ణుమూర్తి పాదాన్ని చూచినప్పుడు దేవలోకంలోని బ్రహ్మ పరమానందంతో విష్ణువు పాదాన్ని తన కమండలం లోని జలంతో భక్తియుక్తుడై కడిగాడు. ఈ విషయం భాగవతంలో పోతనగారు

**'.............................................................తత్పాద**
**సేచనముంజేసె గమండలోదకముల జల్లించి తత్తోయముల్**
**వినువీథిం బ్రవహించె దేవనది నా విశ్వాత్ముకీర్తిప్రభన్'.**

స్కంధం - 8-630

శ్రీకృష్ణుని దేహంనుండి గంగానది పుట్టిందని బ్రహ్మవైవర్త పురాణంలో ఉంది.

లోకాలన్నిటికంటె ఎత్తున గోలోకం ఉంది, ఆ లోకంలో రాధాదేవి విహరిస్తూ ఉంటుంది. ఒక కార్తీకపౌర్ణమి నాడు రాధాదేవి గొప్ప ఉత్సవం నిర్వహించింది. ఆ ఉత్సవానికి సకల దేవతలూ విచ్చేశారు. ఆ ఉత్సవంలో బ్రహ్మ నాదశరీరుడైన శంకరుణ్ణి గానం చేయవలసిందిగా కోరాడు. శంకరుడు పరమానందంతో పరమాద్భుతంగా గానం చేశాడు. ఆ గానమాధుర్యానికి శ్రీకృష్ణుడు నిలువెల్లా కరిగిపోయాడు. కృష్ణపరమాత్మ నుండి కరిగిన జలమే గంగానదిగా రూపొందింది. ఆ నదీ జలాలను బ్రహ్మ తన కమండలంలో పట్టి తన లోకానికి తెచ్చుకున్నాడు. శంకరుడు ఆమెను శిరస్సున ధరించి కైలాసానికి తెచ్చుకున్నాడు.



సరే విష్ణుమూర్తి పాదాల దగ్గర పుట్టిన ఈ గంగ నివాసం ఎక్కడో తెలుసా? శివుని నెత్తిమీద. శివుడికి గంగాధరుడనే పేరు ఉంది. అంటే గంగను ధరించిన వాడన్నమాట. తన శిరస్సున గంగను ధరించి ముడిపెట్టాడు శివుడు.

గంగ శివునకు భార్య కూడా అయింది.

గంగానదికి భాగీరథి, జాహ్నవి అనే రెండు ప్రసిద్ధమైన పేర్లు ఉన్నాయి.

గంగ శివుని జటాజూటంలో ఉండడానికి, గంగానదికి భాగీరథి అని పేరు రావడానికీ కారణమయిన సంఘటన ఒకటి ఉంది.

**భాగీరథి :** అసలు మొదట్లో గంగానది స్వర్గలోకంలో మాత్రమే ఉండేది. అది భగీరథుడనే రాజు కోరిక మీద భూలోకానికి వచ్చింది. అయితే అది స్వర్గలోకం నుండి తిన్నగా భూలోకానికి రాలేదు. మధ్యలో కొన్ని మజిలీలు చేసింది. మొదటి మజిలీ శివుని శిరస్సన్నమాట.

ముందు గంగానది స్వర్గాన్ని విడిచి ఎందుకు రావలసివచ్చిందో తెలుసుకుందాము.

సగరుడనే చక్రవర్తి ఉండేవాడు. అతనికి వేలకొలది పుత్రులు. ఆ సగరుడొకసారి అశ్వమేధయాగం తలపెట్టాడు. అశ్వాన్ని దేశంమీదకు వదిలాడు. అది దేశమంతటా తిరిగి పాతాళలోకంలో కపిలుడనే మహర్షి తపస్సు చేసుకునే చోటకు వచ్చి ఆగింది. యాగాశ్వం ఎప్పటికీ తిరిగి రాకపోయేసరికి సగరుని పుత్రులు సాయుధులై గుఱ్ఱాన్ని వెతకడానికి బయలు దేరారు. వెతికి వెతికి చివరికి ఈ కపిలుడి చెంత ఈ అశ్వాన్ని చూసారు. మునీశ్వరుడవు కదా? నీకు గుఱ్ఱం కావలసి వచ్చిందా? దొంగ మునీ! అంటూ హేళన చేశారు. ఆ హేళనకు కపిల మహర్షి మండిపడి చూసేసరికి సగర పుత్రులందరూ భస్మమై అక్కడే పాతాళలోకంలో పడిపోయారు. ఈ

సంగతి తెలిసి సగరుడెంతో విచారించాడు. అకాల మరణమే కాకుండా తన పుత్రులిలా నరకం కూడా పొందేసరికి సగరుడికి ఎక్కడలేని దుఃఖం వచ్చింది. తన పుత్రులకు స్వర్గం రావాలంటే ఏం చెయ్యాలి అని ఋషులతో ఆలోచించగా స్వర్గలోకంలో గంగానదిని నీ పుత్రుల భస్మం మీదుగా ప్రవహించేలా చేస్తే మోక్షం కలుగుతుంది అని చెప్పారు. సగరుని మనుష్యులు కొందరు ప్రయత్నం చేసారు. కానీ గంగానదిని స్వర్గం నుంచి పాతాళలోకానికి తేవడమంటే మాటలా? వాళ్ళవల్ల కాలేదు.

కొంతకాలం గడిచింది. సగరుడికి మునిమనుమడుగా భగీరథుడు పుట్టాడు. యుక్తవయస్సు రాగానే తన తాతల సంగతి తెలుసుకున్నాడు. గంగానదిని పాతాళలోకానికి తేవాలని పట్టుబట్టాడు. దీక్షతో గంగను గురించి తపస్సుచేసాడు. ఎన్నో సంవత్సరాలు తపస్సు చేయగా చేయగా గంగాదేవి ప్రత్యక్షమయింది. కానీ నేరుగా పాతాళానికి రావడానికి ఒప్పుకోలేదు. నన్ను, నా ప్రవాహవేగాన్ని ఆపాలంటే శివుడికే సాధ్యం. కాబట్టి నువ్వు శివుణ్ణి గురించి తపస్సు చెయ్యి. నన్ను శివుడు ధరించడానికి ఒప్పించు. అప్పుడు నేను నీ కూడా వస్తానన్నది.

భగీరథుడు సరే అని శివుణ్ణి గూర్చి బహుకాలం తపస్సు చేశాడు. శివుడు ప్రసన్నుడై భగీరథుని కోరిక విని గంగను తన శిరస్సున ధరించడానికి ఒప్పుకున్నాడు.

అప్పుడు భగీరథుడు మళ్ళీ గంగను ప్రార్థించాడు ఆమె అతివేగంతో స్వర్గలోకం నుండి అంటే ఆకాశం నుండి శివుని శిరస్సుమీదికి దూకింది. శివుడు ఆ వేగానికి తట్టుకుని ఆమెను తన జడలలో ముడివేసి ఒక్కపాయను మాత్రం హిమాలయం మీద వదిలాడు. అక్కడనుండి ఆమె భూమి మీద ప్రవహించి, ఆ తరువాత భోగవతి అనే పేరుతో పాతాళలోకానికి వెళ్ళి, సగర పుత్రుల భస్మం మీద ప్రవహించి వారికి మోక్షాన్నిచ్చింది.



ఇలా భగీరథుడు తపస్సుచేసి సాధించాడు కనుకనే గంగకు "భాగీరథి" అని పేరు వచ్చింది. గంగను పాతాళ లోకానికి తీసుకురావడానికి భగీరథుడు పెద్ద ప్రయత్నం చేశాడు.

ముందు గంగను గురించి తపస్సు చేశాడు. ఆ తరువాత గంగ చెప్పగ కొంతకాలం శివుణ్ణి గురించి తపస్సు చేసి శివుణ్ణి మెప్పించాడు. మళ్ళీ గంగను ప్రార్థించాడు. చివరికి ఎలాగయితేనేం గంగానదిని భూలోకానికి తెచ్చి అక్కడ నుండి పాతాళ లోకానికి తీసుకువెళ్ళాడు. అందుకే ఎవరయినా ఒక పని కోసం అతికష్టపడి ప్రయత్నం చేస్తుంటే 'వాడు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడురా'! అంటారు.

గంగకు భాగీరథీ అనే పేరు ఎలా వచ్చిందో తెలిసింది. ఇలాగే గంగకు జాహ్నవి అనే పేరు కూడా ఉంది. అది ఎలా వచ్చిందో చూద్దాము.

**జాహ్నవి :** పూర్వం జహ్ను అనే మహర్షి ఉండేవాడు. అతడొకచోట పర్ణశాల నిర్మించుకుని జపతపాలు చేసుకుంటూ జీవిస్తూ ఉండేవాడు. భగీరథుని వెంట ప్రయాణమై పాతాళలోకానికి వెళుతున్న గంగానదికి ఈ మహర్షి ఆశ్రమం తగిలింది. ఉత్సాహంతో గంగ ఉరకలువేస్తూ జహ్నుమహర్షి ఆశ్రమాన్ని తనలో కలుపుకుంటూ ముందుకు సాగింది. ఈ విషయాన్ని గమనించి ఆగ్రహించిన జహ్నుముని తన తపఃశక్తితో గంగను పూర్తిగా త్రాగేశాడు. జహ్నుముని ఆశ్రమందాకా వచ్చిన గంగమ్మ ఆ తర్వాత కనిపించకపోవడంతో భగీరథుడు కంగారుపడ్డాడు. విషయాన్ని తెలుసుకుని వెళ్ళి గంగాదేవిని విడువమని జహ్నుమునిని ప్రార్థించగా ఆయన తన చెవినుండి తిరిగి గంగను బయటకు పంపాడు. అట్లా జహ్నుమహర్షి చెవులనుండి పుట్టింది కనుక గంగానది జాహ్నవి అని పేరుగాంచింది. 'జహ్ను కన్యా' అనీ, 'జహ్ను తనయా' అనీ కూడా గంగానదిని పేర్కొంటూ ఉంటారు.

**కాశ్యపి :** గంగానదికి 'కాశ్యపి' అనే పేరుకూడా ఉంది. ఒకసారి మహర్షులు అందరు నివసించే నైమిశారణ్యానికి కశ్యప ప్రజాపతి వెళ్లాడు. మహర్షులందరూ ఆయనను గౌరవించి పూజించారు. యోగక్షేమాలు తెలుసుకునే సందర్భంలో ఋషులందరూ తమకు స్నానజపహోమాది అనుష్ఠానాలు నిర్వహించుకునేందుకు – పవిత్ర గంగానదిని ఈ భూమిపై ప్రవహింపచేయుమని కోరుకున్నారు.

భగీరథుడు అత్యంతకృషితో తెచ్చిన గంగ సగరపుత్రులకు మోక్షం కలిగించే నిమిత్తం పాతాళలోకానికి వెళ్లిపోయింది. భూలోకంలో ప్రవహించడానికి ఆకాశగంగను తేవడానికి కశ్యపుడు హిమాలయాలలో అభూతాద్రి అనేచోట – ఘోరనిష్ఠతో తపస్సు చేసాడు. కశ్యపుని తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమయ్యాడు. వరం కోరుకోమన్నాడు. కశ్యపుడు సంతోషంతో గంగను భూలోక వాసులకై వదిలి పెట్టమని కోరాడు. శివుడు సంతోషించి తన జటాజూటం నుండి మళ్లీ ఒక చిన్న గంగపాయను వదలిపెట్టాడు. అది కశ్యపుని తపోవాటిక మీదుగా నైమిశారణ్యం వరకూ శివానుగ్రహంతో భూమి మీద ప్రవహించింది. ఆ గంగా ప్రవాహానికి – మహర్షులు కశ్యపునిమీద భక్తితో 'కాశ్యపి' అని పేరు పెట్టారు. కశ్యప ప్రజాపతి తపోబలంతో భూమి మీదకు వచ్చింది కనుక 'కాశ్యపి' అనే పేరు తెచ్చుకుంది గంగానది.

ఈ నది కృతయుగంలో 'కృతవతి' అనీ
త్రేతాయుగంలో 'గిరికర్ణిక' అనీ
ద్వాపరయుగంలో 'చందన' అనీ
కలియుగంలో 'సాభ్రమతి' అనీ విఖ్యాతిచెందింది.

కశ్యప ప్రజాపతి గంగానది కోసం తపస్సు చేసిన తీర్థానికి 'కాశ్యపతీర్థం' అని పేరు వచ్చింది. కశ్యపమహర్షి ఈ ప్రాంతంలో నిర్మించిన కుండానికి



'కాశ్యపకుండము' అని పేరు. కశ్యపుడు ఈ ప్రదేశంలో 'కుశేశ్వరుడు' అనే పేరుతో ఈశ్వరుని స్థాపించాడు. ఈ కుండంలో స్నానం, ఈ స్వామి దర్శనం సకలపాప క్షయకరమని 'పద్మపురాణం' చెప్తోంది.

గంగానది పుట్టుకను గురించి పేర్లను గురించి కొంత తెలుసుకున్నాము గదా.

అవన్నీ అలా ఉండగా ఈ గంగాదేవి మానవ స్త్రీ రూపం ధరించి మహా వీరుణ్ణి కన్నది. మహాభారతం కథలో భారతయుద్ధం అనగానే భీష్ముడు గుర్తువస్తాడు. ఈ భీష్ముడికి తల్లి ఎవరనుకుంటున్నారు? అసలు భీష్ముడికి గాంగేయుడు అనే పేరు కూడా ఉంది. ఈ భీష్ముణ్ణి కన్నతల్లి గంగ. గంగ పుత్రుడు గాంగేయుడు.

ఈమె శంతనుడిని వివాహమాడింది. శంతనుడికి గంగాదేవికి భీష్ముడు పుట్టాడు. గంగాదేవి నది మాత్రమే కాకుండా భారతంలో పాత్ర కూడా అయింది.

గంగానది హిమాలయాల్లో గడ్‌గాల్ ప్రాంతం నుండి బయలుదేరి గోముఖం ద్వారా భాగీరథిగా ప్రవహిస్తోంది. అమితమైన వేగంతో దుమికి పడుతూ చీర్‌బాసా అడవుల గుండా గంగోత్రి అనే చోటికి చేరుతుంది. ఇక్కడ గంగామాతకు గుడి ఉంది. ఈ గుడిలో గంగాదేవితోపాటు భగీరథుని విగ్రహంకూడా పూజింపబడుతోంది. భగీరథుని ప్రయత్నంతో గంగానది భూలోకానికి వచ్చింది కనుక, కృతజ్ఞతాభావంతో ఒక పెద్దరాతి ఫలకం భగీరథునికి అంకితం చేసిపెట్టారు.

కేదార్‌నాథ్ శిఖరాల్లో పుట్టిన కేదారగంగ గంగోత్రి దగ్గర భాగీరథితో కలుస్తోంది. రెండు మహాప్రవాహాలు కలవడంతో అక్కడ పెద్ద జలపాతంగా ఏర్పడింది. ఈ ప్రవాహం గంగోత్రి సమీపంలో ఒక కొలనులో పడింది. ఆ కొలనునే 'గౌరీకుండ్' అని పిలుస్తున్నారు. గౌరీకుండంలో స్నానం మహాపుణ్యప్రదమని భారతీయుల నమ్మిక.

ఈ భాగీరథిలో దేవప్రయాగ అనే చోట అలకనంద అనే నది వచ్చికలుస్తుంది. భాగీరథి, కేదారగంగ, అలకనందలు కలిసి ఈ ప్రాంతంనుండి 'గంగానది'గా వ్యవహరింపబడుతోంది.

హరిద్వార్ వద్ద మైదానప్రాంతంలో ప్రవేశించాక, ఫరుక్కాబాద్‌లో రామగంగను కలుపుకుని అలహాబాద్ చేరు కుంటుంది. అలహాబాద్ వద్ద యమునానదితో, అంతర్వాహిని అయిన సరస్వతీ నదితో కలుస్తుంది. ఈ మూడు నదులు కలిసిన ప్రదేశమే 'త్రివేణీసంగమం' – ప్రయాగక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది.

ప్రయాగ నుండి వారణాసి మీదుగా బీహార్ రాష్ట్రంగుండా ప్రవహించి బెంగాల్‌ను చూసి, బంగ్లాదేశంలోకి ప్రవహిస్తుంది. బంగ్లాదేశీయులు గంగానదిని పద్మానది అని పిలుస్తారు. ఈ గంగానది ఏడుపాయలుగా చీలి బంగాళాఖాతంలో కలుస్తున్నది.

హిమాలయాలనుండి సముద్రంలో సంగమించే పర్యంతం గంగానది పొడవు 2525 కిలోమీటర్లు. సముద్రంలో కలిసేముందు గంగానది ఎన్నోడెల్టాలుగా ఏర్పడింది. ఆ ప్రదేశానికి 'సుందరవనము' అని పేరు భారతదేశంలో వ్యవసాయానికి గంగానది అందించే నీరు, ఒండ్రు మట్టి – ఇంత అని చెప్పలేనంత.

గంగా నదీ తీరాన ఎన్నో పుణ్యక్షేత్రాలు వెలిశాయి. గంగోత్రి వద్ద గంగామాత ఆలయం, గౌరీ కుండము ఉన్నాయి.

కేదారనాథ్ – ద్వాదశజ్యోతిర్లింగాలలో ఒకటి.

బదరీనాథ్ – విష్ణుక్షేత్రాలలో ప్రసిద్ధి పొందినట్టిది.

ఈ బదరీనాథ్ లోనే నారాయణుడు నరునకు అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడట. ఇక్కడ స్వామికి బదరీనారాయణుడని పేరు.



బ్రహ్మకపాలం – ఇది పితృకార్యాలకు ప్రసిద్ధి.

హరిద్వార్ – ఇక్కడ కుంభమేళా పన్నెండు సంవత్సరాల కొకసారి జరగుతుంది. ఈ ఊరిని మాయాపురి అని కూడా వ్యవహరిస్తారు.

హృషీకేశ్ – ఉత్తర దేశపు పుణ్యక్షేత్రాల్లో ప్రసిద్ధ మయింది.

పవిత్రమయిన ఈ గంగానది ఒడ్డునే కాశీ విశ్వనాథుడు వెలిసాడు. గంగానది కాశీపట్టణంలో విశ్వేశ్వరుని మ్రోల విఱ్ఱవీగుతూ ప్రవహిస్తుంది.

కాశీలో గంగానదిలో స్నానం చేస్తే కోటి జన్మల పాపంకూడా పోతుందట. నిజానికి గంగానదిలో నీళ్లకు చాలా మహత్తు ఉంది. కాశీలో ఎన్నోశవాలూ, ఎంతోకుళ్లూ నదిలో కొట్టుకుపోతూ ఉంటాయి. అయినప్పటికీ ఆ నీళ్లు ఎప్పుడూ కలుషితం కావు. హిమాలయం నుండి ఈ నది ప్రవహిస్తూ వస్తుంది కదా. ఆ యా స్థలాలలోని ఓషధులెన్నో ఈ నీటిలో కలిసి నీటిని శుభ్రంగా ఉంచడమే కాక ఆరోగ్యవంతమయిన వాటిగా, మహత్త్వపూర్ణంగా తయారు చేస్తున్నాయన్న మాట. అందువల్లనే గంగా స్నానానికి అంత ప్రాముఖ్యాన్ని ఇచ్చారు మనవాళ్లు. జీవితంలో ఒక్కసారయినా గంగాస్నానం చెయ్యడం ఆరోగ్యరీత్యా చాలా మంచిదన్న మాట.

గంగానది గొప్పదనాన్ని చాటిచెప్పే కావ్యం ఒకటి ఉంది. దానిపేరు 'గంగా లహరి'. దీన్ని వ్రాసిన కవి తెలుగువాడయిన జగన్నాథ పండితరాయలు. ఈ 'గంగా లహరి' ఎందుకు చెప్పాడో ఆ సందర్భం ఏమిటో, 'నదులు – పూజలు' అనే శీర్షికలో చెప్పుకుందాము.

గంగాస్నానం మీద మన తెనుగులో కొన్ని సామెతలు కూడా వచ్చాయి. 'తా మునిగినది గంగ – తా వలచినది రంభ' అనీ 'చేసేవి గంగాస్నానాలు దూరేవి దొమ్మరి గుడిసెలనీ'.

ఏదయినా తనకు నచ్చితే ఇంక ఇతరుల మాట వినని వాళ్లని గురించి 'తా మునిగినది గంగా తా వలచినది రంభ' అంటూన్నాడురా వాడు అంటారు. అలాగే పైకి మంచి నీతులు చెప్తూ చెడ్డపనిచేసేవాళ్లని 'చేసేవి గంగాస్నానాలు దూరేవి దొమ్మరి గుడిసెలూనూ'! అని అంటూ ఉంటారు.

గంగానది పౌరాణికంగానూ, చారిత్రకంగానూ కూడా గొప్పది. హిందూ దేశపు నదులలో కెల్లా పెద్దది. ఉత్తర హిందూదేశంలో సగభాగంలో గంగానది ప్రవహిస్తూ ఉంటుంది. గంగానది భాగమే హుగ్లీనది.

గంగానది పెద్దనది కావడమే కాకుండా దీని ఉపనదులు కూడా చాలాపెద్దవి. గంగానది కంటె పొడవుగల బ్రహ్మపుత్ర దీనికి ఉపనది. యమున కూడా ఓ మాదిరి పెద్దనదే. అది కూడా గంగకు ఉపనదే.

గంగానదికి పదులకొద్దీ ఉపనదులున్నా పెద్ద పేరున్న బ్రహ్మపుత్ర, యమునా నదులను గురించి వేరుగా చెప్పుకుందాము. చిన్న చిన్న ఉపనదులను గురించి ముందు తెలుసుకుందాము.

సోని, రామగంగ, గోమతి, తమసా, గండకి, కూసి, శోణభద్ర, సరయు మొదలయిన వాటిని గూర్చి వివరించుకుందాము.

**1. 1 సోని :** 'సువర్ణవాహ' అని దీనికి సంస్కృతంలో పేరు. ఈ నది సాత్పురాపర్వతాలలో అమర కంటకము అనేచోట పుట్టి 569 కిలోమీటర్లు ప్రవహించి వచ్చి 'దన్‌పోర్' అనే గ్రామం దగ్గరలో గంగా నదిలో కలుస్తోంది. అదీ కాక చరిత్ర ప్రసిద్ధికెక్కిన పాటలీపుత్రం కూడా ఈ గంగాసోన్‌ల సంగమ స్థలం వద్దనే ఉంది.

ఈ సోన్ నదిలో బంగారం దొరుకుతుందట. సోన్ అంటే బంగారము. బంగారంతో ప్రవహిస్తోంది అని అర్థం వచ్చేలా దీనికి హిరణ్యవాహమనీ, సువర్ణ వాహమనీ పేర్లు ఉన్నాయి. బహుశా పూర్వం నిజంగా బంగారం దొరికేదేమో.



ఇకపోతే ఈ సోన్‌నది, నర్మదానది వీటికి సంబంధించిన పురాణకథ ఒకటి ఉంది. ఈ రెండు నదులూ బ్రహ్మదేవుని కన్నీటి బిందువుల నుండి పుట్టాయట. బ్రహ్మకొకసారి కన్నీరు వచ్చిందట. ఆ నీరు అమరకంటకానికి ఒక వైపుగా ఒక బిందువు, రెండోవైపుగా ఒక బిందువు పడ్డాయట. అందులో ఒకటి నర్మద – రెండోది సోన్.

కథ నమ్మినా, నమ్మకపోయినా – ఈ రెండు నదులూ మాత్రం అమర కంటకానికి ఇటూ, అటూ పుట్టి ప్రవహిస్తున్నాయి.

**1. 2 కూసి :** ఇది నేపాల్‌లో 'సప్తకూసి' అనే తావున పుట్టినది పురాణ గాథలను బట్టి ఈ నది కౌశికనది.

గాధి వంశజుడయిన కుశమహారాజు కూతురు సత్యవతి.. ఈమె క్షత్రియుల ఇంట పుట్టినా, ఒక బ్రాహ్మణునకు భార్యయై మహావీరుడయిన పుత్రుని కన్నది. ఆ తరువాత ఆమె సంసారమందు విరక్తి పొంది తపస్సుచేసి లోకోపకారార్థం నదిగా మారింది. విశ్వామిత్రమహర్షి అక్కగారు సత్యవతి, ఈ కౌశిక నదిగా మారింది. అక్కగారి మీద ప్రేమతో విశ్వామిత్రుడు ఈ నదీతీరంలో వాసం ఏర్పరచుకున్నాడు. కుశమహారాజు కూతురుగనుక ఆమె కౌశిక అయింది.

ఈ నది భగత్‌పూర్ జిల్లా గుండా ప్రవహిస్తున్నది. దీనికి 'గౌరి' అనే పేరు గల చిన్న ఉపనది గూడా ఉంది. 734 కిలోమీటర్లు ప్రవహించి ఈ నది బీహారులో గంగా సంగమము చేస్తున్నది.

**1. 3 రామగంగ :** ఇది గర్వాల్ జిల్లాలో దూదతోలీకొండలలో పుట్టి మోరదాబాద్, రాంపూర్, షహజహాన్‌పూర్‌ల గుండా ప్రవహించి కనోజీ

దాటిన తరువాత గంగానదితో కలుస్తుంది. రాముడికి ఈ నదికి సంబంధం ఏమయినా ఉందో లేదో తెలియదు కానీ దీని పేరు మాత్రం రామగంగ. ఇక్కడ కొబ్బరిపంట ప్రశస్తమయింది.

**1. 4 గోమతి :** ఇది 'ఫిలిబిత్' అనే చోట పుట్టి షహజహాన్‌పూర్ జిల్లా గుండా ప్రవహిస్తుంది. లక్నోదాటిన తరువాత దీనికి 'సై' అనే ఉపనది కలుస్తుంది. వారణాసి కూడా దాటిన తరువాత సైద్‌పూర్ దగ్గర గంగతో కలుస్తుంది.

పురాణాలలో గోమతి వశిష్ఠుని కూతురు అని ఉంది.

గోమతి అనే పేరుతో ద్వారక, డాకూర్‌ల దగ్గర గూడా చిన్న చిన్న నదులు ఉన్నాయి.

**1. 5 శోణభద్ర :** ఇది కూడా అమరకంటకము వద్ద పుట్టింది. ఉత్తర ప్రదేశ్ వారికి శోణభద్రా పవిత్రమయిన నది. శోణభద్రా, గంగానదుల సంగమము దగ్గరే గజేంద్రమోక్షము జరిగిందని చెప్తారు. నేటికి ఇది తీర్థస్థలముగా పేరు పొంది ఉంది. శోణనదీ తీరాన శోణపురమనే పట్టణం కూడా ఉంది. శోణభద్రానదిలో దొరికే శిలలను మణులు అంటారు. వాటిని గణపతికి ప్రతీకగా దేవతాపీఠంలో పెట్టిపూజిస్తారు.

**1. 6 తమస :** తమసానది అనగానే మనకు రామాయణం గుర్తుకు రావాలి. ఈ నదీతీరాననే వాల్మీకి మహర్షి ఆశ్రమం ఉంది. తమసానది ఒడ్డునే బోయవాడు క్రౌంచ పక్షిని చంపడం, ఆ నదికి స్నానానికి వచ్చిన వాల్మీకి మహర్షి అది చూసి బోయవాణ్ణి శపించడం, ఆ శాపం శ్లోకంగా రావడం ఆ కవితా హృదయంతో రామాయణం వ్రాయడం జరిగింది. ఈ తమసానది అలహాబాద్ దాటాక 'లోనస్ – బల్లియ' అనే గ్రామాలమధ్య గంగానదితో కలుస్తున్నది. ఇప్పుడు దీన్ని టోన్స్ నది అంటున్నారు. దీని పొడవు 264 కి.మీ.



**1. 7 గండకి :** ఈ నది హిమాలయాలలోనే పుట్టింది. సంస్కృతంలో దీన్ని 'హిరణ్యావతి' అంటారు. ఈ నది శిలలకు ప్రసిద్ధి. గండక శిలలను ప్రత్యేకంగా సాలిగ్రామాలని పిలుస్తారు. వీటిని దేవతా పీఠంలోపెట్టి పూజిస్తారు. సాలిగ్రామాలలో వివిధ రూపాలు ఉంటాయి. రూపాలను బట్టి వాటిని – హరి, విష్ణు, కృష్ణ, రామ, నృసింహ సాలిగ్రామాలని వ్యవహరిస్తారు. సాలగ్రామాలు లభించడం వల్ల గండకీనదికి 'సాలిగ్రామీ' అనే పేరు వచ్చింది.

గండకీనదికి కాళీనది, చక్రనది అనే పేర్లు కూడా ఉన్నాయి.

శివపురాణంలో – సతీ తులసీదేవి – గండకీ నదిగా రూపొందింది అని ఉంది. తులసి పార్థివశరీరం గండకీ నదిగా, ఆమె కేశాలు తులసిచెట్టుగా పుట్టాయి. విష్ణువుకు తులసి పై అత్యంతప్రీతి. అందువల్లనే విష్ణు సంబంధమైన సాలిగ్రామాలను తులసి దళాలతో అర్చిస్తారు. విష్ణువు తులసిమాలను ప్రీతితో ధరిస్తాడు. ఈ నది శరవన్ – ముజఫర్ పూర్ జిల్లాల నడుమ గంగానదితో కలుస్తున్నది. కలిసేముందు ఈ నదిలో ఏడుపాయలు వచ్చి కలుస్తాయి – అవి కాళీ, నారయణీగండకీ, భూరిగండకీ, త్రిశూలీ గండకీ, కృష్ణగండకీ, దుద్‌కోలాగండకి, ముషికోలాగండకీ, ద్రుహి కోలాగండకీ అనేవి. ఈ పాయలన్నీ కలిసిన చోటుకి 'సప్తగండకీ' అనిపేరు.

**1. 8 సరయు :** ఇది ఇక్ష్వాకుల రాజధాని అయిన అయోధ్యా పట్టణాన్ని ఆనుకుని ప్రవహిస్తున్నది. వేదకాలపు ప్రసిద్ధ నదులలో సరయునది ఒకటి. యజ్ఞవేళలో ఆహ్వానించే ఇరవై ఒక్కనదులలో సరయూనది కూడా ఉంది. ఈ నది మానససరోవరం నుండి పుట్టిన నదులలో ఒకటి. పౌరాణికగాథలలో ఈ సరయూనది శ్రీమహావిష్ణువు ఎడమపాదం నుండి పుట్టిందని ఉంది. ఈ నదీముఖద్వారం దగ్గర ఏర్పడిన తీర్థంలో రుద్రుని పూజిస్తే రుద్రత్వాన్ని, విష్ణువును పూజిస్తే విష్ణుత్వాన్ని పొందుతారనిచెప్తారు.

నేడు ఈ సరయూనదిని – అయోధ్యప్రాంతీయులు – సర్జునది అని వ్యవహరిస్తున్నారు. భారతీయుల పవిత్ర గ్రంథం రామాయణం. రామాయణంలోని అనేక ఘట్టాలు ఈ నదీతీరాన నిర్వహింపబడ్డాయి. శ్రీరామాదుల అవతారపరిసమాప్తి సరయూనదిలోనే జరిగింది.

సరయూ అయోధ్య పరిసరాల్లో పెద్దనది. పుణ్యనదికూడా.

ఈ చెప్పుకున్నవి కాక గంగానదికి ఇంకా – నూతభాగమతి, పున్ పున్, ఫల్గు, ఆజయ, రూపనారాయణ, పాహర్ అనే ఉపనదులు పెక్కు ఉన్నాయి. నదులలోకల్లా పెద్దది కావడమే కాక గంగానది కుటుంబం కూడా చాలా పెద్దది.

గంగానదీ పరీవాహక ప్రదేశంలో పాతికకుపైగా నదులు ఉండడం విశేషమయినవిషయం.

కాలి, హుగ్లీ, దామోదర్, బరకార్, జలంగి, చూర్ణి, ఇచ్ఛామతి, మయూరాక్షి, ద్వారకేశ్వరి, ముందేశ్వరి, మేఘన, అత్రై, మహానంద, బృహినందకి, అనే పేరుగల నదులన్నీ గంగానది కుటుంబాన్ని జలోపేతమే కాక బలోపేతం కూడా చేస్తున్నాయి.

* * *



# ౨. యమున

ఈ యమునా నది కూడా గంగానదికి ఉపనది. కాళింది అనీ, సూర్య తనయా! అనీ కూడా యమునానదికి పేర్లు ఉన్నాయి.

భారతదేశపు రాజధాని నగరమయిన 'ఢిల్లీ' ఈ నది ఒడ్డునే ఉంది.

యమునకు 'సూర్యతనయా' అనే పేరు ఉందని చెప్పుకున్నాము కదా. యమున సూర్యుని పుత్రిక అన్నమాట. అయితే ఈమె సూర్యునకు సంజ్ఞాదేవికి పుట్టింది. యమునకు యమధర్మరాజు సోదరుడు. వాళ్ల పేర్లు కూడా ఒకేలా ఉన్నాయి. యముడు – యమున.

యమునా నదిని తలుచుకోగానే రాధాకృష్ణులు జ్ఞప్తికి వస్తారు. యమునానదీ తీరాన శ్రీకృష్ణుడు రాధాదేవితో ఎన్నో రాసక్రీడలు జరిపి ఉన్నాడు. రాధామాధవుల ప్రణయ సంగీతాన్ని యమునా తరంగాలు నేటికీ గానం చేస్తూనే ఉంటాయి. శ్రీకృష్ణుని బాల్యము, యౌవనము, మధుర, బృందావనములు యమునతో సంబంధమున్నవి. బాలకృష్ణుని బాల్యక్రీడలను, రాసక్రీడలను కనులారా దర్శించిన ధన్యురాలు యమున.

అసలు పుట్టినవెంటనే వసుదేవుడు బాలకృష్ణుని వ్రేపల్లెకు తీసుకుని వెళ్ళేటప్పుడు యమునానది భక్తితో రెండుగా చీలి దారి యిచ్చింది. భగవత్కార్యానికి తోడ్పడింది.

యమునానదిని దాటుతూ ఉండగానే పరాశరమహర్షి – పడవ నడిపే సత్యవతిని చూసి మోహించాడు. ఆమెకు కన్యత్వం చెడకుండా ఉండే వరం ఇచ్చి – నల్లని ద్వీపాన్ని ఏర్పాటు చేసి ఆమెయందు ఒక పుత్రుణ్ణి కన్నాడు. అతడే వేదాలను వింగడించిన వేదవ్యాసుడు. నల్లని ద్వీపంలో పుట్టినకారణంగా కృష్ణద్వైపాయనుడనే పేరుకూడా వచ్చింది. ప్రజ్ఞా సంపన్నుడు, బ్రహ్మజ్ఞాని, ఆర్షసంస్కృతీ పరిరక్షకుడు అయిన – జగద్గురువు వేదవ్యాసుడు యమునానదీ తీరంలో పుట్టడం యమునకు గర్వకారణం కదా!

విష్ణుపురాణంలో యమునానదికి బలరాముడికి మధ్య జరిగిన వైరం కథ వివరింపబడి ఉంది. బలరాముడొకసారి యమునా నదిని తన దగ్గరకు వచ్చి తనకు స్నానం చేయించమన్నాడట. యమున అలా చెయ్యలేదు. ఆ కోపంతో బలరాముడు తన నాగలితో యమునానదీ ప్రవాహాన్ని మళ్లించేసాడట. అదీ కథ.

ఈ నది హిమాలయాలలో భండార్‌పంచ్ అనే శిఖరానికి ఎనిమిది మైళ్ల దూరంలో కాళింది అనే చోట పుట్టి జమునోత్రి అనే పేరున ప్రవహిస్తున్నది. యమున పుట్టిన, పర్వతశిఖరాలలో ఒక శిఖారానికి 'బందర్‌పూంచ్' అనిపేరు. అంటే కోతి తోక అని అర్థం. లంకాదహనానంతరం హనుమ తన తోకను ఈ ప్రాంతంలోనే చల్లార్చుకున్నాడట.

కాళింది అనే శిఖరంవద్ద పుట్టడం వల్లనే ఈ నదికి కాళింద కన్య, కాళింది అనే పేర్లు వచ్చాయి.

ముజఫర్ నగర్ నుండి యమునానది దక్షిణంగా ప్రవహించి, ఢిల్లీ, మధుర, ఆగ్రాల గుండా వెళుతూ – రాజస్థాన్‌లో చంబల్‌నదితో కలిసి కాన్పూర్, ఫతేపూర్, అలహాబాద్‌లలో ప్రవహించి చివరకు ప్రయాగ వద్ద గంగాసంగమము చేస్తున్నది. ఈ యమునా గంగానదులు కలిసే తావుకే త్రివేణీ సంగమమని పేరు. త్రివేణి అంటే మూడు పాయలన్నమాట. ఒకటి గంగ, రెండోది యమున. మూడోది సరస్వతి. సరస్వతి అనే ఈ నదికూడా ప్రయాగలో గంగానదితో కలుస్తోంది. అట్లా ప్రయాగలో మూడు నదులు కలవడంవల్ల దానికి త్రివేణి సంగమమని పేరు వచ్చింది. ఈ త్రివేణీ సంగమంలో స్నానం సకలపాపహరమని చెప్తారు.

ఈ త్రివేణీ సంగమంలోని మూడు నదులనూ వేరువేరుగా గుర్తించ వచ్చు.

గంగానదీ జలాలు స్వచ్ఛమయిన తెలుపులో ఉంటాయి. యమునా నదీజలాలు ఒక్కింత నలుపు ఛాయతో వేరుగా తెలుస్తూ ఉంటాయి. సరస్వతి



ఆకుపచ్చరంగుతో అంతర్వాహినిగా ఉంటుంది. ఇది కనీకనిపించకుండా ఉంటుంది. పవిత్ర పుణ్యతీర్థాలలో ప్రయాగ ఒకటి.

గంగా యమునల 'దోఆబ్' చాలా సారవంతమయినది. 'దోఆబ్' అంటే రెండు నదుల మధ్య ప్రదేశమన్నమాట. ఈ దోఆబ్ వలన ఉత్తరప్రదేశ్‌లోని భూమి సారవంతమైనదైయింది. చక్కని పంటలు పండుతున్నాయి.

ప్రపంచ ప్రసిద్ధికెక్కిన 'తాజమహల్' యమునానది ఒడ్డునే ఉంది. మొగల్ చక్రవర్తుల జీవితాన్ని ఆమూలాగ్రంగా చూసిననది యమునా నది. ఫిరోజ్‌షాతురక్, అక్బర్, షాజహాను చక్రవర్తులు యమూనా నది నుండి నాలుగు దిక్కుల కాలువలు ఏర్పరిచారు. నేడు ఈ కాలువల వల్ల రెండులక్షల ఎకరాలు సాగుచేయ బడుతున్నాయి.

యమునానది తీరంలో – మహాభారతయుద్ధం, పానిపట్టు యుద్ధాలు, మహమ్మదీయులు – రాజపుత్ర యుద్ధాలు జరిగాయి. చారిత్రకంగా యమునా నదికి ప్రసిద్ధి అధికం.

యమునానదితో సంబంధంగల పర్వం ఒకటి భారతీయులు నేటికీ భక్తితో జరుపుకుంటున్నారు. అది 'యమద్వితీయ'. దీపావళి పండుగ వెళ్లిన రెండో రోజున – అంటే కార్తీక శుక్లవిదియనాడు ఈ పండుగ చేసుకుంటారు. దీనికే భ్రాతృద్వితీయ అనికూడా పేరు.

ఈ నాడు ప్రతి సంవత్సరం యముడు యమునా నది ఇంటికి వస్తాడు. వచ్చిన అన్నగారిని ఆనందంతో స్వాగతించి యమునా నది ఆతిథ్యం ఇస్తుంది. భక్తితో సత్కరిస్తుంది. చెల్లెలు పెట్టిన భోజనాన్ని ఆరగించి ఆనందించిన యముడు చెల్లెల్ని సర్వసౌఖ్యాలతో, సుమంగళిగా జీవించమని నిండు మనస్సుతో ఆశీర్వదిస్తాడు. అన్నాచెల్లెళ్ల అనురాగాన్ని వ్యక్తీకరించే ఈ పండుగను – భారతీయుల ఇళ్లలో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ భ్రాతృద్వితీయనాడు అన్నదమ్ములు సోదరి ఇంటికి వెళ్లి భోజనంచేసి ఆమెను దీవించి శక్తికొలది కానుకలిచ్చివస్తారు. యమద్వితీయ ఇంతటి సంస్కార

సంపన్నమయిన పర్వదినం. యమునా నది ఏర్పరచిన సామాజిక పరమైన ఆనందకరమైన పండుగ ఇది. దీనినే 'భగినీహస్తభోజనం' అని కూడా వ్యవహరిస్తారు.

భారతీయులు చేసే యాత్రలలో చార్‌ధామ్ యాత్ర ఒకటి ప్రసిద్ధమైనది. 'చార్‌ధామ్' అంటే నాలుగు క్షేత్రాలు అవి. యమునోత్రి, గంగోత్రి, బదరీనాథ్, కేధార్‌నాథ్. చార్‌ధామ్ యాత్ర యమునోత్రితో ఆరంభించడం సంప్రదాయం. హరిద్వార్ నుండి 235, హృషీకేశ్ నుంచి 221కిలో మీటర్ల దూరంలో యమునోత్రి ఉంది. యమున పుట్టిన కాళింది శిఖరందాకా వెళ్లే వీలు లేదు కనుక ఆదిశంకరాచార్యులు ఇక్కడ యమునానదికి ఆలయం ఏర్పాటు చేసినట్లు చెప్తారు. తాబేటి మీద నీటికడవతో యమునాదేవి నిలబడి పూజలందుకుంటూ ఉంటుంది.. ఆమెపాదాల నుండినీరు చిమ్ముతూ భక్తులను పునీతులను చేస్తోంది.

'కీర్తనాత్ పాపనాశనీ' అని యమునకు పేరు. అంటే – కీర్తిస్తే చాలు మనపాపాలు పోగొట్టేనది యమున.

యమునానది ప్రశస్తిని గమనించి, బ్రెజిల్‌దేశంలో ఒకచిన్న ప్రవాహానికి 'నవ యమున' అని పేరుపెట్టారు.

ఈ నదిని కీర్తిస్తూ శంకరాచార్యులవారు రెండు అష్టకాలను వ్రాసారు.

**2.1 చంబల్ :** యమునానదికి చంబల్ అనే నది ఉపనది.

చంబల్ నదిని ప్రాచీనకాలంలో 'చర్మణ్వతి' అని పిలిచేవారు. ఈ నదికి ఈ పేరు రావడానికి కారణమయిన విషయం ఒకటి ఉంది.

చర్మణ్వతి అంటే – చర్మములతో కూడినట్టిది అని అర్థం. నదికీ చర్మాలకీ సంబంధమేమిటో చూద్దాం.

ప్రాచీనకాలంలో రంతిదేవుడనే రాజు యజ్ఞ యాగాదులు చాలా చేసి ఎంతో కీర్తిగడించాడు. భాగవతంలో ఈ రంతిదేవుని కథ ఉంది.



ఈ రంతిదేవుడు ఈ చంబల్ నదీ తీరాన ఎన్నో యజ్ఞాలు చేసాడు. ఆ యజ్ఞాలలో లెక్కలేనన్ని పశువులను బలి ఇచ్చేవారు. వాటి రక్తంతో కలిసి ఈ నదిలో నీరు ఎఱ్ఱగా ఉండేది. అప్పట్లో సంతర్పణకుగాను వేలాది జంతువులను నరుకుతూ ఉండేవారు. ఆ రోజుల్లో మాంసాహారం నిషేధం కాదన్న మాట. అలా చంపిన జంతువుల చర్మాల్ని ఈ నది ఒడ్డున ఎండబెట్టే వారు. చర్మాలు ఎండబెట్టడం వల్ల ఈ నదికి చర్మణ్వతి అనే పేరు వచ్చింది.

ఈ నది ఆరావళి పర్వతాలలో పుట్టి ఇండోర్ గుండా ప్రవహించి యమునా నదితో కలుస్తోంది. పార్వతికున్, కలిసింద్ అనే చిన్న నదులు చంబల్ నదికి ఉపనదులు.

చంబల్ నదికి క్షిప్ర అనే మరో నది కూడా ఉపనది.

**2.2 క్షిప్ర :** ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకడయిన మహాకాలుడు ఉజ్జయినీ నగరాన వెలసి ఉన్నాడు. ఆ నగరాన్నీ ఈ లింగాన్నీ రోజూ చూస్తూ ప్రవహిస్తూ ఉండే నది క్షిప్ర. దీన్నే 'అవంతి నది' అని కూడా అంటారు.

'కొక్రిబర్ది' కొండలలో పుట్టి 86 కిలోమీటర్లు ప్రవహించి ఇది ఉజ్జయినిలో ప్రవేశిస్తోంది. మొత్తం 192 కిలోమీటర్లు ప్రవహించిన క్షిప్ర, చంబల్ నదితో కలుస్తున్నది.

ఈ నదిని మునీశ్వరులు ఎంతో పవిత్రమయిన దానిగా భావించేవారు. విష్ణుమూర్తి రక్తబిందువు నుండి ఈ నది ఏర్పడిందని చెప్తారు.

దీని నీటికి ఒక ప్రత్యేకత ఉంది. అక్కడక్కడ అప్పుడప్పుడు ఈ నదిలో నీరు పాలవలె తెల్లగా మధురంగా ఉంటాయని నేటికీ అచ్చటి ప్రజలు నమ్ముతున్నారు.

యమునా నది ఉపనదులలో చంబల్ తరువాత చెప్పుకో దగ్గవి రెండు ఉన్నాయి. ఒకటి కౌన్, రెండవది బెట్వా.

**2.3 కౌన్ :** దీన్ని సంస్కృతంలో 'కర్ణావతి' అంటారు. ఇది కైమూర్ కొండలలో పుట్టి, ఉత్తర ప్రదేశ్ లోని బంది జిల్లాలోనికి ప్రవేశిస్తున్నది. 161 కిలోమీటర్లు ప్రయాణం చేసి, ఈ నది యమునా నదితో కలుస్తున్నది. ఈ నది చాలా లోతుగా ఉండి నౌకా యానానికి వీలుగా ఉంటుంది.

అంతేకాకుండా ఈనదిలో – రంగురంగుల రాళ్లు బొమ్మరాళ్ళు దొరుకుతాయి. వాటిని సానపెట్టి రకరకాల ఆభరణాలు తయారు చేస్తున్నారు. రాళ్ల గాజులు, గొలుసులు మొదలయినవి ఈ రాళ్లతో తయారు చేయబడు తున్నాయి.

గంగానది ఉపనది "సోన్" బంగారం ఇస్తుందని చెప్పుకున్నాము. ఈ "కౌన్" నది రాళ్లను ఇస్తుంది. ఇంక కొదవ ఏమిటి? నదులు నగలు చేయించుకోవడానికి కూడా ఉపయోగపడుతున్నాయి.

ఈ కౌన్ నది బందో జిల్లా దాటిన తరువాత రాతి ఒడ్లతో ఉండి ఖరేనీ, అనే చోట తన అందాన్నంతా ప్రదర్శిస్తూ కన్నుల పండువుగా ఉంటుంది.

**2.4 బెత్వా :** బెత్వానదిని సంస్కృతంలో వేత్రపతి అంటారు. వేత్రపతి అంటే బెత్తములను ధరించినది అని అర్థం. ఈ నదిలో బెత్తములు చాలా కొట్టుకొని వస్తూ ఉండేవి కాబోలు. అందుకే ఈ పేరు వచ్చి ఉంటుంది.

ఇది శివోర్ జిల్లాలో పుట్టి – 80 కిలోమీటర్లు ప్రవహించి విదిశా నగరంలో ప్రవేశిస్తోంది. అక్కడ నుండి ఉత్తర ప్రదేశ్‌లో లలిత్‌పూర్ గుండా వెళ్లి హమిర్‌పూర్‌వద్ద యమునానదిలో పడుతోంది. దీని మొత్తం పొడవు 304 కిలోమీటర్లు.

పాండవులు ఈ నది ఒడ్డున విదిశా నగరపు రాజుతో యుద్ధం చేసినట్లు భారతంలో ఉంది. ఇప్పటి వరకు మనం చెప్పుకున్న నదులన్నీ గంగానదికి సంబంధించినవే. గంగ, దాని ఉపనదులు. గంగానది ఉపనదులయిన బ్రహ్మపుత్ర, యమున, వీటి ఉపనదులు గురించి తెలుసుకున్నాము. దీన్నిబట్టి ఈ నదులన్నీ గంగతో కలిసి సముద్రంలో కలుస్తున్నాయని తేలింది.



# 3. సరస్వతి

ఋగ్వేదకాలంలో ప్రసిద్ధికెక్కిన నది సరస్వతి. ఋగ్వేదంలో – నదీ సూక్తంలో 'అంబితమే, నదీతమే, దేవితమే సరస్వతీ' అని కీర్తింపబడింది – ఉత్తమమాత, ఉత్తమనది, ఉత్తమ దేవత – సరస్వతి అని కొనియాడబడింది – పవిత్రమయిన త్రివేణి సంగమంలో గంగా, యమునలతో పాటుగా కలిసి ప్రవహించేనది సరస్వతి. యమున, సట్లెజ్ నదుల మధ్యగా ప్రవహించి అలహాబాద్ దగ్గర గంగా నదితో సంగమిస్తోంది. వేదాలలోనూ, జైమినీయ బ్రాహ్మణంలోను, మహాభారతంలోనూ ఈ సరస్వతీ నది ప్రస్తావన ఉంది. మహాభారత యుద్ధం జరిగిన కురుక్షేత్రం సరస్వతీనదీ తీరాననే ఉందని భారతం చెప్తోంది.

'సరస్వతీ నాగరికత' – అనేపేర ఆర్యావర్తంలో మొట్ట మొదట నాగరికత ఆరంభమైనది ఈ సరస్వతీ నదీ తీరంలోనేనని పరిశోధకులు చెప్తున్నారు. సరస్వతీ నాగరికత తరువాత పుట్టిపెరిగినదే సింధు నాగరికత. అయితే సరస్వతీనది అదృశ్యమై అంతర్వాహిని కావడంతో ఆ నాగరికత, పేరు మరుగునపడిపోయింది. సింధునది జీవంగా దృశ్యమానం కావడంవల్ల సింధునాగరికత బ్రతికి బట్టకట్టింది.

సరస్వతీనదీ తీరం యజ్ఞాలు చేయడానికి పవిత్రమైన స్థలంగా భావించేవారు. ఈ సరస్వతీ నదీ మాత ఏడు పేర్లుతో వివిధ సందర్భాల్లో ఆ యా మునులకు, దేవతలకు యజ్ఞవేదికల సమీపాన ప్రవహించి ఆ యాస్థలాలను పవిత్రీకృతం చేసింది. అవి –

బ్రహ్మ యాగం చేసినప్పుడు – 'సుభద్ర' గా

నైమిశారణ్యంలో మునులు చేసినప్పుడు – 'కనకాక్షి'గా

గయుడు యాగం చేసినప్పుడు – 'విశాల'గా

ఉద్దాలకుడు యాగం చేసినప్పుడు – 'సురతన్వి'గా

వశిష్ఠుడు యాగం చేసినప్పుడు – 'ఓఘమాల'గా

బృహస్పతి యాగం చేసినప్పుడు – 'సువేణి'గా

బ్రహ్మ మరో యాగం చేసినప్పుడు – 'విమలోదక'గా

ఏడు రూపాలతో – ఏడు పేర్లతో వచ్చి పూజింప బడడం వల్ల – ఆ నదీమతల్లి 'సప్త సారస్వతం'గా పేరుపొందింది.

ఆర్యుల జీవనం, ఆర్యనాగరికత – వేదవిజ్ఞాన సముపార్జన, వేద విజ్ఞాన విస్తరణ ఈ నదీతీరం నుండే ఆరంభమయింది.

'సప్త సారస్వతం'గానే కాక ఈ నది 'సప్త సింధుప్రదేశం' అనే పేరుకు కూడా కారణమయింది.

సరస్వతినది హిమాలయాలలో పుట్టింది. సింధు, దాని ఉప నదులయిన – జీలం, చీనాబ్, రావి, సట్లెజ్, బియాస్ అనే ఆరు నదులతో కలసి ప్రవహించి అరేబియాసముద్రంలో కలిసింది. ఈ ఏడు నదులు ప్రవహించిన పవిత్ర ప్రదేశమే సప్తసింధు ప్రదేశంగా ఆర్యావర్తంగా ప్రసిద్ధి కెక్కింది.

హిమాలయ పర్వత శిఖరాల్లో బందాపుంచ్ మాశిఫ్ అనే చోట పుట్టి – ఆది బద్రి, భవానీపూర్, బల్‌చాపూర్‌ల వద్ద మైదానం ప్రదేశంలో ప్రవేశించి – పంజాబ్, హరియానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల గుండా ప్రవహించి రాణాకచ్ దగ్గర అరేబియా సముద్రంలో కలిసింది.

దృశద్వతి అనే నది సరస్వతీనదికి ప్రధాన ఉపనది. ఆరావళీ పర్వతాలతో సమాంతరంగా రాజస్థాన్ థార్‌ఎడారిలో అంతర్వాహినిగా ప్రవహించినట్లు ఆమెరికా ఆధునిక శాస్త్రవేత్తలు సాట్‌లైట్ చిత్రాల ద్వారా కనుగొన్నారు.



బదరీనాథ్ నుండి 3 కి.మీ దూరంలో మాన అనే చిన్నఊరు ఉంది. అక్కడ సరస్వతీనది తన విశ్వరూపం చూపిస్తూ అతివేగంగా ప్రవహిస్తూ ఉంటుంది. ఈ సమీపంలోనే వేదవ్యాసుడు చెప్పగా వినాయకుడు మహాభారతం వ్రాసాడని స్థలపురాణం చెప్తోంది. వ్యాసగుహ, గణేష్ గుహకూడా ఉన్నాయి అక్కడ.

మహాభారత రచనే కాదు, భారతంలోని మహాప్రస్థాన పర్వవిషయాలతో కూడా సరస్వతీనదికి సంబంధం ఉంది.

పంచపాండవులు ద్రౌపది మహా ప్రస్థానయాత్రలో – ద్రౌపది, సహదేవుడు, నకులుడు అర్జునుడు పడిపోయాక – భీముడు ఈ సరస్వతీ నదినిదాటి వెళ్లడానికి ఒక పెద్దరాతిని అక్కడ పడవేశాడు. దాటుతూ తానుపడి మరణించాడు. ధర్మరాజు, కుక్కా మాత్రమే సరస్వతీ నదిని దాటి వెళ్లారు స్వర్గలోకానికి.

మాన అనే ఊరు భారత చైనా సరిహద్దు సమీపంలో ఉంది.

1985లో వైదిక సరస్వతీనది వివరాలు సేకరించడానికి ఒక పరిశోధనా సంస్థ ఏర్పడింది. ఇప్పటికీ ఈ నదిమీద పరిశోధనలు జరుగుతున్నాయి. సరస్వతీ నది సముద్రం వరకు ప్రవహించలేదనీ ప్రవాహమధ్యం లోనే అంతరించిందనీ కొన్నిరచనలు వివరిస్తున్నాయి.

మహాభారత యుద్ధసమయంలో బలరాముడు ఇరుపక్షాలలో ఎవరిపక్షం వహించక తీర్థయాత్రలకు వెళ్లిపోతాడు. ఆ ప్రయాణంలో అతడు శుష్కించి పోయిన సరస్వతీతీరం గుండా వెళ్లినట్లు భారతం చెప్తోంది, ఈ నదీతీరాన గల కురుక్షేత్రం సమీపాన 'వినాశన' అనీ 'అదర్శన' అనేపేరుగల చోటనే సరస్వతీనది అంతరించిపోయింది. అసలు సరస్వతీ ప్రవాహం నాశనం కావడం వల్ల – 'వినాశన' అనీ, సరస్వతి కనబడకుండా పోవడం వల్ల –

'అదర్శన' అనీ ఈ తావుకు పేర్లు వచ్చాయని చెప్తారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఘఘర్ అనేనది ఉంది. అది వర్షాకాలంలో కనిపిస్తుంది. ఎండాకాలంలో ఎండి పోతుంది. సరస్వతి రూపమే ఈ ఘఘర్ అని నమ్మే స్థానికులు కూడా ఉన్నారు.

ఈ నదీ ప్రవాహంలో విచిత్రమేమంటే కొంతదూరం అదృశ్యమై మళ్లీబయట పడుతూఉండడం. ఛాలేర్ అనేచోట అదృశ్యమై బరఖీర అనేచోట కనబడుతుంది.

ఈ నది ఇలా అదృశ్యం కావడానికి కారణం ఒకటి భారతం వివరిస్తోంది.

ఒకసారి విశ్వామిత్రుడు వసిష్ఠమహర్షిని వంచించడం కోసమని సరస్వతీ నదిని స్మరించాడు. ఈ నది విశ్వామిత్రుని కోరికమీద వశిష్ఠుని తీసుకొని వచ్చింది. వశిష్ఠుణ్ణి సంహరించడం కోసం విశ్వామిత్రుడు ఆయుధం కోసం వెదకసాగాడు. సరస్వతీనది విషయం గ్రహించి ఒక్కసారిగా పొంగింది. వశిష్ఠుడు ఆ ప్రవాహంలో కొట్టుకొని పోయాడు. విశ్వామిత్రుడు ఆయుధంతో తిరిగి వచ్చేసరికి వశిష్ఠుడు కనబడలేదు. సరస్వతి ఏదో చేసి ఉంటుందని విశ్వామిత్రుడు ఆమెను ఎండిపోవలసిందిగా శపించాడు.

సరస్వతీనది అదృశ్యమైపోయిందనే మాట ప్రబలంగా వినిపిస్తూన్నా భారతదేశం మొత్తం మీద ముప్ఫైకి పైగా నదులు సరస్వతి పేరుతో వ్యవహరింపబడుతున్నాయి. అక్కడా అక్కడా ఉండి – సరస్వతి ఉనికిని నిలబెడుతున్నాయి.

జైనులు పుణ్యక్షేత్రమైన ఆబూపర్వతశిఖరాల్లో ఒక సరస్వతీనది పుట్టి ప్రవహిస్తోంది.

శ్రీకృష్ణనిర్యాణం జరిగిన ప్రభాసపట్టణం వద్ద నదికి కూడా సరస్వతి అనేపేరు.



ఆర్షసంస్కృతికి బీజం వేసిన ఈ సరస్వతీనది ఎంతో పవిత్రమయిందిగా ప్రసిద్ధిపొందింది.

తన మామగారయిన దక్షప్రజాపతి వల్ల క్షయరోగిగా శాపం పొందిన చంద్రుడు – ఈ నదీస్నానం వల్ల ఆ క్షయరోగాన్ని పూర్తిగా పోగొట్టుకున్నాడు.

ఇంద్రుడు తన బ్రహ్మహత్యాపాతకాన్ని ఈ నదీ స్నానంవల్లనే పోగొట్టుకున్నాడు.

వరుణుడు జలాధిపతి కావడం, కుబేరుడు ధనాధిపతి కావడం ఈ నదిని అర్చించడంవల్లనే అని పురాణాలు చెప్తున్నాయి.

వేదకాలం, ఇతిహాసపురాణ కాలం నుండి అతిప్రసిద్ధి కెక్కిననది సరస్వతి. 'ప్రసరణం సర్వత్ర అస్తీతి సరస్వతీ' సర్వత్రప్రసరిస్తూ ఉంటుంది గనుక సరస్వతి అని ఈ నదికి పేరు. దృశ్యాదృశ్యం గా సర్వత్రా మాత్రమే కాదు సర్వకాలాల్లో ప్రవహిస్తూనే ఉంటుంది సరస్వతీనదీమతల్లి.

* * *

# 4. బ్రహ్మపుత్ర

గంగానది ఉపనదులలో బ్రహ్మపుత్ర చాలా పెద్దది. నిజానికి ఇది గోదావరి, కృష్ణ నదులకంటె పెద్దది. కాని ఇది గంగానదిలో కలియడంచేత ఉపనదిగా చెప్పుకొనవలసి ఉంది.

నదుల పేర్లలో పురుషనామం గల నది ఇది అని చెప్పుకున్నాం కూడ. ఇక్కడ ఒక తమాషా కూడా ఉంది. బ్రహ్మ విష్ణుమూర్తి నాభిలో నుండి పుట్టాడు. అంటే బ్రహ్మకు తల్లి కూడా విష్ణుమూర్తే కదా. తన తండ్రిలాగే బ్రహ్మకూడా స్వయంగా ఒక పుత్రుణ్ణి కన్నాడన్న మాట. అదే బ్రహ్మపుత్ర అయింది.

బ్రహ్మపుత్రానది హిమాలయాలలో మానససరోవరంలో పుట్టింది. టిబెట్టు లోని, 'టన్సెపో' అనే నదీ ప్రవాహం, ఇదీ ఒకటే అంటారు. టిబెట్టు నుండి హిందూదేశం లోనికి ప్రవహించే ఈ నది పొడవు చాలా ఎక్కువ.

లూహిత్, దేహాంగ్ అనేవి బ్రహ్మపుత్రానదికి ఉపనదులు. ఈ నది అస్సాం రాష్ట్రంగుండా ప్రవహిస్తున్నది. ప్రాచీన కాలంలో దీన్ని లౌహిత్యనది అనేవారు.

అస్సాంలోని పుణ్యతీర్థాలన్నీ బ్రహ్మపుత్రానది ఒడ్డునే ఉన్నాయి. నీలాచలం మీద కామాఖ్యదేవి దేవాలయం బ్రహ్మపుత్ర ఒడ్డునే ఉంది. ఇది ప్రసిద్ధ శక్తి పీఠాలలో ఒకటి.

బ్రహ్మపుత్రానదిలో కొట్టుకుని వచ్చే ఒండ్రుమట్టి చాలా సారవంత మయినది. అస్సాంకి ఇది ఇంత సారవంతమయిన మట్టిని ఇస్తున్నప్పటికీ వరదల వల్ల నష్టాన్ని కూడా కలగజేస్తోంది. ప్రతి సంవత్సరం ఈ నది తన ప్రవాహమార్గాన్ని మార్చేస్తూ క్రొత్తదారి తొక్కుతూ ఉంటుంది.



బ్రహ్మపుత్రానది 'గోలండు' దగ్గర గంగానదితో కలుస్తోంది. గంగ బ్రహ్మపుత్ర కలిసిన తరువాత ఆ నదిని పద్మానది అని పిలుస్తారు. ఉపనది కలవడంతో అసలు నదుల పేర్లు మారడం ఇక్కడ ఒక్కచోటనే కనిపిస్తుంది. నేటికీ అది పద్మానది అని పిలవబడుతోంది.

అతి దీర్ఘమైన ఈ బ్రహ్మపుత్రానది మీద ఇరవైకి పైగా డామ్‌లు కట్టారు. నారాయణ సేతు అనేది ఒకటి. గంగానదికి లాగే ఈ నదికి కూడా ఉపనదులు ఎక్కువ.

కిఇచ్చు, సుబన్‌సిరి, కామెన్‌గ, ధనసిరి, మాన, చంపావతి, మేఘన, సరళభంగ్, డిబోన్‌గ అనేవి దీని ఉపనదులు.

ఈ నది నిడివి – 2900 కిలోమీటర్లు

* * *

## 5. సింధు

సింధునది ఋగ్వేదకాలం నుండి ప్రసిద్ధి కెక్కింది. గంగానదితో సాటి రాగల నది ఈ సింధునది. మన హిందూ దేశానికి ఆ పేరు రావడానికి 'సింధు' నది కూడా ఒక కారణమని చెప్పుకున్నాము. ఆర్యుల నాగరికత ప్రారంభమయ్యింది ఈ సింధునదీ తీరాననే. హిందూ దేశములోని ప్రాచీన నాగరికత సింధు నాగరికత. ఈ నాగరికతవల్ల హిందూదేశం ఇతర దేశాల చేత గుర్తింపబడింది. ఇండియా అనే పేరు కూడా 'ఇండస్' అనే మాట నుండి వచ్చింది. ఇండస్ – సంస్కృతంలో సింధు. తూర్పు పంజాబ్‌లో సింధునదీ తీరంలో నాగరిక మానవుల జీవనం ప్రారంభమయింది.

హరప్ప – మోహంజదారోలలో సింధు నాగరికత అవశేషాలు దొరుకుతున్నాయి. భారతీయుల నాగరికజీవనం అతి ప్రాచీన మయినది.

ఈ నది టిబెట్టులో – కైలాస శిఖరం మీదుగా పుట్టి మానస సరోవరం గుండా ప్రవహిస్తున్నది. ఈ మానస సరోవరంలోనే బ్రహ్మపుత్ర, సెట్లెజ్ నదులుకూడా పుడుతున్నాయి.

ఈ నది కాశ్మీర్ ప్రక్కనుండి ప్రవహిస్తూ పంజాబ్ దేశంలోనికి ప్రవేశిస్తుంది. దీని మొత్తం పొడవు 1800 మైళ్ళు. ఈ నది కరాచీ దగ్గర అరేబియన్ సముద్రంలో కలుస్తున్నది.

ఈ నదివల్ల హిందూ దేశానికి ఆ పేరు వస్తే ఈ నది ఉపనదుల వల్ల మరో రాష్ట్రానికి పేరు వచ్చింది. దాని పేరు పంజాబ్.

అబ్ అంటే నదుల మధ్యప్రదేశమని అర్థం. దోఅబ్ అంటే రెండు నదుల మధ్యదేశము. పంజాబ్ అంటే అయిదునదుల మధ్య ప్రదేశమన్న మాట. ఆ అయిదు నదులు ఏవో చూద్దాము.



జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ అనేవి ఆ నదులు.

సింధునది కూడా బ్రహ్మపుత్రానదిలా ప్రతి ఏటా తన ప్రవాహ మార్గాన్ని మార్చేస్తూ ఉంటుంది. వరదలతో ముంచెత్తుతూ ఉంటుంది. మార్చి నెలలో పొంగడం ప్రారంభించి సెప్టెంబరునాటికి కాస్త తగ్గుముఖం పడుతుంది. ఆగష్టులో ఇది విజృంభించి ఉధృతంగా ప్రవహిస్తుంది.

వరదలలో ఉన్నప్పుడు దీన్ని చూస్తే సముద్రంలా ఉంటుంది. అసలు ఈనది పేరు సింధునది కదా. సింధు అంటే సముద్రమని అర్థం కూడా ఉంది. లక్ష్మీదేవిని 'సింధుకన్యా' అంటారు. అంటే సముద్రుని పుత్రిక అని అర్థం. సముద్రంలా ఉంటుంది కనుకనే ఈ నదికి సింధు అని పేరు వచ్చి ఉండవచ్చు.

సింధునదీ తీరంలో నివసించే ప్రజలు దీన్ని 'దర్యా' అంటారు. దర్యా అంటే సముద్రమని అర్థం. నదీ అనకుండా దీన్ని ఆ ప్రాంతీయులు 'దర్యా' అనడంలోనే దీని గొప్పతనం తెలుస్తున్నది.

ఈ సింధునదికి 3000 చదరపు మైళ్ల డెల్టా ఉంది. 1931లో సుక్కూరు దగ్గర దీని మీద పెద్ద బేరేజీ కట్టారు. ఎనభై లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చారు.

ఇక సింధునది ఉపనదుల గూర్చి చెప్పుకుందాం. ఈ క్రింద చెప్పే ఐదు 'పంజాబ్'కు ఆ పేరు తెచ్చాయి.

ఈ ఐదు నదులకు పంచాపనదులు అనే వ్యవహారం ఉంది. ఈ అయిదు నదులు ప్రవహించే ప్రాంతానికి పంచాపక్షేత్రమని పేరు. ఈ క్షేత్రంలో వైదిక కర్మలు ఆచరించడం, వేదపఠనం, వేదాభ్యాసం సాగించడం జరిగేది. ఇక్కడ నుండి ఆర్షధర్మాలు వ్యాప్తిలోకి వచ్చాయి.

## పంచాపనదులు

**5. 1 జీలం :** ఈ అయిదు నదులలో మొదటిది జీలం. దీన్ని సంస్కృతంలో 'వితస్త' అంటారు. నీలమతపురాణం ఈ నదిపుట్టుకను వివరిస్తోంది కశ్యపమహర్షి ఒకసారి పార్వతీదేవిని భూలోకంలో కాశ్మీర నగరానికి విచ్చేయవలసిందిగా ప్రార్థించాడు. పిశాచాలు విరివిగా నివసించడం వల్ల కాశ్మీర్ అపవిత్రమై పోయిందనీ పార్వతీదేవి వచ్చి పాదం మోపితే ఆ నేల పవిత్రీభూత మవుతుందనీ కోరాడు. కశ్యపుని కోరికమీద ఆమె నదీరూపం ధరించి భూలోకానికి వచ్చింది. శివుడు స్వయంగా ఆమెకు 'వితస్త' అని పేరు పెట్టాడు. 'వితస్త' అంటే 'జాన' కొలత. 'జానెడు మేర నేలను పెల్లగించగా నీరు బయటకు వచ్చి నదిగా ఏర్పడడంవల్ల ఈ నదికి 'వితస్త' అని పేరు.

ఈ నది ఒడ్డునే సుందర కాశ్మీర నగరపు ముఖ్యపట్టణం శ్రీనగర్ ఉంది. ఈ నది 'వేరినాగ్' అనే చోటపుట్టింది. ఈ ప్రాంతంలో ఒక పెద్దనాగుపాము సంచరిస్తూ ఉండేదట. అందువల్ల ఈ ప్రాంతానికి 'వేరినాగ్' అనే పేరువచ్చింది.

మన పురాణాలలో పేర్కొనబడిన సతీసరస్సే ఈ 'వేరినాగ్'. ఈ ప్రదేశం మొగల్ పాదుషా జహంగీరుకు అత్యంత ప్రియమైనది. ఇక్కడి సౌందర్యానికి ముగ్ధుడయిన జహంగీరు ఇక్కడ సరస్సులు తవ్వించి, ఉద్యానవనాలు పెంచి మనోహరంగా తీర్చిదిద్దాడట.

శ్రీనగర్‌ను ప్రాచీన కాలంలో 'శ్రీనగరీ' అనే పిలిచేవారు. ఈ శ్రీనగర్ ఇరుప్రక్కల వీధుల మధ్య నుండి జీలం నది కాలువలు ప్రవహిస్తున్నాయి. ఈ కాలువల్లో ప్రజలు పడవల మీద విహరిస్తూ ఉంటారు. శ్రీనగర్‌ను దాటాక 'బారమూల' అనే క్షేత్రానికి చేరుతుంది ఈ నది. ఈ'బారమూల' వరాహక్షేత్రం. శ్రీహరి దశావతారాల్లోని వరాహావతారానికి ఇక్కడ పూజలు చేస్తారు.



బారమూల నుండి సింధీ, విద్ధలీ అనే ఉపనదులను కలుపుకుని జీలం ఉలాలీ సరస్సులో కలుస్తుంది. ఈ సరస్సును హిందువులు 'మహాపద్మ' సరస్సు అనీ, బౌద్ధులు 'అరవాలో' సరస్సు అనీ పిలుచుకుంటారు.

భారతదేశమంతా కాలినడకన సంచరిస్తూ హిందూధర్మాన్ని వ్యాప్తి చేసిన ఆదిశంకరాచార్యులు – వెయ్యి అడుగుల ఎత్తున శ్రీనగర్‌లో ఒక ఆలయం నిర్మించారు. జీలంనది నుండి ఈ గుడిపై దాకా భక్తులు నడిచివెళ్లేందుకు చక్కని కాలిబాట ఉండేది.

'కిషన్‌గంగ' అనే చిన్ననది జీలం నదితో కలిశాక, 'త్రిమ్ము' అనే చోట జీలం చీనాబ్‌తో కలుస్తోంది. జీలం చీనాబ్‌కు ఉపనది. చీనాబ్ సింధునదికి ఉపనది. జీలంనది పొడవు 725 కి.మీ.

ఈ రెండు నదుల మధ్యనే – పురుషోత్తముడనే రాజు మనదేశం మీదకు దండెత్తి వచ్చిన విదేశీయుడయిన అలగ్జాండర్‌ను ఎదిరించి పోరాడాడు. చారిత్రాత్మకమైన ఈ యుద్ధం జీలం నది ఒడ్డునే జరిగింది.

**5.2 చీనాబ్ :** వేదకాలంలో ఈనదిని 'అసిక్నీ' అని పిలిచేవారు. ఆ తరువాత ఇది 'చంద్రభాగా'నదిగా వ్యవహరింపబడింది. ఒకప్పుడు శివుడు హిమాలయ పర్వతాన్ని రెండు భాగాలుగా విభజించాడు. ఆ సమయంలో చంద్రుని వెన్నెలకు హిమాలయాలు కరిగి ద్రవరూపంలో ప్రవహించాయి. ఆ నీరే – చంద్ర – భాగా అనే రెండు పాయలుగా ప్రవహించాయి. 'తిండి' అనే ప్రాంతంలో ఈ రెండు పాయలు ఏకమై 'చంద్రభాగా'నదిగా రూపొందింది. ఈ నదిని నేడు చీనాబ్ అని వ్యవహరిస్తారు.

ఒక నది పేరులో కూడా 'అబ్' వచ్చింది. 'అబ్' అంటే నదుల మధ్యభాగమని పేరు. చంద్ర, భాగా అనే రెండు నదుల మధ్యదేశం కావడంవల్ల నదిపేరులో కూడా అబ్ చేరి చీనాబ్ అయింది.

ఈ చీనాబ్‌నది పంగివాలీ గుండా ప్రయాణం చేసి జమ్మూ కాశ్మీర్‌లను ఆనుకుని ప్రవహించి సట్లెజ్ నదితో కలిసిపోతుంది.

మిక్కిలి వేగవంతంగా ప్రవహించేనదుల్లో చీనాబ్ ఒకటి.

**5.3 రావి :** వేదకాలంలో ఈనది పేరు 'పరుష్ణి'. పురాణాలలో ఈ నదిని 'ఇరావతి'గా పేర్కొన్నారు.

హిమాలయాల దక్షిణ దిశలో బంగారు పర్వతశ్రేణులు ఉన్నాయి. ఆ ప్రాంతం కాంగ్రా జిల్లాకు చెందినది. కాంగ్రా జిల్లాలోని 'కులువాలీ'లో రావీనది జన్మించింది. కులువాలీ ప్రకృతి సౌందర్యానికి చెప్పదగినది. కులూవాలీ సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తూ కులుకుతూ ప్రవహిస్తోంది ఈ రావీనది.

ఈ నది భారతదేశం పాకిస్థాన్‌లకు సరిహద్దురేఖగా ప్రవహిస్తోంది. తాలి, దేన్ అనే ఉపనదులను తనలో కలుపుకుని 'ట్రిమ్ము' ప్రాంతంలో చీనాబ్‌లో కలిసి సింధునదిని చేరుకుంటుంది.

ఈ రావీనది అనేక పౌరాణిక గాథలను గుర్తుచేస్తుంది.

మహాభారతకథలో – పాండురాజుకు కుంతి, మాద్రి అని ఇద్దరు భార్యలు, మాద్రి మద్రరాష్ట్రాధిపతియైన ఋతాయనుని కూతురు. ఈ మద్రరాష్ట్రం రావీ, చీనాబ్ నదులమధ్య ఉంది. ఈ మాద్రి సోదరుడు శల్యుడు. నకుల సహదేవులు మాద్రి కొడుకులు. శల్యుడు వీరి మేనమామ. అయినా భారతయుద్ధంలో శల్యుడు కౌరవపక్షం వహించి పాండవులకు విరుద్ధ పక్షంలో పోరాడాడు. కర్ణునికి సారథ్యం చేసాడు. కౌరవసేనకు సేనాధిపతిగా నిలిచాడు. మహాభారతంలో శల్యుని పేర ఒక పర్వం కూడా ఉంది. భారత యుద్ధవీరులలో ఒకడైన బాహ్లీకుడు కూడా మద్రదేశానికి చెందినవాడు.



పతివ్రతా శిరోమణి అయన 'సావిత్రీదేవి' ఈ మద్రరాష్ట్రాధిపతి అయిన అశ్వపతి పుత్రిక. భర్తప్రాణాల కోసం యమధర్మరాజుని అనుసరించి వెళ్లి, సాధించిన సావిత్రి మద్రదేశంలో పుట్టి ఆ దేశానికి పేరుతెచ్చింది. రావీనదీ తీరం ఇంతటి విశిష్టత గలది.

**5.4 బీయాస్ :** దీన్ని వేదకాలంలో 'విపాశ'గా వ్యవహరించేవారు. ఈ పేరేకాక 'ఉరంజరీ' అనే మరో పేరు కూడా ఈ నదికి ఉంది.

'విపాశ'అనే పేరు రావడానికి ఒక గాథ ఉంది. పూర్వం వశిష్ఠ మహర్షి పుత్రవియోగం భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని 'శతద్రు' నదిలో దూకాడు. కాని ఆ నది ఆ ప్రయత్నం సాగనివ్వలేదు వశిష్ఠమహర్షిని గట్టుమీదకు చేర్చింది. ఆ తరవాత వశిష్ఠుడు తన ప్రయత్నాన్ని మరింత పటిష్టం చేసి – తనను తాను లతలతో కట్టేసుకుని 'విపాశ'నదిలో దూకాడు. విపాశనది వెంటనే ఆయన కట్టుకున్న తీగెల బంధాన్ని, మనసులో బాధిస్తున్న అనురాగబంధాన్ని కూడా తెంపేసి వశిష్ఠుణ్ణి నిర్మలమైన మనస్సుతో తీరానికి సురక్షితంగా చేర్చింది. ఈ విధంగా వశిష్ఠ మహర్షి పాశాలను తెంచివేసిన నది కనుక దీనికి 'విపాశ' అని పేరు వచ్చింది. 'విపాశ' అంటే పాశాన్ని పోగొట్టేది అని అర్థం.

ఈ నది కులూకొండల సమీపంలో 'రోహతాంగ్‌పాస్' అనేచోట పుట్టింది. ఇక్కడనుండి నాలుగు వందల అరవై కిలోమీటర్లు ప్రవహించి 'హరికే' అనే చోట సట్లెజ్ నదితో సంగమిస్తున్నది.

**5.5 సట్లెజ్ :** వేదకాలంలో ఈ నదిని 'శతద్రు' అని శతుద్రి అని వ్యవహరించేవారు. నూరుపాయలుగా – నూరు దారుల్లో ఈ నది ప్రవహించడంవల్ల దీనికి 'శతద్రు' అనే పేరు వచ్చింది. శత అంటే నూరు అని అర్థం. నూరుపాయలుగా ప్రవహించడానికి గల కారణం పురాణాలు వివరిస్తున్నాయి.

వశిష్ఠుని కుమారులను విశ్వామిత్రుడు సంహరించాడు. పుత్రవియోగం భరించలేని వశిష్ఠుడు ఆత్మత్యాగం చేసుకోవడాని అనేక ప్రయత్నాలు చేసాడు. ఒక్కటీ ఫలించలేదు. చివరకు దృఢసంకల్పంతో 'హైమవతి' అనే నదిలో దూకాడు. వశిష్ఠమహర్షి తేజస్సును ఆ నది భరించలేక పారిపోతూ నూరుపాయలుగా చీలిపోయింది. ఈ విధంగా నూరుపాయలు అవడంవల్ల ఈ నదికి శతద్రు అనే పేరు వచ్చింది. ఆ శతద్రు నేటికాలంలో సట్లెజ్ నదిగా వ్యవహరింపబడుతోంది.

ఈ నది బ్రహ్మపుత్ర, సింధు నదులుపుట్టిన మానససరోవరానికి దక్షిణాన ఉన్న రావణహ్రదం (రాక్షసతాల్) నుండి పుట్టింది. పంజాబ్‌లో రూపర్ అనేచోట మైదానదశ పొందుతుంది. ఫిరోజ్‌పూర్ అనేచోట ఇండియా పాకిస్థాన్‌లకు సరిహద్దుగా ప్రవహిస్తోంది. 1448 కి.మీ పొడవుగల ఈ సట్లెజ్‌నది పంజనద అనేచోట చీనాబ్‌తో కలిసి సింధునదిని చేరుకుంటుంది.

ప్రపంచలోకల్లా ఎత్తైనడామ్ ఈ సట్లెజ్ నది మీద నిర్మింపబడింది. దాని పేరు 'భక్రానంగాల్' ప్రాజెక్టు. నాటి భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఈ ప్రాజెక్టును అంకితం చేసారు.

క్రీ.శ. 1857లో ప్రథమ భారతస్వాతంత్ర్య సంగ్రామం ఈ సట్లెజ్ నదీతీరంలో ఆరంభమై నర్మదానదీ తీరం వరకు వ్యాప్తిచెందింది.

సట్లజ్ నది అలా దేశభక్తి గల నదిగా ప్రసిద్ధి పొందింది.

* * *



## 6. మహానది

ఉత్తరభారతదేశంలో పెద్దనదులు నాలుగు. గంగ, బ్రహ్మపుత్ర, సింధు, మహానది.

మహానది అంటే గొప్పనది అని అర్థం. అయితే ఈ గొప్పనది గొప్ప నాలుగు నెలలు మాత్రమే ఉంటుంది. వర్షాకాలం నాలుగు నెలలూ ఇది విఱ్ఱవీగుతూ నీటి ఒరవడిలో గంగానదిని మించేటట్లు ప్రవహిస్తుంది. తక్కిన ఎనిమిది నెలలూ ఈ నది ఎండిపోయి ఇసుక పఱ్ఱలు కనబడుతూ చిన్న చిన్నవాగుల్లా ప్రవహిస్తూ ఉంటుంది.

ఈ నది రాయపూర్ జిల్లాలో సిహవా అనే గ్రామం దగ్గర పుట్టింది. అక్కడ నుండి ఎనభై మైళ్ల వరకు ఇది చాలా సన్నగా ఉంటుంది. బిలాస్‌పూర్ చేరేసరికి మహానదిలో సియనెత్ అనే నది వచ్చి చేరుతుంది. బిలాస్‌పూర్‌లో వారికి సియనెత్ నది చాలా ప్రియమైనది. మరికొంత దూరంలో మహానదికి – జోనక్, హసడో అనే రెండు నదులు వచ్చి కలుస్తాయి. సంబల్‌పూర్ వచ్చేటప్పటికి ఓంగ్, తెల్ అనే నదులతో కలిసి మహానది, మహానది అనే పేరు సార్ధకం అయ్యే అంతగా విశాలమవుతుంది.

ఈ నది ఒరిస్సాలో డెల్టాగా చీలిపోతుంది. కటక్‌లో ప్రవహించే నాటికిది నాలుగయిదు పాయలుగా విడిపోతుంది. ఈ నది తన పాయనే ఒక కాలువగా చేసింది. దాన్ని కట్ జూరి అంటారు. ఈ కట్‌జూరీని మళ్లీ రెండు ప్రవాహాలుగా విడదీసారు. కోయఖై అనే పేరుతో ఒక పాయ పూరీగుండా ప్రవహిస్తుంది. సముద్రంలో కలిసే చోట ఈ పాయలకు పెద్దదేవి, చిన్నదేవి అని పేర్లు.

కోయఖై మళ్లీ రెండు పాయలుగా చీలింది. వాటికి 'దయ' అనీ 'భార్గవి' అనీ పేర్లు. ఈ దయ, భార్గవి ప్రవహిస్తూ వెల్లి కొంతదూరం తరువాత చిలక సరస్సుగా, సురసరస్సుగా మారిపోయాయి.

వానాకాలంలో మహానది పొంగిపొర్లుతూ ఉంటుంది. ఈ నదీ జలాలను ఉపయోగించుకోవడం కూడా వీలు పడటం లేదు. ఎంతో నీరు వృథాగా పోతోంది. ఈ నదికి వరదలు చాలా ఎక్కువ. ప్రతి సంవత్సరం ఈ నదికి వరదలు రావడం పంటలకు బహునష్టం కలగడం రైళ్ల రాకపోకలకు ఇబ్బంది కావడం జరుగుతూ ఉంటుంది.

ఈ వరదల నుండి రక్షించడానికి వృథాగా పోతున్న నీటిని ఉపయోగ పడేలా చేయడానికి ఈ నది మీద హీరాకుండ్ దగ్గర పెద్దడామ్ కట్టారు. 1957 లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దీనికి ప్రారంభోత్సవం చేసారు. ఈ డామ్ పొడవు 18 మైళ్ళు ప్రపంచంలోకల్లా పొడవైన డామ్ ఇదే.

మహానది – మహానది కాకపోయినా – దీని మీది డామ్ మాత్రం ప్రపంచంలోకెల్లా మహాగొప్పది.

ఈ డామ్ వల్ల రెండు మిలియన్ల ఎకరాల భూమిసాగులోకి వచ్చింది. 1,80,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి లభిస్తున్నది.

మహానది తీరాన గల దేవాలయాలలో థాకూర్ మహాదేవుని మందిరము చెప్పతగ్గది.

దీనిపొడవు 858 కిలోమీటర్లు.

ఒరిస్సా రాష్ట్రానికి మహానది పెద్దనది.

* * *



# 7. నర్మద

**"నర్మదా సరితాం శ్రేష్ఠా రుద్రదేహా ద్వినిసృతా**
**తీరమే త్సర్వ భూతాని స్థావరాణి చరాణి చ"**

"నర్మద నదులలో కల్లా శ్రేష్ఠమయినది. రుద్రుడైన శివుని దేహము నుండి పుట్టినది. చరాచర ప్రాణులనన్నిటిని తరింప చేయునట్టిది". ఈ విధంగా నర్మదానదిని అతి పవిత్ర మయిన దానిగా మన పూర్వులు భావించారు. గంగాతీరాన కూడా లేనన్ని పుణ్యక్షేత్రాలు ఈ నర్మదా నదీతీరాన ఉన్నాయి.

ఈ నర్మదానది పవిత్రతను గుర్తించి ఆదిశంకరాచార్యులు నర్మదాష్టకమును రచించారు.

ఈ నర్మద నదము అని చెప్పుకున్నాము. ఇది పడమటిదిశగా ప్రవహించి అరేబియా సముద్రములో కలుస్తున్నది. 'మహానదము' అనిప్రసిద్ధిపొందింది.

'నర్మద' అంటే ఆనందమును ఇచ్చునట్టిది అని అర్థము. దీన్నే రేవా అనీ, రేవాజీ అనీ కూడా వ్యవహరిస్తారు. గోదావరి, కృష్ణానదుల పేరున జిల్లాలు ఉన్నట్లే, ఈ రేవా నది పేరున రేవా జిల్లా ఉంది.

మూడు సంవత్సరాలు సరస్వతిలోను, ఏడు రోజులు యమునా నదిలోనూ, ఒక్క రోజు గంగానదిలోనూ స్నానం చేయడం వల్ల పుణ్యం వస్తుందంటారు. కాని నర్మదానదిని చూస్తే చాలు పాపాలన్నీ పటాపంచ లవుతాయట. గంగానది కూడా ఏడాదికి ఒకసారి నర్మదానదిలో స్నానంచేసి తన పాపాలను కడిగివేసుకుంటుంది. గంగ నర్మదలో స్నానం చేసిన రోజుని గంగాసప్తమి అంటారు. దీని వివరాలు 'నదులు – పూజలు' అనే శీర్షికలో తెలుసుకుందాము.

నర్మదానదిని ఉభయతట పావని అంటారు. అంటే ఈ నదిలో ఏ ఒడ్డున ఎక్కడ స్నానం చేసినా పుణ్యప్రదమన్నమాట. కొందరు భక్తులు నర్మదానదికి ప్రదక్షిణం చేసి వస్తారు. దీన్ని పరిక్రమణం అంటారు.

నర్మదానది పుట్టుకను గూర్చి పురాణ గాథ ఒకటి ఉంది.

**శాంకరి:** మండు వేసవిలో ఒకనాడు శివునకు బాగా చెమట పట్టిందట. ఆ చెమట నుండి ఒక అందమయిన అమ్మాయి ఉద్భవించింది. ఆమే నర్మద నదిగా మారిపోయింది. అందుకే నర్మదకు 'రుద్రదేహ' అని, శంకరుని కూతురు గనక శాంకరి అనీ కూడా పేర్లు వచ్చాయి. నర్మదానది ఉభయ తటములందూ అంటే అటూ ఇటూ గల తీరాల్లో శివాలయాలెన్నో ఉన్నాయి. అదీ కాక నర్మదానదిలోని చిన్నచిన్న కంకరరాళ్ళన్నీ శివలింగాన్ని పోలి ఉంటాయి. అందుకే నర్మదా నదిలోని ప్రతి కంకరా శంకరుడే అనే పలుకుబడి వచ్చింది.

**చంద్రతనయ :** శివుని కుమార్తెగానే కాక నర్మద చంద్రతనయ అనే విషయం హరివంశంలో ఉంది. హరివంశంలో కథా వృత్తాంతం వినదగింది.

నాగరాజ్యాన్ని అంటే పాతాళలోకాన్ని నాగులు పాలిస్తూ ఉండేవారు. అయితే నాగులతో పాటు పాతాళలోకంలో కొందరు గంధర్వులు కూడా నివాసం ఉన్నారు. వారిలో 'మోనేయులు' అనే శాఖవారు ప్రధానులు. వారు ఒకసారి నాగరాజ్యంపై దండెత్తి వారిని ఓడించారు. నాగులు భయపడి విష్ణువును చేరి తమకు రక్షణ కల్పించమని ప్రార్థించారు. విష్ణుమూర్తి వారి అవస్థను చూసి – మీరు మాంధాత కుమారుడయిన పురుకుత్సుని ఆశ్రయించండి. అతడు నా అంశతో పుట్టాడు. మిమ్మల్ని తప్పక రక్షిస్తాడని హామీ ఇచ్చాడు. విషయం విన్న నాగులు ఈ సందర్భంలో తమకు సహాయం చేసేలా పురుకుత్సుని సుముఖునిగా చేయవలసినదిగా చంద్రుణ్ణి అర్థించారు. నాగుల కోరికను సఫలంచేయడానికి తన కుమార్తె అయిన నర్మదను



ప్రార్థించమన్నాడు చంద్రుడు. నాగుల కోరికమీద నర్మద పురుకుత్సుని ప్రేరేపించింది. నర్మద అంద చందాలకు ఆకర్షితుడైన పురుకుత్సుడు ఆమె కోరిన రీతిలో పాతాళలోకానికి వెళ్లి గంధర్వులను ఓడించి నాగుల రాజ్యం నాగులకు ఇప్పించాడు. నర్మదా పురుకుత్సులు చేసిన ఉపకారానికి మెచ్చి నాగులు మీ పేర్లు స్మరిస్తే సర్పభయం కాని విషభయం గాని ఉండదని వరం ఇచ్చారు. నాగులకు సహాయం చేసే సందర్భంలో నర్మదా పురుకుత్సులు పరస్పరం ప్రేమలో పడ్డారు. వివాహం చేసుకున్నారు. వారికి త్రసదస్యుడు అనే కొడుకు కూడా పుట్టాడని హరివంశం వివరిస్తోంది. గుజరాత్ ప్రజలు ఇప్పటికీ సర్పభయాలు తొలగి పోవడానికి నర్మదా నదిని పూజిస్తారు.

గుజరాత్‌లో 'నర్మదనా కంకరత్తెట్ల శంకరా' అంటారు.

అంటే నర్మదానదిలోని రాళ్లన్నీ శివలింగాలే అని అర్థం. ఈ నది రేవాజిల్లాలో సాత్పూరా పర్వతాలలో అమరకంటకమనే చోట పుట్టి కాంబేశాఖలో కలుస్తున్నది. సాత్పూర, వింధ్య పర్వతాల మధ్య ఈ నర్మద ప్రవహిస్తున్నది. మేఖల పర్వతాలలో పుట్టడం చేత ఈ నదికి 'మేఖల కన్యక' అని కూడా పేరు వచ్చింది. ఈ నదికి మరోపేరు రేవ.

రేవ–'రేవ' అంటే దుముకు అని అర్థము. రేవ్ ధాతువు నుండి రేవ అయింది. అమరకంటకం వద్ద 3500 అడుగుల ఎత్తునుండి ఈ నది దుముకుతోంది. అందువల్లనే దీనికి 'రేవా' అనే పేరు.

సూర్‌పన్ జలపాతం తరువాత – ఈ నది హరన్‌పాల్ అనేచోట గుజరాత్‌లో మైదాన ప్రదేశంలో ప్రవహిస్తుంది. 'హరన్‌పాల్' అంటే ఒక లేడి దుముకగలంత వెడల్పన్నమాట. హరిణము అంటే లేడి. ఈ చోట నర్మదానది అంత సన్నగా ఉండటం వల్లనే – ఈ 'హరన్‌పాల్' అనే పేరు వచ్చింది.

మాండ్లా జిల్లాలో – బంజర్‌నది, నరసింఘపూర్ జిల్లాలో షేర్, షక్కర్ నదులు, హొసంగాబాద్ జిల్లాలో – తవ, జబల్‌పూర్ దగ్గర హిరణ్ అనే నదులు నర్మదతో కలుస్తున్నవి. ఇవే నర్మదకు ఉపనదులు.

గుజరాత్ మొత్తంలో నర్మదానదీ తీరాన చిన్నవీ పెద్దవీ కలిసి నూటముప్పై తీర్థాలు ఉన్నాయి.

ఈ నదీ తీరాన్నే మరెక్కడా లేని కొన్ని దేవాలయాలు నిర్మించబడ్డాయి. వాటిలో వ్యాసమహర్షి దేవాలయము, శుకమహర్షి ఆలయము, అనసూయా దేవాలయము, కుంభేశ్వర మహాదేవుని మందిరము, శనైశ్చరస్వామి దేవాలయము, సూరపనేశ్వరాలయము పేర్కొనదగినవి.

నర్మదానదీతీరంలో గల పుణ్యక్షేత్రాలలో అత్యంత ప్రసిద్ధ మయినది, మహిమాన్వితమైనది – 'ఓంకారేశ్వర్'. ఇది ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి. ఇది ఇండోర్ పట్టణానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఓంకారేశ్వర్‌కి ఆ పేరు రావడానికి కారణం ఇక్కడి పర్వతం 'ఓంకారం' ఆకారంలో ఉండడమే, వింధ్యపర్వతుని కోరిక మేరకు పరమశివుడు ఇక్కడ జ్యోతిర్లింగ రూపంలో కొలువుతీరాడు. నర్మద ఈ కొండచుట్టూ ప్రవహిస్తూ మనోహరంగా ఉంటుంది. ఈ కొండమీద ఓంకారేశ్వరునితో పాటు 33కోట్ల దేవతలు, 68 తీర్థాలు, 128 గుప్త లింగాలు, 12 ప్రకటితతీర్థాలు ఉన్నాయి. ఈ కొండకు ప్రదక్షిణ చేయడం – కొండపైన స్వామిని దర్శించడం వల్ల – అనంతమైన పుణ్యం లభిస్తుంది. భృగుకచ్ఛము నేటి బ్రోచ్ నర్మదానదీ ముఖద్వారములో ఉంది.

జమదగ్ని తీర్థము, శ్రీకృష్ణ నిర్యాణస్థలం – నర్మదానదీ తీరాననే ఉన్నాయని చెప్తారు.

చిరంజీవి అయిన అశ్వత్థామ నేటికీ నర్మదా నదిలో రోజూ స్నానం చేస్తాడని ఆ ప్రాంతీయులు నమ్ముతారు.



నదులకు పరిక్రమణ చేయడం నర్మద విషయంలోనే కనిపిస్తుంది.

నర్మద పరిక్రమణ గుజరాతీయులకు అతిపుణ్యకార్యము. ఎందరో సాధువులు నేటికీ నర్మదానదికి ప్రదక్షిణ చేస్తారు. నది పుట్టిన చోటు నుండి సముద్రంలో కలిసేవరకు, మళ్లీ అటునుండి ఇటు ప్రయాణిస్తారు.

శాతవాహనులు, చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో నర్మదానదీ తీరానగల "బ్రోచ్" రేవుపట్టణంగాను, గొప్పవ్యాపార కేంద్రంగాను ప్రసిద్ధికెక్కింది, క్రీ.శ. 15వ శతాబ్దంలో ఒక నౌకాయాత్రికుడు వ్రాసిన 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' అనే గ్రంథం నర్మదానదిని 'నమ్మదాస్'గా పేర్కొంది.

గుజరాత్‌కి నర్మదానది ఆయువుపట్టు. ఈ నది మీద నవగామ్ అనేచోట 4600 అడుగుల పొడవుగల డామ్ నిర్మించారు. దీనివల్ల నీటి ఎద్దడి తీరడమేకాకుండా వ్యవసాయానికి కూడా తోడ్పడుతున్నది. ఈ డామ్‌వల్ల నూటముప్పైవేల ఎకరాలు సాగులోనికి వచ్చాయి. గుజరాత్ రాష్ట్రానికి విద్యుచ్ఛక్తి కూడా నర్మదా ప్రాజక్టువల్ల లభిస్తున్నది.

గుజరాతు పురోభివృద్ధికి నర్మదానది మూల కారణమై ఉంది.

దీనిపొడవు 1057 కిలోమీటర్లు.

* * *

## 8. తపతి

నర్మద లాగే గుజరాతీయులకు తపతి కూడా ముఖ్యమయిన నది. నర్మద లాగే ఇది కూడా నదము.

తపి అనీ, తప్తీ అనీ దీనికి పేర్లు ఉన్నాయి. తపతి అనే ఈ పేరు 'తప్' అనే ధాతువు నుండి వచ్చింది. తప్ అంటే వేడి అని అర్థము. సూర్యభగవానుడు తన వేడి నుండి తనను కాపాడుకోవడానికి ఈ నదిని సృష్టించాడట. తన వేడిలో కొంతభాగాన్ని ఈతడు నదిగా మార్చాడన్న మాట. అందువల్లనే ఈ నదీ జలాలు వేడిగా ఉంటాయట.

ఇంతకు పూర్వం మనము యమునానది సూర్యుని పుత్రిక అని చెప్పుకున్నాము. ఈ తపతి కూడా సూర్యతనయ. కాగా యమున, తపతి అక్క చెల్లెళ్లన్న మాట. అయితే యమున సూర్యునిభార్య సంజ్ఞాదేవికి పుట్టింది. తపతి ఛాయాదేవికి పుట్టింది.

మహాభారతంలో ఈ తపతి సంవరణుడనే రాజుని వివాహమాడి కురు అనే పేరుగల పుత్రుణ్ణి కన్నదని వివరింపబడి ఉంది. కురువంశానికి మూలపురుషుడు ఈ కురువే.

స్కాందపురాణంలో తపతీ మాహాత్మ్యం అనేభాగంలో – ఈ నది ఆషాఢ శుద్ధి సప్తమినాడు, మిట్టమధ్యాహ్నం వేళ జన్మించిందని ఉంది. ఆషాఢ శుద్ధ సప్తమీతిథి ఆదివారంనాడు వస్తే మహాపర్వదినంగా సంభావిస్తారు.

గంగానది భారతవీరుడయిన భీష్ముణ్ణి కన్నదని ముందు మనం చెప్పుకున్నాము. ఒక్క గంగే కాక తపతి కూడా మహాభారతకథలో పాత్ర.

ఈ నది 'మూలతపి' అనే పవిత్రమయిన సరస్సు నుండి పుట్టింది. సాత్పూరాపర్వతాల మీద పుట్టి ప్రవహించే ఈ నది పొడవు 450 మైళ్లు.



ఇది మధ్యప్రదేశ్‌లోని బెతుల్ జిల్లా గుండా ప్రవహిస్తూ వచ్చి నిమార్, బరహన్ పూర్, జిన్‌బాద్ జిల్లాలు దాటి వెళుతుండగా దీనికి పూర్ణ అనే ఉపనది వచ్చి బుషావత్ దగ్గర కలుస్తుంది. అక్కడ నుండి ఇది సూరత్ జిల్లా గుండా ప్రవహించి సముద్రంలో కలుస్తున్నది.

ఈ తపతీనదీ తీరాన చారిత్రక, పౌరాణిక ప్రసిద్ధిపొందిన స్థలాలు నూటెనిమిది ఉన్నాయని పండితులు చెప్తున్నారు.

క్రీ.శ. 1400 లలో నిర్మింపబడిన బెరహన్‌పూర్ మొగలుల ముఖ్యపట్టణము ఈ నది ఒడ్డునే ఉన్నది.

తపతీనదీ తీరాన దేలియా అనే గ్రామం వద్ద గౌతమేశ్వర మహాదేవుని ఆలయం ఒకటి ఉంది. పన్నెండు సంవత్సరాల కొకసారి ఇక్కడ పెద్ద ఎత్తున పూజలు జరుగుతాయి.

తపతీనదీ తీరం 'మోరాయన' అనే చోట జరత్కారతీర్థము అనే ప్రసిద్ధతీర్థం ఉంది. ఈ జరత్కారువు జనమేజయుడు చేసిన సర్పయాగాన్ని ఆపిన ఆస్తీకమహర్షి తండ్రి. భారత కథతో సంబంధంగల తీర్థమిది.

చరిత్ర ప్రసిద్ధికెక్కిన సూరత్ తపతీనది ఒడ్డునే ఉన్నది.

ఈ నదీ జలాలను పూర్వం ఎక్కువగా వ్యవసాయానికి ఉపయోగించుకో లేక పోయారు.

ఈ మధ్య కక్రపార అనేచోట ప్రాజక్టుకట్టి సూరత్ చుట్టుపట్ల ఆరులక్షల ఎకరాలలో రెండు పంటలు పండేటట్లు చేసారు.

రెండవ పంచవర్ష ప్రణాళికలో తపతి మీద 'ఉకై' అనేచోట మరో ప్రాజక్టు కూడా కట్టారు. ఇది హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజక్టు కూడాను.

థాయ్‌లాండ్‌లో ఒకనదికి 'తపి'అనే పేరు పెట్టారు. భారతదేశంలోని తపతీనదీ నామాల నుండి 'తపి' అనేపేరు స్వీకరించి 1915లో ఈ నామకరణం జరిపినట్లు గూగుల్ అందించిన సమాచారం.

తపతికి పూర్ణమాత్రమే కాకుండా వీఘూర్, గిర్న, బోరి, పంజర, హఘుర, అనేర, గోమాయి, శివ, అరుణావతి, వాకి, బూరాయి, ఉమా, నిర్గుణ, ఆశ్, గాంధారి, మోర్న, నలగంగ, శిప్న, ఖండు, నేశ అనే ఉపనదులు పెక్కు ఉన్నాయి.

**8.1 పూర్ణ :** పూర్ణానది తపతికి ప్రధాన ఉపనది. ఇది సాత్పూరా పర్వత శ్రేణిలో పుట్టింది. మల్కాపూర్ ప్రాంతానికి ఈ నదీజలాలే ప్రాణాధారం. మహారాష్ట్రదేశం గుండా ప్రవహిస్తూ బేతుల, అమరావతి, అకోల, బుర్ధన్ జుల్‌గావ్ అనే జిల్లాలను సస్యశ్యామలంగా చేస్తోంది. ఎడమవైపు ధ్యానగంగ, కుడివైపు చంద్రభాగానదులు వచ్చి పూర్ణానదిలో కలుస్తున్నాయి.

ఈ నదిని ఆ ప్రాంతీయులు పరమ పవిత్రంగా భావిస్తారు. ఈ నదికి పయోష్ణి, పైశాని అనే పేర్లు ఉన్నాయి. ఈ పదాలకు అమృతమని అర్థం ఈ నదీ జలాలు సేవించడం అమృత సేవనం వంటిది అని అక్కడివారి నమ్మకం.

ఖడక్‌పూర్ణ, కేతపూర్ణ అనే పేర్లతో కూడా ఈ పూర్ణానదిని వ్యవహరిస్తూ ఉంటారు. బుషావల్ దగ్గర 'పూర్ణ – తపతీ' సంగమము వద్ద చాంగదేవుని దేవాలయం ఉంది.

* * *



# 9. మహీ

నర్మద, తపతి తరవాత చెప్పుకో దగిన నదము మహీ. ఈ నదిని – మేండా, మాహూ, మాలీ అని కూడా పిలుస్తారు.

ఈ నది పుట్టుకను గురించి పురాణగాథ ఒకటి ఉంది. పూర్వం ఇంద్రద్యుమ్నుడనే మహారాజు లెక్కలేనన్ని పుణ్యకార్యాలు చేసి పుణ్యాన్ని కూడగట్టుకున్నాడు. గంగా తీరంలో ఉన్న ఇసుకరేణువులనయినా లెక్క పెట్టగలంగానీ ఈ రాజు పుణ్యాన్ని లెక్కకట్టడం వీలుకాదట. అతడు చేసిన యజ్ఞాలకు ప్రీతి పొంది భూమి నుండి సకల తీర్థసారమయిన జలం పుట్టి ప్రవాహరూపాన్ని పొందింది. ఆ ప్రవాహమే మహిమాన్వితమైన మహీనది.

సుగ్రీవుడు సీతాన్వేషణకు వానరులను అన్ని దిక్కులకు పంపిన సందర్భంలో – వినతుణ్ణి ఈ మహీనది తీరప్రాంతంలో వెదకడానికి పంపినట్లు రామాయణంలో ఉంది.

ఈ నది మధ్యప్రదేశ్‌లోని మైహడ్ సరస్సులో పుట్టి రాజస్థాన్‌లో వగద్ ప్రాంతంగుండా ప్రవహించి గుజరాత్ రాష్ట్రంలోకి ప్రవేశించి చాలాదూరం ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది.

మహీనది సముద్రంలో సంగమించే స్థానంలో సంవర్తుడు, నారదుడు మొదలైన మహర్షులు బహుకాలం నివసించారట. భూమిపైగల తీర్థాలన్నిటా స్నానం చేస్తే పొందే ఫలాన్ని ఈ మహీసాగర సంగమస్నానంవల్ల పొందవచ్చు నని స్కాందపురాణం చెప్తోంది.

ఈ మహీసాగర సంగమ సమీపంలో స్తంభేశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ ప్రాంతంలో మహాక్రూరుడైన తారకాసురుడు సంచరించేవాడు. కుమారస్వామి అతడితో ఘోరమైన యుద్ధం చేసి సంహరించాడు. తారకాసురుని సంహరించి చేపట్టిన విజయానికి చిహ్నంగా కుమారస్వామి

ఒక జయస్తంభాన్ని, మూడు శివలింగాలను ప్రతిష్ఠించాడు. జయస్తంభం ప్రతిష్ఠించడం వల్ల ఈ క్షేత్రానికి స్తంభతీర్థమని పేరు వచ్చింది. ఇక్కడ స్తంభేశ్వరుడు ప్రధాన దైవం. స్తంభేశ్వర దర్శనం సకలపాపహరం.

ఈ నదీ తీరాన భిల్లజాతివారు నివసిస్తున్నారు. వారు ప్రజలను నమ్మించడానికి ఈ నదిమీద ఒట్టుపెట్టుకుంటారు.

ఏదైన తప్పుచేసినవారిని 'మహీనది' నీటిని త్రాగమంటారు. నిజంగా తప్పుచేసినవారు ఆ నీటిని త్రాగలేరు. కష్టపడి తాగినా ఆ నీరు కడుపులో ఇమడవు. బయటకు కక్కుకుంటారు, అని ఇక్కడి ప్రజల నమ్మిక.

ఈ మహీనదికి గుజరాత్‌లో 'మహీసాగర్' అనే వ్యవహారం కూడా ఉంది. గుజరాత్‌లో నూతనంగా ఏర్పడిన ఒక జిల్లాకు మహీసాగర్ జిల్లా అని పేరు.

ఈ నది పొడవు 583 కిలోమీటర్లు.

రాజస్థాన్‌లో బన్‌స్వారా వద్ద మహినదికి డామ్‌కట్టారు. గుజరాతీయులకు ఈ డామ్ త్రాగునీటిని అందిస్తోంది. ఈ నది మొసళ్లకు, తాబేళ్లకు ఆశ్రయము, రక్షణ కూడా కలగజేస్తోంది.

1979లో నదిమీద కడనా డామ్ కట్టారు. దీనివల్ల 6000 కిలోవాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. మహి మహిమాన్వితమైన నది.

* * *



# 10. సబర్మతి

నదముగా చెప్పుకోవలసినది సబర్మతి. ఇది చాలా చిన్నది. ఆకారంలో చిన్నదయినా దీని గురించి చాలా పెద్దపెద్ద విషయాలు ఉన్నాయి.

అసలు ఈ నదికి ఇరువురు మహాత్ములతో సంబంధం ఉంది. ఒకరు పురాణ పురుషుడయిన దధీచి. మరొకరు ఆధునికయుగ నిర్మాత మహాత్మా గాంధీ. ఈ నది

| | | |
|---|---|---|
| సత్యయుగంలో | 'కృతవతి' అనీ | |
| త్రేతాయుగంలో | 'మణికర్ణిక' అనీ | |
| ద్వాపరయుగంలో | 'చందనవతి' అనీ | |
| కలియుగంలో | 'సబర్మతి' అనీ | పిలువబడుతోంది. |

సబర్మతి అనే పేరు ఈ నదికి రావడానికి కారణం ఇలా చెప్తున్నారు.

గంగా – పార్వతి, ఇద్దరూ శివుని భార్యలు కదా. ఒకసారి ఆ సవతులిద్దరికీ ఏదో విషయమై తగవు వచ్చింది. గంగ పార్వతికి భయపడి ఇక్కడా, అక్కడా కంగారుగా గాభరగా తిరగడం మొదలు పెట్టింది. సా = ఆమె, భ్రమతి = తిరుగుచున్నది. 'సాభ్రమతి' అనేది ప్రజల ఉచ్చారణలో 'సబర్మతి' అయిందన్నమాట.

అలా కంగారుగా తిరుగుతున్న గంగను కాశ్యపుడనే మహర్షి తన జటాజూటంలో ముడివేసి అర్బుదారణ్యములోకి తెచ్చి అక్కడ తన జడలను విప్పి ఏడు పాయలుగా వదిలాడు. ఆ ఏడింటిలో ప్రధానమయిన పాయ సబర్మతి. తక్కిన ఆరు హతమతి, ఖారి, మజహమ్, మేష్వో, వాత్రక్, షేధి అనేవి.

ఈ నదులన్నీ 'వేటత' అనే చోట కలుస్తాయి. దాన్ని సప్తనదీ సంగమమని పిలుస్తారు. ఈ సంగమంలో స్నానం సకల పాపహరమని భావిస్తారు. గుజరాతీయుల కిది పవిత్ర స్నానతీర్థము.

సింధునదీ తీరాన ప్రసిద్ధికెక్కిన సింధునాగరికత ఈ సబర్మతీ తీరాన గల 'లోథల్' అనే నగరంలో కూడా కానవస్తోంది. పురాతత్త్వశాఖవారు లోథల్‌వద్ద నేటికీ పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నది 'సబర్' అనే పేరుతో ఆరావళీ పర్వతాలలో నందికుండము దగ్గర పుట్టింది. ఈ నది అర్బుదారణ్యం దాటి దక్షిణంగా ప్రవహిస్తూ మోహసాణా, సబరకాంత జిల్లాలు దాటి అహమ్మదాబాదు జిల్లాలో ప్రవేశిస్తున్నది. ఈ జిల్లాలో 'సబర్' నదికి 'హతమతి' అనే ఉపనది వచ్చి కలుస్తోంది. ఆ తరువాత నుండీ ఈ నదికి 'సబర్మతి' అనే పేరు వచ్చింది. ఇది సౌరాష్ట్రము, కచ్, గుజరాతుల నుండి ప్రవహించి కాంబేశాఖలో సాగర సంగమం చేస్తుంది.

గుజరాతు ముఖ్యపట్టణమయిన అహమ్మదాబాదు నగరం మధ్యగా ఈ నది ప్రవహిస్తూపోతుంది. ఒక్క వర్షాకాలంలో మాత్రమే ఈ నదిలో నీరు పుష్కలంగా ఉంటుంది. తక్కిన రోజుల్లో ఇది ఇసుక దిబ్బలు బయటపడగా శుష్కించి ఉంటుంది.

మహాత్మాగాంధీ అహమ్మదాబాద్‌లో నిర్మించుకున్న ఆశ్రమానికి సబర్మతీ ఆశ్రమమని పేరు. ఇది సబర్మతి ఒడ్డునే ఉంది. దేశంకోసం ప్రాణాలను సయితం అర్పించడానికి సిద్ధపడిన గాంధీ మహాత్ముడు ఈ నదీ జలాలనే త్రాగి, ఈ నదీతీరాన నివసించడం ఈ నదికి ప్రఖ్యాతి తెచ్చింది.

పురాణపురుషుడయిన దధీచి కూడా ఈ నదీ తీరవాసుడే. ఇంద్రుడు వజ్రాయుధం కొరకు దధీచి తన ఎముకలను ఇచ్చాడు. వజ్రాయుధం ఒక మహర్షి ఎముకలతో చేయబడినదన్న మాట.

ఈ సబర్మతి తీరాన ఖడ్గధరేశ్వరాలయం, సప్తర్షి ఘాట్ అనే పుణ్యతీర్థాలు ఉన్నాయి. ప్రసిద్ధ సూర్యదేవాలయాలలో ఒకటయిన – కోట్యార్కాదేవాలయం ఈనది ఒడ్డునే 'ప్రణతిజ్' అనే ఊరికి 12 మైళ్ల దూరంలో ఉంది. 38,000



మంది ఋషులు, శౌనక, వశిష్ఠ, వామదేవ, గౌతమ, గాల్య, గాంగేయ, భరద్వాజ, ఉద్దాలక, జమదగ్ని, కశ్యప, జడభరత, భృగు, జాబాల మొదలయినవారు ఈ నదీతీరాన తపస్సులు యజ్ఞాలు చేసారని పురాణాలు చెప్తున్నాయి.

అంతేకాకుండా రావణాబ్రహ్మను చంపగా వచ్చిన బ్రహ్మహత్యాపాతకం పోవడానికి రాముడు ఈ నదిలో స్నానం చేసాడని చెప్తారు. సబర్మతీ తీరాన ఖిలోడాగ్రామ ప్రాంతంలో గదాధర పురి క్షేత్రం ఉంది. అక్కడ ధృతరాష్ట్రునికి, అతని భార్య గాంధారికి, కౌరవులు వందమందికి విగ్రహాలు ఉన్నాయి.

ఈ నదీతీరంలోనే ఛేడ్‌బ్రహ్మఅనే పుణ్యక్షేత్రం ఉంది. భారతదేశంలో రెండే రెండు ప్రసిద్ధ బ్రహ్మాలయాలు ఉన్నాయి. ఒకటి పుష్కరక్షేత్రంలో, రెండోది ఈ ఛేడ్‌బ్రహ్మక్షేత్రం. ప్రతి ఏటా మాఘమాసంలో ఇక్కడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ నదీ తీరంలో జైనమతాలుకూడా ఉన్నాయి. ఫతేవాడి అనే ఊరు దగ్గర సబర్మతికి ఆనకట్ట కట్టారు. అహమ్మదాబాదు మధ్యగా ప్రవహిస్తూ ఉండడం చేత ఈ నదిమీద ఈ పట్టణంలో అరడజనుకుపైగా వంతెన లున్నాయి. చిన్న నది అయినా పెద్ద విషయాలున్న నది ఇది. ఈ నది పొడవు 416 కిలోమీటర్లు.

* * *

# 11. గోదావరి

దక్షిణ భారతదేశపునదులలో గోదావరి పెద్దది. ముఖ్యంగా ఆంధ్రులకు ఇది పరమపూజనీయమైన నదీమతల్లి. ఈ గోదావరి పేర మన ఆంధ్రదేశంలో రెండు జిల్లాలు ఉన్నాయి. ఒకటి తూర్పు గోదావరి జిల్లా, రెండోది పశ్చిమ గోదావరి జిల్లా. ఈ రెండు జిల్లాల మధ్యగా గోదావరి రమణీయంగా అఖండ గోదావరి పేర ప్రవహిస్తూ ఉంటుంది. వేదంలా ఘోషించే గోదావరీ తీరాన ఇలా రెండు జిల్లాలు కలిగి ఉండడం ఆంధ్రమాత అదృష్టం.

గోదావరికి దక్షిణగంగ అని పేరు. గంగ, సింధు, బ్రహ్మపుత్ర నదుల తరువాత మనదేశపు పెద్దనదులలో గోదావరినే చెప్పాలి. పూర్వకాలంలో ఈ నదిని 'గోదా' అని పిల్చేవారు. 'గోదా' అనేది ద్రావిడభాషాపదం. గోదా అంటే సరిహద్దు అని అర్థం. దక్కన్ భూభాగాన్ని రెండు భాగాలుగా చేసి సరిహద్దుగా ఉండడంవల్ల ఈనదికి 'గోదా' అనే పేరు వచ్చి ఉంటుంది. 'వారి' అంటే నీరు అని సంస్కృత అర్థం. సరిహద్దుగా ప్రవహించే జలం కాబట్టి 'గోదావారి' అనే సమాసం ఏర్పడిఉంటుంది. ప్రజల వాడుకలో 'గోదావరి'గా స్థిరపడింది.

'గోదావరి'కి పండితులు చెప్పే అర్థం మరొకటి కూడా ఉంది.

'గో'శబ్దానికి గోవు అనే అర్థంతో పాటు జలము అనే అర్థం కూడా ఉంది. 'దా' అంటే ఇచ్చునది అని అర్థం. వర అనేశబ్దానికి, శ్రేష్ఠమయిన అని అర్థం. కాగా 'గోదావరి' అంటే శ్రేష్ఠమయిన జలమును ఇచ్చునది అని అర్థం. 'గోదావరి' – శ్రేష్ఠమయిన నీటిని ప్రసాదించే నది అన్నమాట. వాల్మీకి రామాయణంలో ఈ గోదావరిని 'గోదావరీయం సరితాం వరిష్ఠా' – నదులలో గోదావరి శ్రేష్ఠమైనది అని వాల్మీకి ప్రశంసించాడు.

గంగ – గోదావరి – ఒకే చోట పుట్టాయని, గంగ పుట్టిన గంగోత్రి, అంతర్వాహినిగా గోదావరి అయిందని చెప్తారు. గంగ కంటే గోదావరి వయస్సులో పెద్దదట. అందుకే దీనిని వృద్ధగంగ అని పిలుస్తారు.



గోదావరి గంగకు అక్కగారు అనే నానుడి భారతీయులలో ఉంది. ఇది కేవలం పుక్కిటి గాథకాదు. పరిశీలించి చూస్తే భూగోళశాస్త్రరీత్యా సమర్థించడానికి వీలుకలిగిన విషయం. వింధ్యపర్వతాలకు దక్షిణంగా ఉన్న దక్కన్ పీఠభూమి ఏర్పడిన ఎన్నోవందల సంవత్సరాలకు గానీ వింధ్యపర్వతాలకు ఉత్తరాన ఉన్న ఆర్యావర్తము ఏర్పడలేదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. దీనిని బట్టి దక్కన్ పీఠభూమిలోని గోదావరి ముందుగా పుట్టడం, తదనంతరకాలంలో గంగ ఏర్పడి ఉండడం నిజమే అని ఒప్పుకోవలసి ఉంది.

గోదావరి పవిత్రతను గురించి రాముడు స్వయంగా గౌతమునకు చెప్పాడు. అసలు – గోదావరి – గోవు యొక్క పొదుగు నుండి పుట్టినదని చెప్తారు. గోదావరీ స్నానం వలన నల్లని శరీరం తెల్లబడుతుందంటారు.

**గౌతమి :** ఈ నది పుట్టుకకు సంబంధించి కొన్ని పురాణగాథలు ఉన్నాయి. గౌతముడనే మహర్షి నాసికాత్రయంబకం వద్ద బ్రహ్మగిరి దగ్గర ఆశ్రమం నిర్మించుకుని సుఖజీవనం సాగిస్తూఉండేవాడు. ఒకసారి భయంకరమైన క్షామం ఏర్పడింది. వానలు లేవు. పంటలు లేవు. ఈ పరిస్థితి పన్నెండు సంవత్సరాలు కొనసాగింది. మునులందరూ గౌతమ మహర్షిని ఆశ్రయించారు. పరిస్థితిని గమనించిన గౌతముడు వరుణదేవుని ఉద్దేశించి కఠోరతపస్సు చేసాడు. వరుణ దేవుని మెప్పించి వరాలుపొందాడు. ఆ వరప్రభావం వల్ల వానతో పనిలేకుండా, దున్నకుండా సమృద్ధిగా పంటలు పండసాగాయి. గౌతముడు సంతోషంతో నిత్యకర్మలు తీర్చుకుంటు తన ఆశ్రమానికి వచ్చిన వారందరికి ఆతిథ్యం ఇచ్చి ఆనందపడుతున్నాడు. దేశమంతా కరువు కాటకాల్లో మ్రగ్గుతూ ఉంటే – గౌతముని ఆశ్రమ ప్రాంతం సస్యశ్యామలంగా ఫలభరితంగా ఉండడంచూసి ఓర్వలేని సామాన్య ఋషులు ఒక మాయగోవును సృష్టించి గౌతముని పొలంలో వదిలారు. పంటను పాడుచేస్తున్న గోవును

కొట్టలేక, కొట్టకుండా ఉండలేక చిన్న దర్భపుల్లలతో నెమ్మదిగా అదిలించాడు గౌతముడు. అదిలించగానే ఆ గోవు కిందపడి మరణించింది. ఋషులు చేసిన మోసం తెలియని గౌతముడు కంగారుపడ్డాడు. ఋషులందరూ గౌతముడు గోహత్య చేసాడని నిందించసాగారు. గోహత్యాపాతకం పోవాలంటే గంగానదీజలాలను ఇక్కడ ప్రవహింపచేసి అందులో స్నానం చేయాలన్నారు ఋషులు, గౌతముడు పశ్చాత్తాపంతో ఈశ్వరుణ్ణి గురించి తపస్సుచేసాడు. శివుడు ప్రత్యక్షమై గౌతముని కోరిక మేరకు గంగానదిని బ్రహ్మగిరిపర్వతం మీద ప్రవహించేలా చేసాడు. గంగ సోకగానే గోవుబ్రతికింది. గౌతముని గుండె కుదుటపడింది. శివుడు ప్రవహింప చేస్తున్న గంగకు గౌతముడు దర్భపోచలతో ప్రవాహమార్గాన్ని నేలమీద గీస్తూ ప్రవహింపచేసాడు. అందుకే ఆ ప్రదేశానికి 'కుశావర్తం' అనేపేరు వచ్చింది. 'కుశ' అంటే దర్భపుల్ల.

గౌతముని తపస్సువల్ల దిగివచ్చిన నది కనుక గౌతమి అనీ, గోవును బ్రతికించడంవల్ల – గోదావరి అని ఈ నదికి అన్వర్థనామాలు లభించాయి.

**గౌతముడు : గణపతి :** గోదావరి ఉత్పత్తి గురించి మరొక గాథకూడా ప్రచారంలో ఉంది. గౌతమమహర్షి తపస్సంపన్నుడనీ, అతిథిమర్యాదలు, క్రమంతప్పక చేసేవాడనీ ప్రసిద్ధి. ఒకసారి వచ్చిన కరువుసమయంలోకూడా గౌతముని ఆశ్రమంలో పంటలు యధాప్రకారం పండేవి. గౌతముని ఈ ప్రభావం ముల్లోకాలలో వ్యాప్తిచెందింది.

కైలాసంలో పార్వతీదేవికి, గంగాదేవి సవతి కదా. ఆమెకు సవతి ఉండడం కొంచెం కష్టంగా ఉండేది. ఆ విషయం గ్రహించిన గణపతి ఈ గంగానదిని భూలోకానికి పంపితే తల్లి బాధతీర్చవచ్చునని ఆలోచన చేసాడు. గంగను భూలోకానికి పంపే ఏర్పాటు చేస్తానని తల్లికి మాట ఇచ్చాడు. గౌతమమహర్షి వల్లనే ఈ కార్యం సానుకూల పడుతుందని గ్రహించాడు.



గణపతి మాయావటువు రూపంలో గౌతముని ఆశ్రమానికి వచ్చాడు. పార్వతీ దేవి చెలికత్తెకు మాయాగోవుగా గౌతముని చేలో ప్రవేశించు, అతడు ఏమి చేసినా మరణించు అని చెప్పాడు. ఆమె గణపతి చెప్పినట్లు చేసింది. పంటపొలం మధ్యలో ఆవు మేయడం చూసి గౌతముడు మెల్లగా అదిలించాడు. గోవు మరణించింది. గౌతముడు బ్రహ్మహత్యాపాతకుడని ఋషిగణం నిందించి అతనిని వదలి వెళ్లిపోయారు.

గౌతముడు – బ్రాహ్మణరూపంలో ఉన్న గణపతిని సలహా అడిగాడు. ఈ గోహత్యాపాతకం పోవాలంటే శివుణ్ణి ప్రార్థించి గంగను ఈ గోవు మీదుగా ప్రవహింపచేస్తే నీ పాపం పోతుంది అని చెప్పాడు గణపతి.

గౌతముడు తపస్సుచేసి శివుని మెప్పించి – గంగను ప్రవహింపచేయ మని వరం కోరాడు. అంతా గణపతి అనుకున్నట్లే అయింది, గంగానది మాయగోవు మీద ప్రవహించింది. గోవు బ్రతికింది. గౌతముడు గోహత్యాపాతకం నుండి బయటపడ్డాడు. గోవును బ్రతికించిన 'వారి' కనుక గోదావరి గా, గౌతముని ప్రయత్నం వల్ల భూలోకానికి వచ్చింది కనుక గౌతమి గా ప్రసిద్ధి పొందింది.

**గోదావరి జన్మదినం :** బొంబాయి ప్రభుత్వం వారు ఒక భూగోళ నిఘంటువును ప్రకటించారు. అందులో గోదావరి జన్మవృత్తాంతం పేర్కొన బడింది.

మాంధాత చక్రవర్తి పరిపాలిస్తున్న కాలంలో, శ్రీమహావిష్ణువు కూర్మావతారం ఎత్తిన సందర్భంలో – మాఘశుద్ధ దశమి, శనివారం నాడు ఈ నది బ్రహ్మగిరి పర్వతంనుండి ప్రవహించింది. గోదావరి జన్మదినం మాఘశుద్ధ దశమి.

**గోదావరి పుట్టుక :** నాసిక్ జిల్లాలో త్రయంబకమనే గ్రామం వద్ద ఈ గోదావరి పుట్టింది. నాసిక్ దగ్గర ఈ నది చాలా సన్నగా, చిన్నదిగా రాళ్ళ

మధ్యలో ప్రవహిస్తూ ఉంటుంది. నాసిక్ నుండి నలభైమైళ్ళ దాటిన తరువాత దీనికి 'దర్‌న' అనే ఉపనది – ఇగత్‌పురికొండల నుండి వచ్చి కలుస్తుంది. నేవశ అనే చోట – ప్రవర, మూల అనే నదులు వచ్చి కలుస్తాయి. పైఠాన్ నగర్ దాటిన తరువాత గోదావరి హైద్రాబాద్ జిల్లాలోకి ప్రవహిస్తూ వస్తుంది. ఇక్కడే ఈ నదికి ఎడమ వైపున పూర్ణ, కుడివైపున మంజీర అనే నదులు వచ్చి కలుస్తాయి. ఆ తరువాత కొంత దూరంలో ప్రణహిత వచ్చి కలుస్తుంది. ఈ ప్రణహిత ఒంటరిగా రాక వార్థ, వైనగంగలను తనతోపాటు కలుపుకుని తీసుకువస్తుంది. ప్రణహిత కలిసిన తరువాత 50 మైళ్ళ దూరంలో ఈ గోదావరికి ఇంద్రావతి, తుల అనే ఉపనదులు కలుస్తున్నాయి.

గోదావరికి ప్రధానమయిన ఉపనది శబరి. ఇది కూనవరం దగ్గర గోదావరిలో కలుస్తుంది. శబరి వచ్చి కలిసాకనే గోదావరి డెల్టాగా ఏర్పడింది. శబరి గోదావరి కలిసి తూర్పుకనుమల్లోని పాపికొండలమధ్య మనోహరంగా ప్రవహిస్తూ రాజమండ్రి చేరుకుంటుంది. పాపికొండలమధ్య గోదావరి అందాలు చూసితీరవలసిందే. గోదావరి అందానికి మురిసిన ఆధునిక కవులెందరో కవితలు వ్రాసారు.

గోదావరి మీద దాని ఉపనదులమీద కలిసి మొత్తం 25 ప్రాజక్టులు, డామ్‌లు ఉన్నాయి. 1877 లో కాటన్ దొర ధవళేశ్వరం వద్ద గోదావరి మీద ఆనకట్ట కట్టించాడు. దాని వల్ల ఎన్నో కాలువలు వచ్చి 50,000 ఎకరాలుసాగులోకి వచ్చాయి.

రాజమండ్రీ దగ్గర గోదావరి మీద మూడు రైలు బ్రిడ్జులు ఉన్నాయి.

రాజమండ్రి దగ్గర గోదావరి అతి విశాలమై ప్రవహిస్తోంది. ఆ తరువాత ఇది రెండు పాయలుగా చీలింది. ఒకటి వశిష్ఠ పాయ, రెండోది గౌతమి. ఈ రెండు పాయల నడుమ గల ప్రదేశము ఆంధ్రదేశంలో అతి సారవంత మయినట్టిది. అసలు ఈ గోదావరిని ఏడు పాయలుగా చేసి సప్తఋషులూ



తమ వెంట తీసుకువెళ్లారని ఆ ఏడుపాయలూ మళ్ళీ కలిసిన చోటును సప్త గోదావరీ సంగమము పుణ్యతీర్థమని చెప్తారు. గోదావరీ తీరప్రాంతాలు చాలా సారవంతమయినవి.

గౌతముని తీరంలో నిరంతరం పంటలు పండడం, గోదావరి జలాలు భూమిని సారవంతంచేయడం వల్ల గోదావరి డెల్టా విశిష్టత లోకవిదిత మయింది. గోదావరి నదికి 'ఆంధ్రజగతికి అన్నపూర్ణ' అనిపేరు కూడా ఉంది. ఆంధ్రదేశం నడుమగా ప్రవహించే ఈ గోదావరి ఆంధ్రులకు కామధేనువు వంటిది.

పలువురు విదేశీయులు – డచ్చివారు, యూరోపియనులు ఆంగ్లేయులు, ఫ్రెంచివారు – ఈ డెల్టా భాగ్యవంతమయినదిగా గుర్తించి తమ స్థావరాలు ఈ నదీతీరంలో ఏర్పరచుకున్నారు.

**సప్తసాగరం :** గోదావరి సాగరసంగమం చేసే ముందు ఏడుపాయలు గా ప్రవహించింది. కారణం సప్తఋషులు తమ వెంట ఒకొక్కపాయను తీసుకువెళ్లడమే. ఆ సప్తఋషులు వరుసగా గౌతముడు, తుల్యుడు, ఆత్రేయుడు, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, జమదగ్ని, వశిష్ఠుడు. అవి ఎక్కడెక్కడ సాగర సంగమం చేస్తున్నాయో చూద్దాము.

1. గౌతమి – గౌతముని వెంట వచ్చిన గోదావరి పాయ యానాందగ్గర నీలపల్లి వద్ద సాగరసంగమం చేసినది.
2. తుల్యునితో వచ్చిన పాయ చొల్లంగి వద్ద,
3. ఆత్రేయునితో వచ్చిన పాయ కోరంగి వద్ద,
4. భరద్వాజునితో వచ్చిన పాయ గుత్తెన దీవి వద్ద,
5. విశ్వామిత్రునితో వచ్చిన పాయ గుడి మూలరామేశ్వరం వద్ద,

6. జమదగ్నినితో వచ్చిన పాయ దీన్నే వృద్ధ గౌతమి అంటారు. ఇది కుండలేశ్వరము వద్ద,
7. వశిష్ఠునితో వచ్చిన పాయ అంతర్వేది వద్ద సాగరసంగమం చేస్తున్నవి.

ఈ ఏడు పాయలు దాక్షారామం వద్ద కలిసి సప్త గోదావరి అని పిలువబడుతోంది. ఈ ఏడుసాగరసంగమాలు ఉభయగోదావరి ప్రజలచే అతి పవిత్రంగా ఎంచబడుతున్నాయి. ఈ ఏడు స్థలాలకు వెళ్ళి స్నానం చేసి రావడాన్నే గోదావరీ మండలాల్లో సప్తసాగర యాత్ర అంటారు. సంతానం కోరే గోదావరీ తీరవాసులు సప్త సాగరయాత్రచేసి తీరుతారు. ఈ పుణ్యము వలన కలిగిన సంతానానికి 'సాగరం' అని పేరు పెట్టడమున్నూ ఉంటుంది.

ఈ సప్తసాగర యాత్ర చొల్లంగిస్నానంతో అనగా పుష్యబహుళ అమావాస్యనాడు ఆరంభమవుతుంది. ఏడుతావులు చూచుకుని ప్రాయకంగా మాఘశుద్ధ ఏకాదశినాటికి వశిష్ఠా సాగరసంగమ స్థానమైన అంతర్వేదికి చేరుకుంటారు. ఆ ఏకాదశికి అంతర్వేది ఏకాదశి అని పేరు. సప్తసాగర యాత్రకు ఆది, తుది దినాలు ఇలా పర్వదినాలు అయ్యాయి.

శ్రీనాథుడు ఈ సప్తగోదావరి తీర్థాన్ని గొప్పగా పేర్కొన్నాడు.

**సప్తగోదావరం బనుసారతీర్థ**
**ముత్తమోత్తమ మందు మర్త్యుండు చేయు**
**శ్రాద్ధ తిలతర్పణాదు లక్షయఫలంబు**
**త త్సదాసేవనము శివస్థానదంబు** – భీమ – 3-153

యమునానది కృష్ణగాథలను గుర్తుకి తెచ్చినట్లే ఈ గోదావరి రామకథను తలపుకు తెస్తుంది. రాముని వనవాసంతో గోదావరి ముడిపడి ఉంది. ఈ నది తీరాన్నే రాముడు సీతా లక్ష్మణులతో పంచవటిలో ప్రశాంతంగా జీవించాడు. సీతారామలక్ష్మణులు నిత్యమూ గోదావరిలో స్నానాది అనుష్ఠానాలు చేసేవారని వాల్మీకి వర్ణించాడు.



శ్రీరామలక్ష్మణులు తమ తండ్రి మరణవార్త విని స్నానమాచరించింది – ఈ గోదావరి నదిలోనే.

రావణుడు సీతాపహరణం చేస్తుండగా చూసి గోదావరి గజగజలాడి పోయిందని వాల్మీకి వర్ణన.

రావణుడు తనను అపహరించుకుపోతూ ఉంటే సీతమ్మ గోదావరి మాతకు నమస్కరిస్తూ – నా అపహరణ విషయం రామునికి చెప్పు అని వేడుకుంటుంది :

**'హంసకారండవాకీర్ణాం వందే గోదావరీ నదీమ్**
**క్షిప్రం రామాయ శంసత్వం సీతాం హరతి రావణః!'**

వేదంలా ఘోషించే గోదావరీనదీ దివ్య నాదాలు వింటూ శబ్దబ్రహ్మోపాసకుడయిన నన్నయభట్టు రాజమండ్రిలో ఆంధ్రమహాభారత రచనకు శ్రీకారం చుట్టాడు. నన్నయ తెలుగు సాహిత్యంలో ఆదికవి. భారతం ఆదికావ్యం.

భక్తకవి పోతన గోదావరిని – 'అభ్రంకషశుభ్రసముత్తుంగ తరంగ గంగకుం జని' అని పేర్కొన్నాడు. గోదావరిలో స్నానమాడి పవిత్రీభూతుడై ఆ నదీతీరంలోనే తెలుగులో భాగవతరచనకు శుభారంభం పలికాడు.

తెలుగుసాహిత్యంలో భారతభాగవతాలు రెండూ గోదావరీతీరంలోనే పుట్టువు నొందడం విశేషం.

గోదావరిని శ్రీనాథుడు తన భీమేశ్వర పురాణంలో వందల కొలదీ పద్యాలలో వర్ణించాడు.

సీ. **ఆంధ్రభూభువన మధ్యము పుండరీకంబు**
**సప్తగోదావరిజలము తేనె**
**బ్రహ్మసంవేద్యాది బహుతీర్థములు రేకు**
**ల కరులు చారుదివ్యస్థలములు**

నాళంబు లవణాబ్ది వేలావిభాగంబు
కల్యాణభోగ మోక్షములు తావి
దక్షవాటీమహాస్థానంబు కర్ణిక
హంసంబు భీమనాయకుఁడు శివుఁడు

తే. గౌతమీసింధు కౌంతేయ కణ్వనదులు
దుల్యభాగయు నేలేరు తుమ్మికొనలు
భువనసంభావ్యమైన యీ పుణ్యభూమి
యనఘ! సంసారతాప శాంత్యౌషధంబు

– భీమేశ్వర పురాణం – 3ఆ – పద్యం – 50

ఆర్యా! ఆంధ్రభూమండలమధ్యము తెల్లని తామరపువ్వు. సప్తగోదావరి సరస్సులోని నీళ్లు ఆ పువ్వులో తేనె. బ్రహ్మాసంవేద్యము మొదలైన తీర్థాలు ఆ పువ్వురేకులు. ఆ పువ్వుకు అచ్చటి పుణ్యక్షేత్రాలే కింజల్కాలు. ఉప్పు సముద్రపు తీరమంతా తామరకాడ. భోగము, మోక్షములు రెండూ ఆ పువ్వుకు పరిమళాలు. దక్షారామమే ఆ పువ్వు మధ్యగల దుద్దు. భీమేశ్వర స్వామి ఆ పువ్వుమీద కూర్చున్నహంస. గౌతమీనది, కౌంతేయ, కణ్వనది, తుల్యభాగ, ఏలేరు మొదలైన గోదావరి శాఖలు నాచుతీగెలు. సర్వలోకాల్లోనూ పూజింప తగిన ఈ ఆంధ్రదేశము సంసారదుఃఖాలను పోగొట్టి శాంతిని కలుగచేసే దివ్యమైన ఔషధము.

గోదావరి నదివల్ల ఆంధ్రభూమికి ఇంతటి కీర్తి లభించింది.

'అదిగో భద్రాది! గౌతమి ఇదిగో చూడండి' అంటూ రామదాసు – గోదావరిని దర్శింపచేసాడు.

కిన్నెరసాని అనే చిన్న నది కూడా గోదావరికి ఉపనది. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు 'కిన్నెరసాని పాటలు' వ్రాసారు. ఇందులో కిన్నెరసాని నడకలు అనే ఘట్టంలో నదీగమనాన్ని కన్నులకు కట్టించారు.



గోదావరీతీరంలో అనేక పుణ్యక్షేత్రాలు తీర్థాలు వెలిశాయి. గోదావరి పుట్టిన ప్రదేశం నాసికాత్రయంబకం వద్ద శివుడు త్రయంబకేశ్వరునిగా కొలువైఉన్నాడు. అంబకము అంటే కన్ను. త్రయంబకేశ్వరుడు – అంటే మూడు కన్నులుగలస్వామి అని అర్థం. ఈ క్షేత్రం ద్వాదశజ్యోతిర్లింగాలలో ఒకటి.

గోదావరీ తీరాన బ్రహ్మతపస్సు చేసాడనీ అది బ్రహ్మగుండాల క్షేత్రమనీ అంటారు. ఈ స్థలం పశ్చిమగోదావరి జిల్లా ముక్కామల వద్ద ఉంది.

ఆంధ్రదేశంలో ప్రసిద్ధి చెందిన సరస్వతీదేవి ఆలయం బాసరలో ఉంది. బాసర గోదావరీతీరంలో గలపుణ్యక్షేత్రం. గోదావరిలో స్నానం చేసిగట్టు ఎక్కితే శారదాదేవి దర్శనం లభిస్తుంది.

త్రిలింగాలలో ఒకటయిన కాళేశ్వరం – పాపాలను దూరంచేసే నృసింహస్వామి వెలిసిన ధర్మపురి, అంతర్వేది. వీరభద్రుడు కొలువైన పట్టిసీమ, జగన్మోహినీ అవతారుడు నెలవైన ర్యాలి – నిత్యకల్యాణ దేవుడు వీరభద్రుడున్న మురమళ్ళ, పంచారామాల్లో ఒకటైన – దాక్షారామం అన్నీ గోదావరి తీరంలో వెలిసిన పుణ్యక్షేత్రాలే.

ఇవేకాక – రామగిరి, రాజమండ్రి, ధవళేశ్వరం, కొవ్వూరు, కోటిపల్లి, కుండలేశ్వరం, ముక్తేశ్వరం, కేశనకుర్రు, కదలి, మందపల్లి, పలివెల, అయినవిల్లి, వ్యాఘ్రేశ్వరం, పెదపట్నం, సోమేశ్వరం, కపిలేశ్వరం ప్రసిద్ధికెక్కిన గోదావరీ తీరస్థ పుణ్యభూములు. ఇక ఆంధ్రులకు ఆరాధ్యదైవమైన శ్రీరామచంద్రుడు వెలిసిన భద్రాచలం గోదావరితీరాన వెలసినపుణ్యగిరి. ఆగిరి చుట్టూ గోదావరి రామపాదాలు కడుగుతూ ప్రవహిస్తూ ఉంటుంది. సీతారాముల అరణ్యవాసకాలపు జీవన మాధ్యుర్యానికి జీవనాన్ని అందించి ధన్యమైన నది గోదావరి.

భద్రాచలం సమీపంలో ఈ గోదావరీ గర్భంలో వేడినీటిబుగ్గ ఒకటి ఉంది. దీనికి అంతగా ప్రచారం రాలేదు. కానీ ఎంతో మహత్తుగలది.

ఈ ఉష్ణగుండం ఏర్పడడానికి స్థానికులు చెప్పే విషయం సీతారాముల జీవనంతో సంబంధం గలది.

సీతారాములు గోదావరీ తీరంలో నివసిస్తున్న కాలంలో – సీతాదేవి ఋతుస్నానం చేయడం కోసమని లక్ష్మణుడు బాణంతో నదీగర్భంలోని భూమిని బద్దలుచేసి పుట్టించిన వేడి నీటి చలమ ఇది. ఇందులో సీతామాతను స్మరిస్తూ స్నానం చేస్తే పుణ్యమని తీర్థయాత్రికుల నమ్మకం.

ఈ ఉష్ణగుండం గురించి మరొక విశేషం కూడా ఉంది. అది – ఈ ఉష్ణగుండం పూర్వం జనమేజయుడు సర్పయాగం చేసిన స్థలమని కొందరి ఊహ.

శేషుడు ఇతర సర్పములతో వచ్చి శివుణ్ణి పూజించిన స్థలమిది. శివుణ్ణి అర్చించి ఈ సర్పాలన్నీ తమ నివాసం పాతాళలోకానికి తిరిగి వెళ్లినదారి 'పాములేరు' అనేపేర చిన్నవాగుగా నేటికీ ఉంది. ఈ వాగు గోదావరిలో పడుతూ ఉంటుంది. ఈ ఏటిలో అప్పుడప్పుడు ఒకరకమైన కెంపురాళ్లు దొరుకుతాయి. వీటిని సర్పమణులు అంటారు. ఈ పాములేరు ఒడ్డున శేషుడిచే అర్చింపబడిన శివునికి ఒక గుడి ఉంది. ఆ ఆలయం పేరు – శేషేశ్వరాలయం. ఈ శేషేశ్వరాలయం శిథిలమయి పోయింది. కానీ ఈ శిథిలాలకు ఎదురుగా గోదావరి ఆవలి ఒడ్డున రాకాశిగుళ్లు అనబడే శిథిలగుహలు ఉన్నాయి. ఆ గుహలలో జీర్ణ బౌద్ధదేవాలయం ఉంది. అందులో బుద్ధుని విగ్రహం నేటికి నిలిచి తన ఉనికిని చాటుతోంది.

అసలు గోదావరీ తీరవాసమే, ఆ జలపానమే ఎంతో అదృష్టంగా భావిస్తారు. తక్కిన తావుల్లో నివసించి, చక్కెర పిండివంటలూ, పాయసాన్నమూ తినేకంటే ఈ తీరాన నీళ్లతో కడుపు నింపుకుంటే చాలట. చూసారా గోదావరి గొప్పతనం.

**"వరం గోదావరీ తీరే – నీరేణోదర పూరితం**
**అన్యత్ర శర్కరా పూపం – పాయసాన్నం పరిత్యజేత్"**



గోదావరి అనే పేరు నేపాల్‌లోకూడా ఉంది. నేపాల్‌లోని హనుమంత అనే నదికి ఉపనది గోదావరి.

మహారాష్ట్రలో గోదావరీ పరీవాహక ప్రదేశానికి ఒకపేరు 'ఆంధ్రావాక'. గోదావరి పేరుతో ఆంధ్రులకు రెండు జిల్లాలు, ఒకస్టేషన్, 'గోదావరిఖని' అనే పేర ఒకపారిశ్రామిక స్థానం ఉన్నాయి. ఆంధ్రదేశానికి గోదావరితో ఉన్న సంబంధం ఇంత విశిష్టమయినది.

గోదావరి గొప్పను వర్ణిస్తు తెలుగులో ఒకశతకం పుట్టింది ఉదాహణకు

**స్థిరపుణ్యోదయ మేది నీందువదనా సీమంతవీథీలస**
**ద్గురు ముక్తాఫల సూత్రమో। సురుచిరక్షోణీపురంధ్రీయశో**
**ధరధమ్మిల్ల లతాంతమాలికయొ। భూతస్వీకుచ శ్రీమనో**
**హరసంధ్యానమొ నాగ నీదగు ప్రవాహం బొప్పు గోదావరీ!**

– ప్రెగ్గడపల్లి పోతయ్య – గోదావరీ శతకం నుండి

పుణ్యవతియైన భూకాంతామణి తన శిరస్సున ధరించిన పాపటి బొట్టులాగా, యశోధర అయిన భూదేవి కొప్పుతో పెట్టుకున్నపూలచెండు లాగా, ఆమెపాలిండ్లపై కప్పుకున్న పైట చెరగులాగా, గోదావరీ ప్రవాహం మనోహరంగా ఉందంటాడు శతకకర్త.

శ్రీనాథుడు కూడా గోదావరి ప్రాశస్త్యాన్ని ఇలా కీర్తించాడు.

**గోదావరి గోదావరి**
**గోదావరి యంచు పల్కు గుణవంతులకున్**
**గోదావరి తల్లీ సం**
**పాదింతు గదమ్మ నీవు భవ్యశుభంబుల్.**

– శ్రీనాథుడు భీమఖండం

**11.1 శబరి :** గోదావరి ఉపనదులలో శబరి ప్రసిద్ధి పొందినట్టిది. శబరి అనగానే రామాయణం గుర్తుకువస్తుంది. రామాయణంలో శబరికి ఈ శబరికి ఏమయినా సంబంధముందేమో చూద్దాము.

శబరి నదిలో నీళ్ళు నల్లగా బురద బురదగా ఉంటాయి. గోదావరికి వరద వచ్చినప్పుడు ఆ నీళ్ళు నల్ల రంగుగా వుంటే శబరి తగిలింది అంటారు. అంటే శబరి వచ్చి కలిసిందని అర్థం. ఈ శబరి ప్రవహించే కొండలలో నల్లజీడిచెట్లు ఎక్కువ. ఎండాకాలంలో ఆ జీడిగింజలన్నీ రాలి ఉంటాయి. వానలు పడగానే వాననీటికి నలుపురంగు తోడవుతుంది. ఆ నీరంతా వచ్చి శబరిలో పడడం వల్ల శబరి నీరు నల్లగా ఉంటుంది. శబరి ప్రవహించే ప్రదేశంలోని కొండలమీద ఇందుప చెట్లు కూడా ఎక్కువే. ఆ ఇందుప గింజలు కొండల మీద పడిన వర్షపునీటిని అప్పటికప్పుడు విరిచేసి రంగు మారుస్తాయి. జీడిగింజలు నీటిని నల్లగా మార్చేస్తాయి.

రామాయణంలో శబరి – ఒక శబర కాంత. శబరులనే జాతికి చెందిన స్త్రీ అన్నమాట. ఈమె రామభక్తురాలు. రాముడు అరణ్యవాసానికి వచ్చాడని విన్నది మొదలు రోజూ అతనికోసం ఎదురుచూసేది. సీతాపహరణం జరిగిన తరువాత రామలక్ష్మణులు సీతను వెదుక్కుంటూ శబరి ఆశ్రమానికి వచ్చారు. శబరి వారి దర్శనానికి ఎంతో సంబరపడింది. సకల ఉపచారాలు చేసింది. ఆ తరువాత ఫలహారంగా వారికి రేగిపళ్ళు ఏరి తెచ్చింది. రామలక్ష్మణుల దగ్గరగా కూర్చుని ఒక్కొక్క పండూ రుచి చూసి తియ్యగా ఉన్నవి మాత్రమే వారికి పెట్టి పుల్లటివి పారేసింది. అంత భక్తితో ఆమె పెడుతూ ఉంటే ఎంగిలి అని సందేహించకుండా రాముడు వాటిని ఆప్యాయంగా తిన్నాడు. ఆమెకు ముక్తిని ఇస్తూ నదివై ప్రవహించి సకల జనులకు ఉపయోగకారివి కమ్ము అన్నాడు. ఆ శబరే – ఈ శబరి.

శబరి నది తూర్పుకనుమలలో ఒరిస్సా రాష్ట్రంలో సింకరం దగ్గర పుట్టింది. ఒరిస్సాలో ఈ నదిని కోలాబ్ అనిపిలుస్తారు. శబరి కూనవరం దగ్గర గోదావరిలో కలుస్తోంది. ఆంధ్రరాష్ట్రంలోకి ప్రవహించి, సీలేరు అనే ఉపనదిని కలుపుకుంది.

సీలేరు మీద గొప్ప విద్యుత్ ప్రోజెక్ట్ఉంది. అప్పర్ సీలేరు, లోయర్ సీలేరు అని వాటిని వ్యవహరిస్తూ ఉంటారు.



**11.2 ప్రణహిత :** (ప్రాణహిత) ఈ నది మహారాష్ట్ర గడ్చిరోలీ జిల్లాలోను తెలంగాణాలో ఆదిలాబాద్ జిల్లాలోను రెండు రాష్ట్రాలకు సరిహద్దు రేఖగా ప్రవహిస్తున్నది. వార్ధా వైనగంగలు కలిసి ప్రణహిత అనే నదిగా పిలువ బడుతున్నాయి. వార్ధా నదిలో చాలా లోతుగా ఒక గుడి ఉంది. అది సంవత్సరంలో చాలా నెలలు కనబడదు. నీటిలో మునిగి ఉంటుంది. వేసవిలో మాత్రం బయటపడుతుంది. ఆ దేవాలయం పుణ్య క్షేత్రంగా పేరొంది ఉంది. వార్ధానది విదర్భప్రాంతీయలకు పవిత్రమైనది.

ప్రణహితనది మీద చేవెళ్లదగ్గర 'చేవెళ్ల సుజలస్రవంతి' అనే ప్రాజెక్టు నిర్మించడానికి, శంఖు స్థాపన జరిగింది. ప్రణహిత పొడవు 113 కి.మీలు.

ప్రణహితనదిని గురించి చెప్పవలసిన విశేషం ఒకటి ఉంది. పుష్కరాలు వచ్చే నదులలో ఈ నది ఒకటి. నదికి ఉపనదికి కూడా గోదావరి – ప్రణహితలకు పుష్కరాలు వస్తాయి.

**11.3 మంజీర :** మంజీర గోదావరికి ఉపనది. బాగాఘాట్ పర్వత శ్రేణుల్లో పుట్టింది. గోదావరికి దక్షిణంగా వచ్చి కలిసే ఉపనదులలో మంజీర పెద్దది. నిజామాబాదు జిల్లాకు మంజీరా జలాలు ఎంతగానో ఉపయోగపడు తున్నాయి. అసలు ఈ జిల్లా అభివృద్ధికి కారణం నిజామ్ సాగర్ ప్రాజక్టు. ఇది మంజీరా నది మీద నిర్మింపబడి ఉంది. ఇక్కడే జలవిద్యుత్ కేంద్రం కూడా ఉంది. మంజీరా నది కుందుర్తి గ్రామం దగ్గర గోదావరితో కలుస్తున్నది. ఈ నది పొడవు 724కి.మీ.

**11.4 మాచ్ఖండ్:** ఈ నది తూర్పు కనుమలలో విశాఖపట్టణంలో జిల్లా ముడుగల్ కొండలలో పుట్టింది. ఈ నది మీద ఎలక్ట్రిసిటీ ప్రాజెక్ట్ప్రసిద్ధమైంది. ఇదే ఒరిస్సా రాష్ట్రానికి కూడా విద్యుత్తును అందజేస్తోంది.

డుడుమా జలపాతం ఈ నదిమీదనే ఉంది.

ఇవికాక గోదావరి ఉపనదులలో ఇంద్రావతి, బిందుసార, మానేరు నదులు చెప్పతగ్గవి.

# 12. కృష్ణానది

గోదావరి తరువాత దక్షిణ దేశపు నదులలో కృష్ణానది పెద్దది. ఇది మహారాష్ట్ర, మైసూరు, ఆంధ్రప్రదేశ్‌ల గుండా ప్రవహిస్తున్నది.

పురాణాల్లో ఈ నదిని కృష్ణవేణి అంటారు. బౌద్ధజాతకాల్లో దీన్ని కన్వ – పెన్న అంటారు. ఈ నదీ తీరాన బౌద్ధమతం బాగా వృద్ధి పొందింది.

కృష్ణానది దాని ఉపనదుల పుట్టుక గురించి తమాషా కథ ఒకటి ఉంది

బ్రహ్మ ఒకసారి యజ్ఞం చేయాలనుకున్నాడు. విష్ణువు, శివుడు ఉపద్రష్టలుగా ఉన్నారు. ఉపద్రష్టలు అంటే యజ్ఞాన్ని జాగ్రత్తగా జరిగేలా చూసేవారన్నమాట. ఆ యజ్ఞం సహ్యాద్రి మీద చేయడానికి నిశ్చయించుకున్నారు.

బ్రహ్మకు సరస్వతి, గాయిత్రి అని ఇద్దరు భార్యలు. సరస్వతి పెద్ద భార్య. యజ్ఞం (హెూమం) చేసేవేళకు ఈ సరస్వతి రాలేదు. ముహూర్తం మించిపోతూంది. అక్కడి మునులు, దేవతలు అంతా ఆలోచించి చిన్నభార్య గాయిత్రితో యజ్ఞకర్మ పూర్తిచేసెయ్య మన్నారు. యజ్ఞం పూర్తయింది. తనకు బదులుగా బ్రహ్మ గాయత్రితో యజ్ఞకార్యం పూర్తిచేసాడని తెలిసి సరస్వతికి కోపం వచ్చింది. ఆ కోపంలో ఆమె ఆ యజ్ఞ వాటికలోని వారినందరినీ నదులుగా మారి సముద్రంతో కలిసి పోదురుగాక! అని శపించింది. ఆ శాప కారణంగా

విష్ణువు – కృష్ణగా
శివుడు – వేణిగా
బ్రహ్మ – కుముద్వతిగా

తక్కిన దేవతలు విశాల, విజయ, వైష్ణవి, భీమ, తుంగ, భద్రలుగా మారిపోయారు. ఇదీ కృష్ణానది సంగతి.



మహాబలేశ్వరం దగ్గర సహ్య పర్వతాలలో సైకతమనే శిఖరం మీద శ్రీకృష్ణుని విగ్రహముఖం గుండా కృష్ణానది పుట్టింది. సతేరా అనేచోట వేణి అనే నది వచ్చి కృష్ణానదితో కలుస్తున్నది. అక్కడ నుండి దీనిని కృష్ణవేణి అని పిలుస్తున్నారు. మైసూరు గుండా ప్రవహిస్తుండగా దీనికి ఘటప్రభ, మలప్రభ అనే నదులు వచ్చి కలుస్తాయి. భీమ, కృష్ణకు పెద్ద ఉపనది. గంగాపుర్ దగ్గర భీమనది కృష్ణతో కలుస్తున్నది. ఈ గంగపూర్‌లో దత్తాత్రేయుడికి పెద్దగుడి ఉంది. ఈ భీమనదికే చంద్రభాగా అనే పేరేకాదు భీమరథి అనేపేరు కూడా ఉంది.

కృష్ణానది రాయచూరు జిల్లా గుండా తళ్ళికోట ప్రక్క నుండి ప్రవహిస్తున్నది. విజయనగర సామ్రాజ్యం ఈ తళ్ళికోట యుద్ధంతోనే పతనమయింది.

సంగమ్ అనే చోట తుంగభద్ర వచ్చి కృష్ణతో కలుస్తున్నది. ఆ తరువాత మలాపహెురి, భవనాశిని అనే నదులను కలుపుకుని కృష్ణానది పర్వతాల గుండా ప్రవహించి శ్రీశైల మల్లికార్జునుడికి పాదాభిషేకం చేసివస్తుంది. నల్లమల కొండల గుండా ప్రవహించి ఇది ఏలేశ్వరం దగ్గర మళ్ళీ విశాలమవుతుంది.

ఆ తరువాత నందికొండ, నాగార్జునకొండల మధ్యగా ప్రవహించి, ప్రాచీనాంధ్రుల రాజధాని ధాన్యకటకం చూసుకొని, విజయవాడ దగ్గర విశాలంగా ప్రవహించి హంసల దీవి దగ్గర సాగర సంగమం చేస్తున్నది.

ఈ నది ఉభయతీరాలలో బౌద్ధ హిందూ మతాలు రెండూ వృద్ధి పొందాయి. ఈ రెండు మతాలకు సంబంధించిన క్షేత్రాలు ఈ నదీ తీరాన వెలసి ఉన్నాయి. శ్రీశైలము, ఘంటశాల మొదలగునవి.

కృష్ణానదీ తీరానగల అమరావతి, జగ్గయ్యపేట, ధాన్యకటకము నాగార్జున కొండలలో ప్రాచీనమైన అనేక బౌద్ధస్తూపాలు బయటపడినాయి. ఇవి ఒక ప్రత్యేక శిల్పకళకు చెందినవి. బౌద్ధుల చరిత్రను తెలియచెప్పే శిల్పాలివి.

ముగురమ్మల మూలపుటమ్మ అయిన కనకదుర్గాదేవి – విజయవాడలో ఈ నదీ తీరాననే ఇంద్రకీలాద్రిమీద కొలువై ఉంది.

గోదావరి ఆనకట్ట కట్టించిన కాటన్ దొర కృష్ణానది మీద కూడా ఆనకట్ట కట్టించాడు.

1960 లో విజయవాడలో ఈ నది మీద ప్రకాశం బేరేజీ పూర్తి చేయబడింది.

ఆంధ్ర దేశంలోని ప్రాజెక్టులలో ముందు చెప్పదగ్గ ప్రాజక్టు నాగార్జున సాగర్ ప్రాజెక్టు, నందికొండ దగ్గర ఈ నది మీదనే ఉంది.

ఈ నది మీద విద్యుచ్ఛక్తి కేంద్రాలు చాలా ఉన్నాయి. శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు చాలా పెద్దది.

ఆంధ్రదేశంలో ఈ నది పేరనే కృష్ణాజిల్లా ఏర్పడింది. కృష్ణాడెల్టా సారవంతమయినదై ఆంధ్రదేశాన్ని సస్యశ్యామలం చేయడానికి తోడ్పడుతున్నది. నాగార్జున సాగర్ డామ్ వల్ల కొన్ని లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి.

కృష్ణానదీ దాని ఉపనదుల సంగమం దగ్గర సప్తనదీ సంగమేశ్వర క్షేత్రం – ఉంది.

దట్టమైన నల్లమల అడవుల సమీపంలో ఆత్మకూరువద్ద కర్నూలు జిల్లాలో ఏడు నదుల సంగమ స్థలం ఉంది.



ఆ నదులు – కృష్ణ, వేణి, తుంగ, భద్ర – మలాపహారిణి, భీమరథి, భవనాశిని ఈ తీరంలో 7200 ఏళ్లనాటి – లలిత సంగమేశ్వర దేవాలయం ఉంది. ఈ దేవాలయం సంవత్సరంలో రెండు వందల ఇరవై రెండు రోజులు నీటిలో మునిగి ఉంటుంది.

పురాణాలలో ఇక్కడి శివలింగం పంచపాండవులలో పెద్దవాడయిన ధర్మరాజు నెలకొల్పాడనీ, ఆ లింగం వేప కాండంతో తయారు చేయబడిందనీ చెప్తారు. ఇప్పటికీ ఆ లింగం ఇంచుమించు 8000 సం॥లుగా చెడకుండా ఉంది.

పంచారామాల్లో ఒకటైన అమరారామం ఈ కృష్ణానదీ తీరంలోనే ఉంది. అమరావతి గుంటూరు జిల్లాలో ఉంది. ఇక్కడి శివలింగాన్ని ఇంద్రుడు స్థాపించాడు. అమరావతి బౌద్ధక్షేత్రం కూడా.

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన మల్లికార్జున లింగం శ్రీశైలంలో కృష్ణానది ఒడ్డునే ఉంది. శ్రీశైలం దగ్గర కృష్ణానదికి పాతాళగంగ అనిపేరు. పాతాళగంగలోస్నానం పరమపుణ్యప్రదం. శ్రీశైలభ్రమరాంబా మల్లికార్జునులకు ప్రదక్షిణం చేస్తూ కృష్ణానది ఇక్కడ ఒయ్యారాలు ఒలకబోస్తూ ఉంటుంది. ప్రసిద్ధమైన నృసింహదేవాలయం గల మంగళగిరి కృష్ణానదీ తీరస్థమైన పుణ్యక్షేత్రం. పవిత్ర నాగ క్షేత్రం మోపిదేవి కృష్ణా తీరంలోనే ఉన్నది.

ఆంధ్రమహావిష్ణువు దేవాలయం కృష్ణాతీరంలోని శ్రీకాకుళంలో ఉంది. ఈ శ్రీకాకుళంలోని ఆంధ్రమహావిష్ణువుదేవాలయం దర్శించి నిద్రచేసి శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద', ప్రబంధానికి శ్రీకారం చుట్టాడు. మువ్వగోపాలపదాలు వ్రాసిన ప్రసిద్ధ వాగ్గేయకారుడు క్షేత్రయ్య కృష్ణాతీరంలోని 'మొవ్వ' క్షేత్రంలోని గోపాలుని భక్తుడు. కృష్ణలీలాతరంగిణి కర్త నారాయణ తీర్థులు కూడా కృష్ణాతీరవాసి.

## 12.1 తుంగభద్ర

తుంగభద్ర అనగానే ఒకే నది అనుకుంటున్నారు కదూ. కానే కాదు తుంగ, భద్ర అనే రెండునదుల కలయిక వలన ఈ పేరు ఏర్పడింది.

గంగాస్నానం- తుంగా పానం అన్నారు పెద్దలు. గంగలో స్నానము ఎంత పుణ్యప్రదమో – తుంగా జలాలు త్రాగడం కూడా అంతే పుణ్యప్రదము, ఆరోగ్యవంతము. కృష్ణానదికి ఇది ప్రధాన ఉపనది. ఈ రెండు నదులూ పడమటి కనుమలలో గంగమూల అనే చోట పుట్టి కొంతదూరం విడివిడిగా ప్రవహిస్తాయి. తుంగ శృంగేరిని దాటుకుంటూ ప్రవహించి తీర్థహళ్ళి వద్ద తూర్పువైపుకు మళ్ళీ షిమోగా జిల్లాలో కూడ్లి అనే చోట భద్రతో కలిసి తుంగభద్ర అనే పేరుతో కర్నూలు దాటాక కృష్ణానదిలో కలుస్తాయి.

షిమోగా అనే చోటనే ఈ తుంగభద్రనదిలో మరోనది కూడా కలుస్తుంది. షిమోగాకు పూర్వనామం శివముఖం. అంటే ఈశ్వరుని ముఖం అని అర్థం. షిమోగా అంటే మధురభాండం అని అర్థం. ఆ పేరు రావడానికి స్థానికులు చెప్పేకథ ఒకటి ఉంది. పూర్వకాలంలో ఒకముని ఇక్కడ తపస్సుచేసుకుంటూ ఉండేవాడట. ఈ ప్రాంతంలో ఆయనకు మధురమైన ఫలజాతులు, మహత్తుగల మూలికలు లభ్యమయ్యేవట. ఆ ముని వాటిని ఆనందంతో ఆరగించి ఈ ప్రాంతానికి మధురభాండం అని అర్థం వచ్చే 'షిమోగా' అని పిలిచాడట. ఇదికాక తుంగభద్రానదిని గురించి పౌరాణిక గాథ ఒకటుంది.

కృతయుగంలో హిరణ్యాక్షుడు భూమిని మోసుకుని పాతాళ లోకంలోకి తీసుకుపోయాడట. అప్పుడు విష్ణుమూర్తి వరాహ అవతారం ఎత్తి, సముద్ర మధ్యంలో ఎక్కడో పాతాళంలో ఉన్న భూమిని తన కోరలతో పైకి తీసుకువచ్చాడట. ఆ శ్రమ తీర్చుకుంటున్నప్పుడు వరాహస్వామి రెండు దంతముల పైనుండి నీరు జాలువారిందట. అదే ఎడమ దంతంమీద నీరు తుంగగా కుడిదంతం మీద నీరు భద్రగా ప్రవహించాయట.



తుంగానది ఉత్తరపు ఒడ్డున షిమోగాకు 35 మైళ్ల దూరంలో తీర్థహళ్లి అనే పట్టణం ఉంది. తుంగానదీ తీరాన లెక్కకు మించి తీర్థాలు ఉండడంవల్ల ఆ ప్రదేశానికి తీర్థహళ్లి అని పేరువచ్చింది. ఈ నది నిండా పెద్దపెద్ద బండరాళ్లు, ఆ రాళ్ల మధ్యరంధ్రాలు కలిగి ఉండడం విశేషం. దీనికి కారణం పరశురాముడు ఈ రాళ్లమీద కొట్టి తన గండ్ర గొడ్డలి పదును పరీక్షించుకునే వాడట.

ఈ తుంగానది తీరాన ప్రసిద్ధికెక్కిన శృంగేరి ఉంది. ఆదిశంకరులు కాశ్మీరం నుండి సరస్వతీ దేవి విగ్రహం తెచ్చియిక్కడ ప్రతిష్ఠించారు. శృంగేరీపీఠం పక్కనే విద్యాశంకరుని ఆలయం కూడా ఉంది. ఈ ఆలయంలో పన్నెండు రాశులకు పన్నెండు స్తంభాలు కట్టారు. సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఉదయసమయంలో సూర్యకిరణాలు ఆ స్తంభం మీద పడి ప్రకాశిస్తాయి. ఇది గొప్పవిశేషం. ఈ పీఠానికి, దేవాలయానికి క్రీ.శ. 1346లో హరిహరరాయలు ఎన్నో గ్రామాలు దానం చేసారు. దానివల్ల ఈ ఆలయం ఎంతగానో అభివృద్ధి చెందింది.

తుంగ, భద్ర నదులు కూడ్లిగె దగ్గర కలిసి తుంగభద్రానది అనేపేరుతో హొన్నాలి అనే ప్రదేశాన్ని చేరుకుంటుంది. హొన్నాలి అంటే – సువర్ణాగ్ని అని పేరు. ఈ ప్రదేశం భాస్కరక్షేత్రమని చెప్తారు. ఈ క్షేత్రం దాటిన తరువాత తుంగభద్రానదిలో కుముద్వతి అనే నది కలుస్తుంది. సరస్వతి ఇచ్చిన శాపం వల్ల బ్రహ్మ నదిగా మారాడు. ఆ నదే కుముద్వతి. ఈ కుముద్వతిని కలుపుకుని తుంగభద్ర దక్షిణంగా హరిహర పట్టణాన్ని ఒరుసుకుని ప్రవహిస్తుంది. ఈ హరిహర పట్టణానికి సంబంధించి ఒక పురాణకథ ఉంది. పూర్వం గుహుడు అనే రాక్షసుడు ఉండేవాడు. బ్రహ్మనుగూర్చి గొప్ప తపస్సు చేసాడు. హరిహరుల చేత చావులేకుండా వరం పొందాడు. వర మదంతో మునులను హింసించసాగాడు. మునులను రక్షించడానికి హరిహరులిద్దరూ కలిసి ఒక అవతారమెత్తి గుహుణ్ణి సంహరించారు. అయితే ఆ ప్రదేశం తన పేర ప్రసిద్ధికెక్కేలా అనుగ్రహించమని అభ్యర్థించాడు గుహుడు. ఆ ప్రదేశానికి

గుహారణ్యక్షేత్రమని పేరువచ్చింది. కూడ్లిగె వద్ద హరిహరేశ్వరుడు వెలిశాడు. హొయసల రాజయిన రెండవ నరసింహుని మంత్రి – పొలాలపుడు క్రీ.శ. 1223లో ఈ హరిహరేశ్వరాలయాన్ని కట్టించాడు. అద్భుతమైన శిల్పకళా వైభవంతో ఈ స్వామి శిలావిగ్రహం కన్నుల పండువుగా ఉంటుంది.

ఈ క్షేత్రానికి పవిత్రతని కూర్చిన తుంగభద్రానదిలో ఇక్కడ మరో ఉప నది వచ్చికలుస్తుంది. దాని పేరు వరద. శివుడు బ్రహ్మదేవుని పంచముఖాల్లో ఒక ముఖాన్ని ఖండించాడు. ఆ పాతకాన్ని పోగొట్టుకోవడానికి వరదమూల పర్వతంలో కూర్చుని తీవ్రమయిన తపస్సుచేసాడు. ఆ తీవ్ర తపస్సుకు మంటలు లేచాయి. వాటిని చల్లార్చడానికి విష్ణువు తన శంఖంతో గంగా జలాన్ని శివుని శిరస్సుమీద పోసాడు. ఆ గంగాజలమే వరదానదిగా రూపొందింది. వరదానదితో కలిసి సాగుతున్న తుంగభద్రలో హరిద్రా అనే మరోనది వచ్చికలుస్తుంది. అక్కడ నుండి తుంగభద్రానది – హంపీక్షేత్రం గుండా తన ప్రవాహాన్నిసాగిస్తూంది. ఈ హంపీక్షేత్రమే – చరిత్రప్రసిద్ధి గన్న విజయనగరం లేదా విద్యానగరం. విద్యారణ్య మహర్షిచే స్థాపింపబడిన విజయనగర సామ్రాజ్యం – 250 సంవత్సరాలు గొప్పగా విరాజిల్లింది. తుంగభద్రానదీతీరంలో నిర్మింపబడిన ఈ పట్టణం మహావైభవంతో తులతూగింది. తెలుగు సామ్రాజ్యమైన విజయనగరసామ్రాజ్యానికి ముఖ్యపట్టణంగా వుండి, కళలకు సంస్కృతికి నిలయంగా ప్రకాశించింది. శ్రీకృష్ణదేవరాయల వారి కాలంలో హంపీ విజయనగర వైభవం ఖండాంతర ఖ్యాతిని గాంచింది.

రామాయణ కాలం నాటి కిష్కింధరాజ్యమే – ఈ హంపీ క్షేత్రంగా పేర్కొంటున్నారు. కిష్కింధకాండలో వర్ణించిన – మనోహర పంపాసరోవరం – తుంగాభద్రా నదీతీరమే. పంపాక్షేత్రమే – హంపీ క్షేత్రం – అదే తుంగభద్రాతీరం.

విజయనగర రాజులకాలంలోనే తుంగభద్రానదికి పెద్దపెద్ద బండలు అడ్డుపెట్టి ఆనకట్టలు కట్టారు.



హంపీ విజయనగరం దాటిన తరువాత తుంగభద్రానదిలో వేదవతి అనే ఒక నది వచ్చికలుస్తుంది. అక్కడ నుండి తుంగభద్ర కర్నూలు దాటి – రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మంత్రాలయం మీదుగా ప్రవహించి కృష్ణానదిలో కలుస్తుంది.

తుంగభద్రానది పొడవు 400 మైళ్లు.

హొసపేటకు దగ్గరలో నూర్లాపురము దగ్గర తుంగభద్రానది మీద డామ్ నిర్మించారు. ఆంధ్ర కర్ణాటక రాష్ట్రాలకు ఈ డామ్ వల్ల నీరు పుష్కలంగా లభిస్తున్నది.

ఈ ప్రాజక్టు వల్ల నీటితోబాటు పుష్కలంగా విద్యుచ్ఛక్తి కూడా లభిస్తున్నది.

తెనాలి రామకృష్ణుడు ఈ తుంగభద్రానదిని ఎంతగానో కీర్తించాడు. పాండురంగ మహాత్మ్యమనే తన కావ్యంలో గుణభద్రా! తుంగభద్రా నదీ! అని తుంగభద్రను సంభావించాడు.

ఎన్నో గుణములు కలిగిన నది తుంగభద్రట.

**శా. గంగాసంగమ మిచ్చ గించునె? మదిన్ కావేరిదేవేరిగా**
**నంగీ కారమొనర్చునే? యమునతో నానందమున్ బొందునే**
**రంగత్తుంగ తరంగహస్తముల నా రత్నాకరేంద్రుండునీ**
**యంగమ్మంటి సుఖించెనేని గుణభద్రా! తుంగభద్రానదీ!**

తుంగభద్ర తిన్నగావెళ్లి సముద్రునితో కలవదు. కృష్ణానదిలో కలుస్తుంది. స్వయంగా తుంగభద్ర తానే వెళ్లి సాగర సంగమం చేసి ఉంటే – సముద్రుడు గంగానదీ సంగమాన్ని ఇష్టపడేవాడు కాదట. కావేరీ నదిని దేవేరిగా అంటే భార్యగా అంగీకరించేవాడు కాదట. యమున నదితో ఆనందించేవాడు కాదట. గుణభద్ర అయిన తుంగభద్రా! నువ్వు ఉపనదివి అయిపోయావు కదా! అంటున్నాడు తెనాలిరామకృష్ణుడు.

## 12. 2 భీమ - భీమరథి

భీమనది కృష్ణానది ఉపనదులలో ఒకటి. ఈ నది కృష్ణానదిలో కలిసేలోగా – మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల గుండా ప్రవహించి – ఆంధ్రదేశంలో కృష్ణానదిలో కలుస్తుంది. ఈ నది పశ్చిమకనుమల్లో గల గుహనపర్వత శ్రేణుల్లో పుట్టింది. ఈ ప్రదేశం సముద్రమట్టానికి మూడువేల అడుగుల ఎత్తున ఉంది. నీర,సినా అనేవి ఈ నదికి ఉపనదులు. ఈ నది పొడవు 861 కి.మీ.

భీమనదికి భీమరథి అనికూడా పేరు. ఈ నదిప్రస్తావన పురాణాల్లో, భారతంలో కనిపిస్తున్నది.

పూర్వం పరమశివుడు త్రిపురాసురుడిని సంహరించి ఒక ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ ప్రాంతాన్ని భీమకుడనే మహారాజు పరిపాలిస్తున్నాడు. ప్రజలకు సౌఖ్యాలు కల్పించడానికి శివుని గురించి తపస్సుచేస్తున్నాడు. ఇదే కాక ఆ రాజు లేళ్లరూపంలో విహరిస్తున్న మునిదంపతుల్ని సంహరించాడు. ఆ రాజుకు శివుడు ప్రత్యక్షమై వరాలు కోరుకోమన్నాడు. ఆ మహారాజు సంతోషంతో తాను పొరపాటున వధించిన మునిదంపతుల్ని ముందు బ్రతికించమన్నాడు. ఆ తరువాత నా రాజ్యంలో ఈతిబాధలు లేకుండా ప్రజాజీవనం సాగేలా వరం ప్రసాదించమని కోరాడు.

రాజు కోరికను మన్నించి శివుడు తన ముఖంమీది చెమట బిందువులను భూమి మీద రాల్చాడు. ఆ బిందువులు ఒకనదిగా మారి ప్రవహించాయి. ఆ దివ్యనదిలో స్నానం చేసి భీమకుడు పాపాలన్నిటినీ పోగొట్టుకుని పునీతుడయ్యాడు. అతని రాజ్యంలో ఈ నది ప్రవహించడం వల్ల ప్రజలు స్నానం చేసి పునీతులయ్యారు. పంటలకు పుష్కలంగా నీరు అందడంవల్ల రాజ్యం సుభిక్షమయింది.



భీమకుడు అనే రాజు తపస్సుకు ఫలితంగా ఏర్పడిన ఈ నది భీమనది అయింది. అంతేకాక 'భీముడు' అనే పేరు శివునకు కూడా ఉంది. అందువల్లకూడా ఈ నది భీమనది అయింది. భీమునిస్వేదం నుండి పుట్టడం వల్ల భీమానది అయింది. భీమకుడనే రాజుకు ప్రత్యక్షమయిన శంకరుడు ఇక్కడ వెలిసాడు. ఆ కారణంగా ఈ ప్రాంతానికి భీమశంకరపురం అని పేరువచ్చింది. ఇక్కడ లింగం భీమేశ్వర లింగంగా ప్రసిద్ధికెక్కింది. ఇది ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి. భీమానదికి, భామా అనే ఉపనది ఉంది. భీమగిరి అనే సన్ననిలోయ గుండా ప్రవహించి భీమానది భామానదిని తనలో కలుపుకుంది. భీమానదికి మరో ఉపనది ఇంద్రాణి. భక్తతుకారం జన్మించిన దేహు అనే గ్రామం ఈ నది ఒడ్డునే ఉంది. ఈ దేహుగ్రామం యాత్రాస్థలం కూడా. మహా కవి జ్ఞానేశ్వరుడు కూడా ఈ ప్రాంతంవాడే. భీమానదికి "గోడ్" మరొక ప్రసిద్ధమైన ఉపనది. ఈ నది నీరు అజీర్ణ వ్యాధిని పోగొడుతుంది.

ప్రసిద్ధమయిన పండరీపురం ఈ నది ఒడ్డునే ఉంది. అయితే ఈ నదిని ఇక్కడ చంద్రభాగా అని పిలుస్తారు. విష్ణుస్వరూపుడైన విఠలుడు ఇక్కడదైవం. పుండరీకుడనే భక్తుని కోరికపై స్వామి ఇక్కడవెలిసాడు.

ఇలా శివకేశవులే కాక – భీమానది కృష్ణానదిలో కలిసేచోట బౌద్ధశిల్పకళా అవశేషాలుకూడా ఉన్నాయి.

భీమరథికి కూడా పుష్కరాలువస్తాయి. నదికి, ఉపనదికి కూడా పుష్కరాలు ఉన్న నదులు కృష్ణా – భీమరథులు.

* * *

## 12.3 మూసీ

ఈ నదీ తీరాననే తెలంగాణా రాజధాని హైదరాబాదు ఉంది. మూసీనదికి పూర్వకాలంలో ముచికుందా నది అనిపేరు. ముచికుందుడు ఇక్ష్వాకు రాజైన మాంధాత పుత్రుడు. ఒకసారి దేవతలు రాక్షసులచేతిలో ఓడిపోయారు. తిరిగి దండెత్తడానికి దేవతలు ముచికుందుడిని సహాయం కోరారు. దేవతల కార్యాన్ని ముచికుందుడు చాలారోజులు రాక్షసులతో యుద్ధం చేసి విజయవంతంగా నెరవేర్చాడు. దానవులతో యుద్ధం చేసినన్నాళ్లు ముచికుందుడికి నిద్రపోవడానికి క్షణంకూడా తీరిక దొరకలేదు. యుద్ధంలో అలిసిపోయిన ముచికుందుడు ఇంద్రుణ్ణి తనకు నిద్రను వరంగా ఇమ్మని కోరాడు. ఇంద్రుడు సరే అని వరం ఇచ్చాడు. అంతేకాదు తానునిద్రపోతూ ఉండగా ఎవరయినా లేపితే వారు భస్మమైపోయేలా వరం కోరాడు. ఇంద్రుని చేత ఈ వరాన్ని పొందిన ముచికుందుడు భూలోకానికి వచ్చాడు. ఒక మూలగా గుహని ఎన్నుకుని అందులో ప్రశాంతంగా నిద్ర పోసాగాడు. ఇది త్రేతాయుగంలో జరిగింది.

అలా చాలా కాలం గడిచింది. ద్వాపర యుగంవచ్చింది. శ్రీకృష్ణుడికి, జరాసంధుడికి మధ్య పెద్దయుద్ధం జరిగింది. కాలయవనుడు జరాసంధుడికి తోడుగా వచ్చాడు. కాలయవనుడిని శ్రీకృష్ణుడు జయించలేక పోయాడు. అందుకు కారణం సూర్యవంశజులు చంద్రవంశజులు – తప్ప తనను ఇతరులెవ్వరిచేత తనకు చావులేకుండా కాలయవనుడు శివుని వల్ల వరాన్ని పొందాడు. కాలయవనుని నుండి తప్పించుకోవడానికి శ్రీకృష్ణుడు పారిపోతూ పారిపోతూ ముచికుందుడు నిద్రపోతున్న గుహలో దూరాడు. తరుముకు వస్తున్న కాలయవనుడు కూడా ఆ గుహలోకి వచ్చాడు. అక్కడ నిద్రపోతున్న వ్యక్తి కృష్ణుడే అనుకుని గట్టిగా కొట్టాడు.



ముచికుందుడు కోపంతో కళ్లు తెరిచాడు. కాలయవనుడు భస్మమై పోయాడు. కృష్ణుడు సంతోషించి కాలయవనుడికి అనంతపద్మనాభుని రూపంలో దర్శనం ఇచ్చాడు. అంతేకాక భూమి మీద అతడు శాశ్వతంగా గుర్తు ఉండడానికి గాను నదిగా మారి ప్రవహిస్తూ జనోపయోగిగా ఉండమని కృష్ణుడు ఆశీస్సులందించాడు. అలా ముచికుందుని పేర వెలసిన ఆ నదే – ఈనాటి మూసి.

మూసీనది వికారాబాద్ దగ్గర అనంతగిరి కొండల్లో పుట్టింది.

నాగార్జునసాగర్ ప్రాజక్టు నుండి తవ్విన నందికొండ కాలువ ఈ మూసీ నదిని దాటుతుంది. భాగ్యనగరానికి తాగునీళ్ళు అందించే నది ఇది. ఇది కృష్ణానదికి ఉపనది. ఈ మూసీ నది కృష్ణానదిలో వాడపల్లి దగ్గర కలుస్తున్నది. వాడపల్లినే వజీరాబాద్ అంటారు. ఈ ఊరిలో అగస్తేశ్వర దేవాలయం, నరసింహాలయం ఉన్నాయి. రెండూ చిత్రమయినవే. అగస్తేశ్వరాలయం లోని లింగం మీద నీరు ఊరుతూ ఉంటుంది. ఎన్నిసార్లు తీసినా మళ్ళీ నీరు ఊరుతూ ఉంటుంది. ఇక్కడున్న నరసింహస్వామి దేవాలయంలో దేవుడికి ఎదురుగా వరుసగా పదకొండు దీపాలు పెడతారు. అందులో దేవుడి ముక్కుకి ఎదురుగా ఉన్న దీపం గాలి వీస్తే కదిలినట్లు కదులుతూ ఉంటుంది. ఈ దీపాన్నిచూస్తే దేవుడే గాలి పీల్చి వదులుతున్నాడా అనిపిస్తుంది.

మూసీనది మీద చాలా వంతెనలు హైదరాబాదు నగరంలోనే పురానాపూల్ (పాతవంతెన) నయాపూల్ (కొత్తవంతెన) డబీర్‌పుర, చాదర్‌ఘాట్, అంబర్‌పేట, ఉప్పల్‌కలన్ అనే ప్రాంతాల్లో ఉన్నాయి.

* * *

# 13. పినాకిని - పెన్నానది

పినాకినినే పేన్నేరు, పెన్నానది అని కూడా వ్యవహరిస్తారు. దక్షిణ భారతదేశంలో పినాకిని అనే పేరుతో రెండు నదులు ఉన్నాయి. ఈ రెండు కూడా మైసూరు రాష్ట్రంలోని నంది దుర్గములో చిక్కభళ్ళపూర్ వద్ద పుట్టాయి. అక్కడ నుండి తూర్పు దిశగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. దక్షిణపినాకిని, ఉత్తరపినాకిని అని రెండు దిశలుగా ఈ నది ప్రవహిస్తోంది.

యూరోపియనులు ఈ నదిని పెన్నేరు అని పిలిచారు. దీని అసలు పేరు పినాకిని. శివుని విల్లు పేరుకూడా పినాకినే. వర్షాకాలంలో ఈ నది తాండవంచేసే శివునిలా విజృంభించి ప్రవహించడం చేత దీనికీ పేరు వచ్చి ఉంటుంది.

ఈ పినాకిని నది మైసూరులో కోలారు జిల్లా నుండి ఆంధ్రదేశం లోని అనంతపూర్, కడప, నెల్లూరు జిల్లాలగుండా ప్రవహిస్తున్నది. దీని పొడవు 355 మైళ్ళు.

అనంతపూర్ జిల్లాలోని హిందూపూర్ మీదుగా ఈ పినాకిని ప్రవహిస్తూ వస్తుంది. ఈ తీరంలోనే లేపాక్షి దేవాలయం ఉంది. పెద్ద నందీశ్వరుడు కొలువైయున్నాడు. ఇక్కడ 'లేపాక్షి బసవయ్య లేచిరావయ్యా!' అనే గీతం ఈ బసవయ్యను గూర్చి రాసినదే. లేపాక్షి ఆంధ్రుల శిల్పకళకు కాణాచి.

లేపాక్షి నుండి చరిత్రప్రసిద్ధికెక్కిన పెనుగొండ దుర్గాన్ని చూసుకుంటూ, ప్రసిద్ధమైన కడప శిలలను పలకరిస్తూ సంగిలేరు అనే ఉపనదిని కలుపుకుని నెల్లూరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది పినాకిని.

నెల్లూరు జిల్లా ఊటుకూరు వద్ద బంగాళాఖాతంలో కలిసిపోతుంది ఈ పెన్నానది.

పెన్నానదీ తీరానగల పుణ్యక్షేత్రాలలో నృసింహస్వామి దేవాలయం ప్రసిద్ధమైంది. 'పెన్నాహోబిలం' గా పేరు పొందిన దేవాలయం ఇది. ఈ క్షేత్రంలో పెన్నానది తూర్పుదిశగా ప్రవాహాన్ని మళ్ళించుకుంది.



పెన్నానదీ తీరాన జొన్నవాడలో శ్రీకామాక్షీదేవి కొలువై ఉంది.

పాపఘ్ని, చిత్రావతి అనేవి దీనికి ఉపనదులు. 1855 లో నెల్లూరికి ఎదురుగా ఈ పినాకిని నది మీద ఆనకట్ట కట్టారు. 1859 లో వరదకి అది చెడిపోతే 1863 లో కాటన్‌దొర మళ్ళీ కట్టించాడు.

పినాకిని, కృష్ణానదులను కలుపుతూ కడప జిల్లాలో కాలువ ఒకటి ఉంది.

ఈ నది పరంగా - పెన్నదాటితే పెరుమాళ్ళ సేవ - ఏరు ముందా ఏకాశి ముందా! అనే సామెతలు పుట్టాయి. పెన్నానది ఒడ్డున నెల్లూరులో శ్రీరంగ నాయకులనే పెరుమాళ్ళు వెలసి ఉన్నాడు. పెరుమాళ్ళు అంటే శ్రీహరి అని అర్థం. పెన్నదాటితే పెరుమాళ్ళ సేవ అంటే నదిని దాటితే రంగ నాయకుని సేవించుకోవచ్చు అని అర్థం. ఇక ఏరు ముందా ఏకాశి ముందా అనేది, ఆషాఢమాసంలో ఈ నది పొంగుతుంది. ఆ మాసంలో వచ్చే ఏకాదశి ముందా, ఏరుపొంగడం ముందా అనే భావంతో ఈ సామెత వాడతారు.

రెండో పినాకినిని దక్షిణ పినాకిని అంటారు. ఇది బెంగుళూరు సేలం, ఆర్కాటు జిల్లాలగుండా ప్రవహిస్తున్నది. దీని పొడవు 245 మైళ్ళు. హొసపేటలో దీని నీరు నిలువచేసిన ట్యాంక్ చాలా పెద్దది. దాని చుట్టుకొలతే 10 మైళ్ళట.

భారత కర్త కవి బ్రహ్మ తిక్కన ఈ నదీతీర వాసి. తిక్కన మహాకవిత్వ దీక్షావిధితో భారతం వ్రాసిన గంటము ఈ నదీ తీరంలో నెల్లూరు శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో ఉంది.

ఆధునిక కవులు విద్వాన్‌విశ్వం గారి పెన్నేటిపాట, సి. రామకృష్ణారెడ్డి గారి పెన్నేటి కథలు ప్రసిద్ధరచనలు. రాయలసీమ ప్రజల నాగరికత, నీటికటకటలు ఈ రచనల్లో కనిపిస్తాయి.

## 13.1 చిత్రావతి

కర్ణాటక రాష్ట్రంలోని నందికొండల్లో భాగమైన హరిహర పర్వతాల్లో జన్మించి కోలార్‌జిల్లా గుండా ప్రవహించి అనంతపురం జిల్లా చిలమత్తూరు మండలంలో ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవహించింది చిత్రావతీనది.

ఈ నది ఆకారంలో చిన్నదే అయినా, పుట్టపర్తి వంటి పెద్ద ఆధ్యాత్మిక కేంద్రం ఈ నది ఒడ్డునే నెలకొంది. అనంతపురం జిల్లాలోని –గోరంట్ల, పుట్టపర్తి, బుక్కపట్టణం, కొత్తచెరువు, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో ప్రవహిస్తూ – ప్రసిద్ధికెక్కిన గండికోట సమీపాన గండ్లూరు వద్ద పెన్నానదిలో కలిసి పోతుంది. ఈపెన్నా చిత్రావతినదుల మధ్యప్రాంతంలో పెనుగొండ దుర్గం వెలిసింది.

హంపీ విజయనగరం ప్రాభవాన్ని దర్శించిన నది చిత్రావతి.

శిల్పకళాశోభతో ఒప్పే గోరంట్ల మాధవరాయ ఆలయం, కన్నుల పండువుగా ఆంధ్రస్త్రీలకు పట్టుచీరలు అందించే ధర్మవరం, ఈ నదీతీరాననే ఉన్నాయి.

చిత్రావతికి ఉపనదులు మద్దిలేరు. కుషావతి అనేవి. ఈ మద్దిలేరుకి 'అర్జుననది' అనేపేరుకూడా ఉంది. చిత్రావతీ నదీ తీరానగల బూదిలి, బూడిదగెడ్డ పల్లి ప్రాంతంలో విజయ నగర రాజుల ఆయుధాల తయారీ జరిగేదట.

ఈ శతాబ్దంలో భగవాన్ సత్యసాయి బాబావారి ప్రశాంతి నిలయం ఈ నదీ తీరంలో కట్టబడింది. సత్యసాయి బాబావారు మూడువందల కోట్ల ధనం వెచ్చించి ఏర్పాటు చేసిన సత్యసాయినీటి పథకంలో చిత్రావతి కూడా పాలుపంచుకుని నీరు అందించింది.

* * *



# 14. కావేరి

భారతీయులు స్నానారంభంలో స్మరించే నదులలో కావేరిఒకటి. ఉత్తర భారతదేశంలో గంగానది, మధ్యభారతంలో గోదావరివలె దక్షిణ భారతదేశంలో కావేరీనది పేరుగాంచిన నది.

తమిళ కవులెందరో ఈ నదీసౌందర్యానికి ముగ్ధులై కవితలల్లారు.

ఈ కావేరీ నది పుట్టుకను గురించి అగ్ని, స్కాంద పురాణాలలో భిన్నమయిన సమాచారం లభిస్తోంది.

పూర్వం కవేరుడు అనే రాజర్షి ముక్తికోసం బ్రహ్మనుగురించి గొప్ప తపస్సు చేసాడు బ్రహ్మప్రత్యక్షమై విష్ణుమాయ నీకు పుత్రికగా జన్మించి నీకోరిక తీరుస్తుంది అనిచెప్పాడు. ఆ ప్రకారంగా ఆమె కవేరుని కూతురిగా జన్మించి పెరిగి పెద్దదయింది. తండ్రి కోరిక మోక్షం పొందడమే అని గ్రహించింది. ఒకనాడు తండ్రితో – నాయనా! నేను తపస్సుచేసి, నదీరూపాన్ని పొంది, నీకు ముక్తిమార్గాన్ని ప్రసాదిస్తాను అని చెప్పి తండ్రి అనుమతితో – హిమాలయాలలో తపస్సుచేయడం ఆరంభించింది. ఆమె కఠోరదీక్షకు, తపస్సుకు మెచ్చి విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. ఆమె కోరికను విని ఇలా చెప్పాడు –

అమ్మాయి! నీవు రెండు రూపాలు ధరించి లోకానికి మేలుకలిగించు. ఒకరూపంలో పుణ్యనదిగా సహ్యపర్వతాలలో జన్మించు. నీ జలాలో స్నానం ఆచరించి నీతండ్రి పుణ్యలోకాలను చేరుకుంటాడు. అతని కోరిక నీ ద్వారా ఇలా తీరుతుంది. మరొక రూపంలో లోపాముద్రవై అగస్త్యమహాముని వివాహంచేసుకోమని చెప్పి విష్ణుమూర్తి అంతర్ధానమయ్యాడు.

ఆ కాలంలో అగస్త్యమహర్షి హిమాలయాలలో తపస్సు చేసుకుంటున్నాడు. బ్రహ్మ అగస్త్యమహర్షివద్దకు వెళ్లి కవేర మహర్షి విశేషాలన్నీ చెప్పాడు. లోపాముద్ర అగస్త్యుని పతిగా కోరి తపస్సుచేస్తున్నదన్న విషయాన్ని కూడా

అందించాడు. ఆ సమాచారాన్ని అందుకుని అగస్త్యుడు లోపాముద్రను వివాహం చేసుకున్నాడు. కొంతకాలం గడిచింది. దక్షిణ భారతదేశంలో నీటికి కరువు వచ్చింది. ఆ కరువు తీర్చడానికి అగస్త్యుడు బయలుదేరాడు. బయలు దేరుతూ అతడు లోపాముద్రను తన కమండంలో ప్రవేశించమన్నాడు. ఆమెను భద్రంగా కమండలంలో ఉంచుకొని సహ్యపర్వతం మీద బ్రహ్మగిరి అనే చోటుకు చేరుకున్నాడు. ఆ బ్రహ్మగిరిమీద శ్రీమహావిష్ణువు ఉసిరిచెట్టు రూపంలో వెలసిఉన్నాడు. ఆ విష్ణువును అర్థించడానికి బ్రహ్మకైలాసం లోని విరజానదీ జలలాలను శంఖంతో తీసుకొనివచ్చి ఆ ఉసిరిచెట్టు మీద పోశాడు. అదే సమయానికి అగస్త్యుడు కూడా అక్కడికి వచ్చి తన కమండలం ఒకరాతి మీదపెట్టి స్నానానికి వెళ్లాడు. ఒకపెద్దగాలి రావడంతో ఆ కమండలం బోర్లాపడింది. అందులో నీరు అక్కడ ఒలికింది. బ్రహ్మ ధారపోసిన విరజానదీ జలాలతో కలిసి ఆ నీరు ఒక నదిగా ప్రవహించింది. అదే కావేరి నదిగా ప్రసిద్ధి చెందింది. ఇది అగ్నిపురాణం కథ.

## స్కాంద పురాణంలో కథ :

వింధ్య పర్వతం ఒకప్పుడు ఆకాశందాకా ఎదిగి పోయింది. సూర్య గమనం కూడా ఆగిపోయింది. దాన్ని తప్పించడానికి అగస్త్యుడు శివుని అనుమతితో బయలుదేరాడు. అయితే దారిలో స్నానపానాదులకు ఒక గంగపాయను కూడా శివుడు అగస్త్యునికి ఇచ్చాడు. అగస్త్యుడు ఆ గంగను తన కమండలంలో నింపుకుని దక్షిణదిశగా బయలుదేరి వింధ్యపర్వతం వద్దకు వచ్చాడు. వింధ్యుడు అగస్త్యుని కోరికమీద వంగి దారి ఇచ్చాడు. అగస్త్యుడు సహ్యాపర్వతం మీద తపస్సు చేసుకుంటూ ఉండిపోయాడు. ఆ సమయంలో శూరపద్ముడు అనే రాక్షసుడు తన మాయాబలంతో వర్షాలు పడకుండా చేసాడు. ఆ ప్రాంతంలో ప్రజలు విలవిలలాడి పోయారు. వర్షాల కోసం ఇంద్రుణ్ణి ప్రార్థించారు. ఇంద్రుడు ఆలోచించి గణపతిని వేడుకున్నాడు. ఇక్కడి ప్రజలకు నీటిని అందించే ఉపాయం చూడమన్నాడు. అప్పుడు గణపతి ఒకవాయస రూపం (కాకిరూపం) ధరించి సహ్యాపర్వతం మీద తపస్సులో ఉన్న అగస్త్యుని కమండలాన్ని బోర్లా పడేశాడు. ఆ కమండలంలోని నీరు నదిగా ప్రవహించింది. అదే కావేరి. 'కాకవిరి' – కాకివల్ల విస్తరించిన జలం గనుక కావేరి అయింది. తమిళంలో 'కా' అంటే తోట. తోటలో విస్తరించిన జలం కనుక కావేరి అయిందని కొందరు భాషాశాస్త్రపండితులు అర్థంచెప్పారు.



తమిళుల పంచకావ్యాలలో ఒకటైన 'మణిమేఖలైతో – అగస్త్యుని కమండలంలోని జలాన్ని కంధముడనే రాజు తన పాలనలోని దేశం సస్యశ్యామలం కావడానికి ఇవ్వమని ప్రార్థించగా ఆయన ఇవ్వడం వల్ల అదే కావేరిగా ప్రసిద్ధి కెక్కినట్లు వర్ణించబడింది. ఈ అన్ని కథల్లోనూ అగస్త్యుడు, కమండలం, కమండలంలో గంగ ఉండడం గమనించదగ్గ విషయం.

కావేరీ జన్మస్థానాన్ని ఆమలక తీర్థమనీ, శంఖ తీర్థమనీ పిలుస్తారు. విష్ణువు ఆమలక వృక్షంగా (ఉసిరి) మారడం – దానిమీద నుండి బ్రహ్మ శంఖం ద్వారా నీరు పోయడం వల్ల – ఆ పేర్లువచ్చాయి.

పడమటి కనుమలలో కూర్గు వద్ద బ్రహ్మగిరి పర్వతాలలో ఈ నది పుట్టింది. మైసూరు, సేలం, తిరుచునాపల్లి, తంజావూరు, జిల్లాల గుండా ప్రవహించి బంగాళాఖాతములో కలుస్తున్నది. దీని మొత్తం పొడవు 475 మైళ్లు.

మైసూర్‌లో ఈ నదికి – హేమవతి, లోకపావని, శీమ్‌ష, అర్కావతి, లక్ష్మణ తీర్థ, కక్కని, సువర్ణావతి అనే ఉపనదులు వచ్చి కలుస్తున్నవి.

తమిళనాడులో భవాని, నోయిల్, అమరావతి అనే నదులు కలుస్తున్నవి.

ఈ కావేరి మూడు చోట్ల రెండు పాయలుగా వీడి, మళ్ళీ కలిసి మళ్ళీ విడిపోయి కలవడం జరుగుతున్నది. అలా విడిపోయి ప్రవహించిన పాయల మధ్య భాగాన్ని రంగము అంటారు. అవి మూడు కనుక మొదటిది ఆదిరంగమనీ, రెండవది మధ్యరంగమనీ, మూడవది అంతరంగమనీ

ప్రసిద్ధికెక్కాయి. మూడో రంగం చాలా పవిత్రమయినది. ఈ మూడు రంగాల్లోనూ శేషశాయి అయిన విష్ణుమూర్తి దేవాలయాలు ఉన్నాయి.

వైష్ణవుల విష్ణ్వాలయాలే కాక శైవుల చిదంబరం కూడా కావేరితీరాన్నే వుంది. తంజావూరులోని – బృహదీశ్వరాలయము, తిరువైయూర్, కుంభకోణం, తిరుచునాపల్లిలో మాతృభూతేశ్వరుని ఆలయం కావేరి తీరాననే ఉన్నాయి.

కావేరీ నది సముద్రంలో కలిసేచోట దానిని పుహీర్, కకండీ, కావేరిప్పు పట్టణం అని పిల్చేవారు.

కరికాలచోళుడు సింహళంపై దండెత్తి 12000 మంది యుద్ధఖైదీలను పట్టితెచ్చి శ్రీరంగం మొదలు కావేరిప్పు పట్టణం వరకు దాదాపు 100 మైళ్ల పెద్దకట్టలు పోయించాడు. ఆ నది నుండి అనేక కాలువలు తవ్వించాడు. ఇతడు కట్టించిన ఆనకట్టకు 'గ్రాండ్‌ఆనికట్' అనే ప్రఖ్యాతి వచ్చింది.

కావేరి వల్ల మైసూరు రాష్ట్రం బాగా వృద్ధిలోకి వచ్చింది. ఈ నది మీద మొత్తం 15 ఆనకట్టలు కట్టారు. ఇందులో మూడు 1672 ప్రాంతంలో మైసూరు రాజయిన చిక్కదేవరాయలు కట్టించాడు.

సుందర బృందావన్ గార్డెన్స్ ఈ నదీతీరంలోనే ఉన్నాయి.

ఈ ఆనకట్టలలోకల్లా పెద్దది మైసూరులో ఉంది. దాని వల్ల కృష్ణరాజ సాగరము అనే పెద్దసరస్సు ఏర్పడింది. మైసూరు దగ్గరలో కావేరి రెండు భాగాలుగా విడిపోయింది. ప్రపంచ ఖ్యాతి గాంచిన జోగ్ జలపాతము, శివసముద్ర, గెరప్పా, జలపాతములు ఈ నది మీదనే ఉన్నాయి.

తొలితరం భావకవులలో ఒకరయిన శ్రీ అబ్బూరి రామకృష్ణారావు గారు ఈ కావేరీ నది ఆవిర్భావం గురించి 'నదీసుందరి' అనేపేర ఒక చక్కని సంగీతరూపం రచించి కావేరి అందాలు అక్షరబద్ధం చేసారు.



## 15. తామ్రపర్ణి

పురాణాలలో, కావ్యాలలో ఈ నది ఎక్కువగా పేర్కొనబడింది. ఈ నది ఆకారంలో గంగానది కంటే ఎంతో చిన్నది. కాని గంగా స్నానం వలన పొందే పుణ్యం ఈ నదీ స్నానమువల్ల కూడా పొందవచ్చునని పెద్దల మాట. తామ్రపర్ణి జననం గురించి ఒక గాథ ఉంది.

శివపార్వతుల వివాహానికి ఎందరోదేవతలు, మునులు వచ్చారు. ఆ సందర్భంలో అగస్త్యమహర్షికి ఒక దివ్యమైన పద్మమాల బహుమతిగా లభించింది. ఆ మాల శివపార్వతుల కల్యాణంలో ఉపయోగించబడి పవిత్రీభూతమైంది. వివాహపువేడుకల తరువాత అగస్త్యుడు దక్షిణ భారతదేశానికి వస్తూ ఉండగా అతని చేతిలోని పద్మమాల అపూర్వసుందరిగా మారిపోయింది. పద్మపత్రాలవలె మృదువైన శరీరంతో, ఎఱ్ఱని రంగుతో ఉన్న ఆ కన్యను అగస్త్యుడు పితృప్రేమతో స్వీకరించి – అమ్మాయా! నువ్వు మానవాళికి మేలుచేస్తూ నదిగా ప్రవహించు. నీ తీయని జలాలతో జీవుల దప్పిక తీరుస్తూ, స్నానమాచరించే వారికి పుణ్యలోకాలు కల్పిస్తూ లోక కళ్యాణార్థమై చిరంజీవిగా వర్ధిల్లమని ఆశీస్సులు అందించాడు. ఆ నదీతీరాన అగస్త్యుడే స్వయంగా 118 తీర్థాలు స్థాపించాడు.

తామ్రవర్ణి అని, తాంబ్రపర్ణి అనికూడా దీన్ని వ్యవహరిస్తూ ఉంటారు. తామ్రవర్ణి అంటే రాగిరంగు అని అర్థం. ఈ నదీ తీరాన గల ఇసుక రాగి రంగులో ఉంటుంది అందువల్ల ఈ నదికి ఈ పేరు వచ్చి ఉంటుంది. అంతేకాకుండా ఈ నదీ తీరాన ఎఱ్ఱటి ఆకులు గల చెట్లు లెక్కలేనన్ని పెరిగి ఉన్నాయి. అందువల్ల కూడా దీనికీ పేరు వచ్చిఉండవచ్చు. పర్ణి అంటే ఆకులు గలది అని అర్థము. తామ్రపర్ణి అంటే ఎఱ్ఱని ఆకులు గలది అని కావచ్చు.

మెగస్తనీసు ఈ నదిని 'తా(ప్రోబన్' అని వ్రాసాడు. పడమటి కనుమలలో అగస్త్యమలై అనే శిఖరాగ్రాన ఈ నది పుట్టి కొన్ని మైళ్ళు దట్టమయిన చెట్లతోపుల గుండా ప్రవహించి, పాపనాశన తీర్థం వద్ద అయిదు పాయలుగా చీలి జలపాతంగా పడుతున్నది. ఆ కొండలమధ్యలో బాణతీర్థమనే పేరుగల జలపాతంగుండా ఈ నదిపాయ తిరునల్వేలి జిల్లాకు తూర్పువైపుగా ప్రవహించి, మన్నారు శాఖ గుండా సముద్రంలో కలుస్తున్నది. దీని పొడవు మొత్తము70మైళ్ళు.

'చిత్తార్' అనే 45 మైళ్ళ పొడవుగల ఒక నది దీనికి ఉపనది. పాపనాశన తీర్థం దగ్గర ఈ నది మైదానంలో ప్రవేశిస్తున్నది. ఆ స్థలానికి కల్యాణతీర్థమని పేరు. ఇది పవిత్ర తీర్థస్థానము.

శ్రీమహావిష్ణువుకు సంబంధించిన 108 దివ్యదేశాల్లో తొమ్మిది దేశాలు ఈ తామ్రపర్ణినదీ తీరంలోనే ఉన్నాయి. అవి తిరునల్వేలి, తిరుత్తొల విల్లిమంగళము, శిరీవరమంగై, తిరుప్పుళం గుడి, తిరుప్పేరై, శ్రీవైకుంతము, తిరుక్కురుంగుడి, తిరుక్కొళూరు, వరగుణమంగై – అనేవి.

ఇవేకాదు. దక్షిణ కాశీగా పేరు పొందిన 'తెన్‌కాశి' అనే పవిత్రశైవక్షేత్రం కూడా ఈ తామ్రపర్ణీనదీ తీరంలోనే ఉంది.

ప్రాచీన నాగరికతలలో ఒకటైన ద్రావిడనాగరికత ఈ నదీతీరం లోనే పుట్టిపెరిగింది.

ఈ నది మన్నారు శాఖలో కలిసేచోట 'కోల్‌కై' అనే పట్టణము ఉంది. అది పాండ్యరాజుల రాజధాని. ఇది ఒకప్పుడు ప్రసిద్ధ రేవు పట్టణం కూడా.

కయాల్ అనే గ్రామంకూడా ఈ నది ఒడ్డునే ఉంది. మార్కోపోలో అనే విదేశియాత్రికుడు మొదట భారతదేశంలో ఆ తావుననే తన పాదాన్ని పెట్టాడు.



ఈ నది మీద ఎనిమిది డామ్‌లు ఉన్నాయి. ఇందులో ఏడు 15వ శతాబ్దిలో నిర్మించినట్లు చరిత్ర గ్రంథాలలో ఉన్నది. ఎనిమిదో డామ్ పేరు శ్రీవైకుంతం. ఇది 1867 లో కట్టారు.

ఒకప్పుడు ఈ నది మేటలు వేసేసింది. అప్పుడు పోర్చుగీసువారు, తూత్తుకుడి దగ్గర ఒక రేవును కొత్తగ నిర్మించారు.

ఈ నది గురించి తప్పక చెప్పుకోదగ్గ విశేషం ఒకటి ఉంది. తనలో పడిన వర్షపు బిందువులను ఈ నదీమతల్లి మంచి ముత్యాలుగా మారుస్తుందట. ఈ నదిలో ముత్యాలు దొరుకుతాయి అని పరంపరగా చెప్పుకునేమాట.

* * *

## 16. పంపానది

శబరిమలై దగ్గర ఈ పంపానదీ తీరాననే అయ్యప్పస్వామి కొలువుతీరి ఉన్నాడు. కేరళరాష్ట్రంలో పెరియార్ తరువాత ఈ పంపానదే పెద్దనది. తిరువాన్‌కూరు జిల్లాగుండా పత్తనమిట్ట, చెంగన్నూరు, కుట్టనాడ్, అంబలపూజ, అయిరూర్ల గుండా ఈ నది ప్రవహిస్తుంది.

ఈ నదిని దక్షిణ భాగీరథిఅనీ, 'రివర్‌బాంప్' అనీ కేరళీయులు పిలుస్తారు. అజ్‌తుయార్, కక్కియార్, కక్కత్తర్, వరత్తార్, కుట్టెయ్‌పేరూర్. అనేవి పంపానదికి ఉపనదులు.

ఈ నదీతీరంలో అంజనదేవాలయం అతి ప్రసిద్ధమయినది.

* * *

# 17. బాహుద

బాహుదానది ఉత్తరభారతదేశంలో – హిమాచలప్రదేశ్‌లో ఉంది. ఇది రాప్తి అనే నదికి ఉపనది.

ఈ నది గురించిన పౌరాణిక గాథ విశేషమైనది. శంఖుడు లిఖితుడు – అనే ఇద్దరు అన్నదమ్ములు ధర్మపరాయణులు. ఒకసారి తమ్ముడు లిఖితుడు ఆకలికి తాళలేక అన్న ఆశ్రమంలోని మామిడచెట్లపండ్లను అన్న అనుమతి లేకుండా కోసుకుని తిన్నాడు. ఆ విషయం విన్న అన్నగారు అయ్యో! అలా యజమాని అనుమతి లేకుండా తిన్నావు. కనుక, ఈ రాజ్యాధిపతి ఏ శిక్షవిధిస్తే దానిని అనుభవించడమే ధర్మం అన్నాడు.

లిఖితుడు రాజదర్శనానికి వెళ్లి విషయం వివరించాడు. ఆ రాజు ధర్మవర్తనుడని పేరు పొందిన లిఖితుడికి శిక్షవిధించడానికి మోహమాట పడ్డాడు. కానీ లిఖితుడు తాను శిక్షపొందవలసిందే అని పట్టుపట్టాడు. ఆ నాటి దొంగలకు శిక్ష బాహుఖండనం. అదే శిక్ష అమలు చేసాడు రాజు. లిఖితుని భుజాలు రెండూ తెగగొట్టారు. శారీరకంగా బాధపడినా, శిక్షపడినందుకు మానసికంగా తృప్తిపడ్డాడు లిఖితుడు. అన్నగారితో చెప్పి ఆనందించాడు. ఆ నాటి సాయం కాలం – నదీస్నానం చేసాడు. సూర్యునికి అర్ఘ్యం ఇవ్వడానికి బాహువులు లేవే అని దుఃఖపడ్డాడు. మరోసారి నదిలో మునక వేశాడు. లేచేసరికి చిత్రంగా అతని భుజాలు అతనికి వచ్చేసాయి. నిర్విఘ్నంగా సూర్యునికి అర్ఘ్యం సమర్పించి సంతుష్టుడయ్యాడు లిఖితుడు. ఈ సంఘటన జరిగిననాటి నుండి ఆ నదికి పూర్వపుపేరు పోయి 'బాహుద' అనే పేరువచ్చింది. 'బాహుద' అంటే బాహువులను ఇచ్చినది అని అర్థం. లిఖితుడికి బాహుప్రదానం చేయడం వల్ల ఆ నది 'బాహుద' అనే పవిత్ర నామాన్ని సంపాదించుకుంది.

ఆంధ్రప్రదేశ్‌లో బాహుదానది చిత్తూరుజిల్లా పార్శీకొండలలో పుట్టి వాయల్పాడు ద్వారా ప్రవహించి కడపజిల్లాలో ప్రవేశించి పెన్నా నదిలో కలుస్తోంది.



దీని ఒడ్డున తాటిచూటపాలెం, భరతం, మిట్టపాకాల, కాణీపాకం వంటి ఊళ్లు ఉన్నాయి.

కాణీపాకంలో వినాయకుని దేవాలయానికి ఎదురుగా ప్రవహించే నదే ఈ బాహుద – అని ఆంధ్రుల నమ్మిక, స్థలపురాణ కథనంకూడా.

ఒరిస్సారాష్ట్రంలోని గంజాంజిల్లాలో ఒక బాహుదా నది ఉంది. దీని ఒడ్డున వనసోలా అనేగ్రామం ఉంది. అక్కడ పాండురంగవిఠల్ దేవాలయం ఉంది.

మొత్తానికి – హిమాచలప్రదేశ్‌లో, ఆంధ్రప్రదేశ్‌లో, ఒరిస్సా రాష్ట్రంలో– కూడా ఈ 'బాహుద' అనే పేరుతో నదులు ఉండడం విశేషం.

# 18. పెరియారు

పెరియారు దక్షిణ భారతదేశంలో జీవనది. ఈ నది కేరళరాష్ట్రంలో చాలా పట్టణాలకు మంచి నీటిని అందిస్తున్నది.

పెరియారు అంటే పెద్దనది అని అర్థం. ఇది కూడా పడమటి కనుమలలో శివగిరి అడవులలో దేవికోలమ్ కొండలలో పుట్టింది. పెద్దనది అని పేరున్న ఈ నది పొడవుమాత్రం 244 కిలోమీటర్లు మాత్రమే. ఇది ఉత్తరంగా ప్రవహించడం మొదలు పెట్టి పశ్చిమంగా మళ్ళుతుంది. అలా కొంతదూరం ప్రవహించాక ఇది రెండు పాయలుగా విడిపోతుంది. ఒకపాయ పుల్లిపురం దగ్గర ఆరేబియా సముద్రములో కలుస్తున్నది. మరో పాయ ఎర్నాకులం వద్ద ఇగిరిపోతున్నది.

ఈ నదీతీరంలోని అలువ అనేగ్రామంలో శివరాత్రి ఉత్సవాలు గొప్పగా చేస్తారు. పెరియారు నదీతీరంలోనే అద్వైతమతస్థాపకుడు ఆదిశంకరాచార్యులు జన్మించిన కాలడిగ్రామం ఉన్నది. ఈ నదిని అక్కడ పూర్ణానది అని కూడా వ్యవహరిస్తారు.

మానవ మేధస్సుకి పెరియారు ప్రాజెక్టు ఒక నిదర్శనము. వృథాగా పోతున్న పెరియారు నీటిని ఉపయోగపడేలా చేయడానికి కొండను దొలిచి ప్రవాహాన్ని అటుగా మళ్లించి పెరియార్ ప్రాజెక్టు కట్టారు. దీనివల్ల తమిళనాడులోని మధుర జిల్లాలో వ్యవసాయం అభివృద్ధిలోనికి వచ్చింది. ఈ నదిపై కట్టిన మూలమట్టిమ్ పవర్‌స్టేషన్ కేరళారాష్ట్రానికి విద్యుత్తును అందిస్తున్నది.

## 19. అడయార్

అడయారు చెంగల్పటు జిల్లాలోని చంబరమ్ బక్కమ్ సరుస్సులో పుట్టింది. 42 కిలోమీటర్లు ప్రవహించి బంగాళాఖాతంలో పడుతున్నది. చెన్నైలో ఒకచిన్ననది అడయార్. తమిళభాషలో ఆర్ అంటే ప్రవాహం అని అర్థం. పెరియ+ఆర్=పెరియార్ అయింది. అడయ్+ఆర్=అడయార్ అయింది. చెన్నైలో అడయార్ ఒకపేటకు పేరు. ఈ అడయార్ చెన్నైలోనే సముద్రంలో కలుస్తుంది. అడయార్‌లో పెద్ద మట్టిచెట్టు ప్రసిద్ధి పొందింది.

## 20. పాలార్

పాల్+ఆర్=పాలార్ – ఇది కర్ణాటకలో నంది కొండల్లో పుట్టి కర్ణాటకలో 93 కి.మీ. తమిళనాడులో 222 కి.మీ. ఆంధ్రప్రదేశ్‌లో 33 కి.మీ దూరం ప్రవహిస్తోంది.

ఈ నదికి గుప్తగామిని అనేపేరు కూడా ఉంది. సంస్కృతంలో ఈ నదిని పయస్వినీ అంటారు. ఈ నది అక్కడక్కడ కనబడకుండా ప్రవాహాన్ని దాస్తూ ప్రవహించి బేతమంగళ వద్ద సముద్రంలో కలుస్తోంది.

వెల్లూరు, ఆర్కాట్, వాలాజిపేట, కంచి వంటి ఊర్లు ఈ నదీ తీరాన ఉన్నాయి. కంచి కామాక్షీ దేవిని నిత్యం కొలుస్తూ ప్రవహిస్తూ ఉంటుంది ఈ పాలారునది.



ఈ నది పొడవు 348 కిలోమీటర్లు. ఆంధ్రప్రదేశ్‌లో కుప్పమ్ దగ్గర పాలారునదిమీద ఇరిగేషన్‌డామ్ కడుతున్నారు. చెయ్యారు అనే నది పాలారునదికి ఉపనది. ఈ నది అక్కడక్కడ కనపడకుండా ప్రవాహాన్నిదాచేస్తూ ఉంటుందట.

## 21. వైగై

ఈ నది మధుర జిల్లాగుండా ప్రవహిస్తున్నది. ఇది పడమటి కనుమలలో పళని కొండలలో రెండు వాగులుగా పుట్టి దిగువన కలిసి వైగై నది అయింది. ఇది మధుర పట్టణం గుండా తిన్నగా ప్రవహించి రామ్‌నాడ్‌కు సమీపంలో సముద్రంలో కలుస్తున్నది. ఈ నది పెరియార్ పీఠభూమి గుండా ప్రవహిస్తూ, కంబంవాలీని చేరుకుంటుంది.

ఈ వైగై నది కావేరి – పెరియారు నదుల మధ్యగా ప్రవహిస్తున్నది.

మధుర దగ్గర దీని మీద రెండు డామ్‌లు కట్టారు. ఒకటి పెద్దది. రెండవది చిన్నది. పెద్ద దాన్ని పెరనై అని చిన్నదాన్ని చిట్టనై అని పిలుస్తారు.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి 'ఏకవీర' నవలలో ఈ నదీ వర్ణన అద్భుతంగా ఉంది. ఆ నవల వైగై నది వర్ణనతోనే ఆరంభమవుతుంది.

## 22. లూని

సముద్రంలో నీళ్లు ఉప్పుగా ఉంటాయని మనకందరికీ తెలుసు. ఎన్ని నదులు తియ్యని నీళ్లు తెచ్చి పోసినా ఆ ఉప్పన తగ్గనే తగ్గదు. సముద్రమే కాకుండా ఒక నదిలో నీళ్లు కూడా ఉప్పగా ఉంటాయి. అది రాజస్థాన్‌లో ఉంది. ఆ నది పేరు 'లూని' సంస్కృతంలో దీన్ని 'లవణవారి' అంటారు. లవణం అంటే ఉప్పు, వారి అంటే నీరు. ఉప్పునీరు అని అర్థమన్న మాట. ఉప్పునీటినది ఇది ఒక్కటే అని చెప్పవచ్చు.

ఇది ఆరావళీ పర్వతాలలో పుష్కర్‌వారీలో పుట్టి, ఆజ్మీ, అజ్మీర్, బర్‌మేర్, జోలార్, జోధపూర్, నగౌర్, పాలి, శిరోషి జిల్లాగుండా ప్రవహిస్తుంది. మొదట్లో దీనిపేరు సుర్‌సుతి. గోవిందగర్ అనే పట్టణం దాటాక, 'సుర్‌సుతి' అనే నది వచ్చి సగర్‌మతి నదిలో పడుతుంది. సగర్‌మతితో కలిసిన సుర్‌సుతి 'లూని' అని పిలువబడుతూంది. బలోత్ర అనే ఊరి వరకు దీని నీళ్లు తియ్యగానే ఉంటాయి. ఆ తరువాత ఉప్పగా మారిపోతాయి. ఉప్పునీటినది కావడమే కాకుండా లూనీ నదికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఇది అన్ని నదులలా సముద్రంలో కలవదు. కచ్ ఎడారిలో అంతర్థాన మయిపోతుంది. సుక్రి, మైత్రి, బంది, ఖరి, జవాయి, సాగి అనేవి ఈ నదికి ఉపనదులు.

దీని నీరు ఉప్పన మూలంగా సముద్రుడు తన దాకా రానివ్వలేదేమో?

## 23. అంబ

ఈ నది మహారాష్ట్రలో ఉంది. భారతంలో వినిపించే స్త్రీ పాత్రలలో 'అంబ' ఒకటి. భీష్ముడు అంబ, అంబిక, అంబాలిక అను ముప్వురు అక్క చెల్లెండ్రను తెచ్చి తన తమ్ములకు ఇచ్చి వివాహం చేయబోయాడు. అంతలో 'అంబ' తాను సాళ్వదేశాధిపతిని ప్రేమించానని చెప్పింది. అందువల్ల ఆమెను ఆ రాజు వద్దకే పంపేశాడు భీష్ముడు. కానీ ఆ రాజు ఆమెను తిరస్కరించాడు. అందువల్ల ఆమె శోకభారంతో నదిగా మారిపోయింది. ఈ నది అంబే అని స్థానికులు చెబుతారు. రామాయణంలో శబరిలా భారతంలో అంబ – నదీరూపం దాల్చింది.

ఈ నది సహ్యాద్రి పర్వతశ్రేణిలో బోరఘాట్ పర్వతాల్లో పుట్టింది. ఖోపోలి – ఖండాల రోడ్డు సమీపంలో 76 కి.మీ. పొడవు ప్రవహించే వర్షాధారపు నది ఇది.

ఈ నదీతీరంలో 'ధరమతం' అనే ప్రాచీన కాలపుకోట ఉంది.

* * *



## 24. వశిష్ఠ

వశిష్ఠ మహర్షిపేర ప్రవహిస్తున్న నది ఇది. సేలంజిల్లాలో పుట్టింది. పట్టుదురై, అట్టారు, కడలూరు, అడగలూరు జిల్లాలగుండా ప్రవహిస్తోంది. పెరియారుడామ్, అట్టారుడామ్ – ఈ నదీప్రాంతంలోనే ఉన్నాయి.

శంభవమూర్తేశ్వర, పంచభూతేశ్వర దేవాలయాలు ఈ నదీ తీరంలో ఉన్నాయి.

ఈ నది వెల్లార్ అనే నదికి ఉపనది. తమిళదేశంలో పెరంబులర్, అట్టూర్ తాలుకాలకు సరిహద్దుగా ప్రవహిస్తున్నది.

ఉత్తర హిందూదేశంలోని సరయూ నదికి కూడా 'వాశిష్ఠి'నది అనే వ్యవహారం ఉంది. ఇక్ష్వాకుల కోరికపై మానససరోవరం నుండి వశిష్ఠ మహర్షి సరయూనదిని అయోధ్యానగర సమీపానికి తెచ్చాడు. అందువల్ల ఆ నదికి 'వాశిష్ఠి' అనేపేరు కూడా వచ్చింది.

## 25. బ్రాహ్మణి

చోటా నాగ్‌పూర్ ప్రాంతాన్ని పుట్టిన కోయల్, శంఖ్ అనే రెండు నదులు కలిసి బ్రాహ్మణి అనే పేరుతో పిలువబడుతున్నాయి. ఈ నది ఒరిస్సా రాష్ట్రంలోని కటక్ జిల్లాలోనికి ప్రవహిస్తున్నది. ఇది ధమర, మైపర అనే రెండు పాయలుగా చీలి బంగాళాఖాతములో కలుస్తూంది.

సముద్రంలో కలిసేముందు దీనికి ఖరసువా అనే ఉపనది వచ్చి కలుస్తూంది. కోయల్ శంఖ నదుల సంగమంతో కదా బ్రాహ్మణి ఏర్పడింది. ఆ నదుల సంగమ స్థలం గంగపూర్ జిల్లాలో ఉంది. ఆ తావు బహురమణీయ మయినది. అంతేగాదు పురాణ ప్రసిద్ధి నొందినట్టిది. దీని నిడివి 799 కి.మీ.

* * *

ఈ నది మీదనే పరాశరుడు మత్స్యగంధిని చూశాడు. ప్రేమించాడు. పరాశర మత్స్యగంధుల పుత్రుడే వేదవ్యాసుడు. మహాభారత రచయిత.

మహాభారతం మనకు రావడానికి ఒక విధంగా ఈ నది కూడా కారణమన్న మాట.

## 26. విశ్వామిత్రి

విశ్వామిత్రమహర్షితో సంబంధంగలనది ఇది. విశ్వామిత్రి నదీ తీరాన బరోడా నగరం ఉంది. ఈ నది బరోడాకు 27 మైళ్ళ దూరంలో ఉన్న పవగడ్ పర్వతాలలో పుట్టింది. మాహి నర్మదానదుల మధ్యగా ప్రవహిస్తూంది. విశ్వేశ్వర్ అనే ఊరిచెంత సూర్య అనేచిన్ననది వచ్చి విశ్వామిత్రితో కలుస్తున్నది. ఈ నది మీద బరోడా దగ్గర రాళ్ళతో కట్టిన వంతెన ఒకటి ఉంది. ఆ కట్టుబడికి, దాని గట్టిదనానికి ఆంగ్లేయులే ఆశ్చర్యపోయారు.

విశ్వామిత్రి పుట్టుకను గురించి పురాణగాథ ఒకటి వుంది. పూర్వం చంపాపతి అనే గ్రామంలో బ్రాహ్మణోత్తము డొకడు తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఒకనాడు అతడు తన శిరస్సుని ఖండించి శివునికి నివేదన చేశాడు. కానీ శివుడు ఆ రక్తం తన మీద పడకుండా భూమి లోపలికి క్రుంగిపోయాడు. అందువల్ల అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడింది. ఒకనాడు విశ్వామిత్రుని కామధేనువు ఆ గోతిలో పడింది. పైకి రాలేకపోయింది. భగవంతునితో మొరపెట్టుకుంది. భగవంతుడు ఆ గోవుని పాలుకురిపించ మని ఆ పాలలో తేలి పైకి రమ్మనీ చెప్పాడు. అలా చేసి ఆ కామధేనువు పైకి వచ్చింది. తిరిగి అలాంటి ప్రమాదాలు జరుగకుండా విశ్వామిత్రుడు హిమాద్రిని ఆ గోతిలో పడమన్నాడు. హిమాద్రి అందులో పడింది. ఆ గోతిలోని పాలు, ఆ పర్వతం గుండా నదిగా ప్రవహించాయి. విశ్వామిత్రుని కారణంగా నదిగా రూపొందింది గనుక అది విశ్వామిత్రి అయింది. ఈ నదిలో నీళ్లు సాక్షాత్తూ కామధేనువు పాలు అన్నమాట.



కాలుష్యం అధికంగా ఉన్నా ఈ నదిలో మొసళ్లు యధేచ్ఛగా జీవనం సాగిస్తూ ఉంటాయి.

## 27. రంగమతి

ఈ నది జామ్‌నగర్ జిల్లాలో ఉంది. పదసంచసార అనే గ్రామానికి దగ్గర కొండలలో పుట్టి జామ్‌నగర్ గుండా ప్రవహిస్తున్నది. జామ్‌నగర్‌లో నాగమతి అనే నది వచ్చి ఈ నదితో కలుస్తున్నది. నాగమతి జలియాదివానీ కొండలలో పుట్టినది. రంగమతి పొడవు 34 కిలోమీటర్లయితే నాగమతి పొడవు 47 కిలోమీటర్లు. అసలు నది కంటే ఇక్కడ ఉపనది పొడవయినది.

రంగమతి నీళ్లు అద్దకం పరిశ్రమకు పేరు మోసినవి. జామ్‌నగర్‌లో 'బాంధణీ' అనే అద్దకం ప్రసిద్ధికెక్కినట్టిది. దీన్నే ఇంగ్లీషులో 'టై అండ్ డై' అంటారు. అంటే మనకు కావలసిన డిజైను ముళ్లుగా వేసి అద్దకం చేయడమన్నమాట. ఈ రంగమతి నీళ్ళతో చేసిన అద్దకం చిరకాలం ఉంటుంది. వెలిసిపోవడం జరగనే జరగదు. రంగు చక్కగా బట్టకు పడుతుంది. అందుకే ఇది రంగమతి అయి ఉంటుంది.

* * *

# VII ఆంధ్రదేశంలోని చిన్న నదులు

ఆంధ్రదేశంలోని చిన్న నదుల గూర్చి చెప్పుకునే ముందు పెద్ద నదులేవో తెలుసుకుందాము.

**"కృష్ణా పినాకినీ గోదా**
**తుంగభద్రా పయః శ్శుభామ్**
**త్రిలింగ జననీం వన్దే**
**త్రికోటి జనశోభితమ్"**

అని తెలుగుదేశంలో కృష్ణా, పినాకిని, గోదావరి, తుంగభద్ర ప్రముఖ నదులుగా ఈ శ్లోకంలో చెప్పబడ్డాయి. ఇవికాక కొన్ని చిన్న నదులు గురించి ఇక్కడ చెప్పుకుందాము.

**1. వంశధార :** ఈ నది ఒరిస్సాలో రుమూల్‌రామ్‌పూర్ వదపుట్టి శ్రీకాకుళం జిల్లాలో బారువ దగ్గరగా ప్రవహిస్తున్నది. ఇది కళింగ పట్నం దగ్గర సాగర సంగమం చేస్తున్నది. కళింగపట్నం రేవుపట్టణం. వంశధారకు ఆ పేరు ఎలా వచ్చిందో చూడండి. 'వంశ' అంటే వెదురు. ఈ నది వెదురు పొదల గుండా ధారగా ప్రవహించడం వల్ల 'వంశధార' అయింది. ఈ నదీ తీరాన ముఖలింగంలో ముఖలింగేశ్వరుని ఆలయం ఉంది. శివలింగానికి ముఖం ఉండటం ఈ దేవుని ప్రత్యేకత.

మహేంద్రతనయ వంశధారకు ఉపనది. శ్రీకాకుళం సమీపంలో ప్రవహిస్తోంది. ఈ నది ఒరిస్సాలో గజపతి జిల్లాలో పుట్టింది. ఈ నది మహేంద్రుని కూతురని పురాణాలు చెప్తున్నాయి. వంశధార ప్రాజక్టు ఉత్తరాంధ్రకు జలాలను అందిస్తోంది.

**2. నాగావళి :** శ్రీకాకుళం ఈ నదీ తీరాననే ఉంది. బలరాముని నాగలి నుండి ఈ నది పుట్టిందని పురాణాలు చెప్తున్నాయి. తూర్పుకనుమల్లో ఒరిస్సారాష్ట్రంలోని కలహండి జిల్లా లఖబహల్ అనే చోటపుట్టింది. ఈ నదికి లాంగుల్య అని మరోపేరు. ఈ నది పొడవు 256 కి.మీ. ఆంధ్ర ఒరిస్సా రాష్టాల ఉమ్మడినది నాగవళి. ఈ నది ఒరిస్సాలో – కలహండి, రాయగడ, కోరాపుట్ జిల్లాలకు, ఆంధ్రదేశంలో – శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు నీటిని అందిస్తున్నది.

వేగవతి, ఝంఝావతి, బర్వ, బల్‌దియ, సీతాగుహ, ఒట్టిగడ్డ, రెల్లిగడ్డ, వేగవతి – సువర్ణముఖి అనేవి నాగావళికి ఉపనదులు.

సువర్ణముఖి – సాలూరు దగ్గర కొండల్లో పుట్టింది.

వేగవతి – పాచిపెంచ దగ్గర కొండల్లో పుట్టింది.

ఝంఝావతి ప్రాజెక్టు – రాజ్యలక్ష్మీపురం దగ్గర,

ముదవలస రిజర్వాయర్ – వేగవతి మీద ఉన్నాయి.

**3. శారదానది :** విశాఖజిల్లాలో బెల్లంవర్తకానికి ప్రసిద్ధికెక్కిన అనకాపల్లి ఈ నది తీరంలో ఉంది. తూర్పుకనుమలలో పుట్టి 122 కిలోమీటర్లు ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది.

ఈ నదీతీరంలో అనకాపల్లి సమీపంలో సుప్రసిద్ధ – బొజ్జన్నకొండ, లింగం కొండ – కొత్తూరు సమీపంలోని ధ్యానదిబ్బలు (గోకివాడ అరణ్య సమీపంలో) శారదా నదీతీరంలోనే ఉన్నాయి. రావిపాలెం అనే ఊరి దగ్గర పెద్దేరు అనే ఉపనది శారదా నదిలో కలుస్తున్నది. మాడుగుల, రావికమతం మండలాలకు పెద్దేరు ప్రాజెక్టు నీటిని అందజేస్తోంది.

**4. గోస్తనీనది :** ఈ నది తూర్పుకనుమలలో అనంతగిరి కొండలలో పుట్టి తూర్పుదిశగా ప్రవహిస్తోంది. ప్రసిద్ధి చెందిన బుర్రాగుహల నుండి ప్రవహించి, భీమునిపట్నం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నది మీద తాటిపూడి వద్ద నిర్మించిన రిజర్వాయర్ విశాఖ, విజయనగరం జిల్లాలకు మంచినీటిని అందిస్తున్నది. దీని నిడివి 120 కి.మీ.

గోస్తనీ అనే పేరుతో పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఒకనది ఉంది. గోవు పొదుగు నుండి ప్రవించిన పాలే ఈ నదిగా రూపొందాయని స్థానికుల నమ్మకం.

**5. పంపానది :** కావాలి అన్న వరాలన్నీ ఇచ్చే సత్యనారాయణ స్వామి అన్నవరంలో వెలిసి ఉన్నాడు. ఈ అన్నవరం పంపానది తీరాన ఉంది. ఈ మధ్యనే ఈ పంపానది మీద పెద్ద రిజర్వాయరు ఒకటి నిర్మించారు. పంపానది సత్యనారాయణ స్వామితో సంబంధం కలదై అతి పవిత్రమయినదిగా పరిగణిపంబడుతూంది. అన్నవరానికి వచ్చిన భక్తులు ఈ పంపానదిలో స్నానం చేసి స్వామి దర్శనం చేసుకుంటున్నారు. కార్తీకమాసంలో ఈ నదిమీద స్వామి తెప్పోత్సవం చూసితీరాలి. అన్నవరం సమీపంలో తుని దగ్గర తాండవ అనే నది ప్రవహిస్తోంది. ఈ నది విశాఖజిల్లా తూర్పుగోదావరి జిల్లాల సరిహద్దుగా ప్రవహిస్తోంది. తాండవకు ఇటు విశాఖజిల్లా, అటు తూ.గో. జిల్లా.

**6. సువర్ణముఖి :** చిత్తూరు జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరుని ఆలయం ఈ నదీ తీరాన్నే ఉంది. శ్రీకాళహస్తిదగ్గర సువర్ణముఖి ఉత్తరవాహిని. అంటే ఉత్తర దిశగా ప్రవహిస్తోంది. ఇది అతి పవిత్రమయినది. శ్రీకాళహస్తీశ్వరుని దేవాలయ పశ్చిమ ద్వారం తాకుతూ ప్రవహిస్తూ ఉంటుంది. ఆ గుడికి ఈ నదికి సంబంధించిన ఇతిహాసం ఒకటి ఉంది. ఈ నదిలో నీళ్లు నిర్మలంగా, స్వచ్ఛంగా ఉంటాయి. అసలు బురద ఉండేనే ఉండదు. ఇకపోతే ఈ నదికి కాళహస్తి ఆలయానికి సంబంధించిన ఇతివృత్తం ఒకటి ప్రచారంలో ఉంది. పూర్వం శ్రీకాళహస్తీశ్వర దేవాలయ నిర్మాణం ప్రారంభమయింది. ఎందరో పనివాళ్లు వచ్చి పనిచేస్తున్నారు. అయితే వారికి జీతం ఇచ్చే వాళ్లు ఎవ్వరూలేరు. ఎవరి ఇష్టం వచ్చినప్పుడు వాళ్లు రావచ్చు – వాడు చెయ్యగల పని చెయ్యవచ్చు. వాడు పడిన శ్రమకి వాడికి ఫలితం దక్కేలా



చేసేది ఈ సువర్ణముఖి. అంటే జీతాలు ఇచ్చే పని సువర్ణముఖిదన్నమాట. అయితే ఎలా ఇచ్చేది? పని పూర్తయిన తరువాత వాళ్లు వచ్చి సువర్ణముఖి నదిలోకి దిగి తమ దోసిటతో దోసెడు నీళ్ళు తీసేవారు వారు చేసిన పనికి తగ్గ సువర్ణం అంటే బంగారం వాళ్లకు చేతిలో కనిపించేది. అలా సువర్ణాన్ని ఇవ్వబట్టే ఈ నదికి సువర్ణముఖి అనిపేరు. ఈ నది చిత్తూరు జిల్లా ఆదరమ్ అనే కొండలలో పుట్టింది. చిత్తూరు జిల్లా నుండి నెల్లూరు జిల్లాలో ప్రవహించి సాగరసంగమం చేస్తున్నది.

సువర్ణముఖి పేరుతో శ్రీకాకుళం జిల్లాలో ఒక చిన్న నది ఉంది. ఈ నది సాలూరు మండలపు కొండలలో పుట్టింది. ఇది నాగవళికి ఉపనది.

**7. గుండ్ల కమ్మ :** ఈ నది ఒంగోలు జిల్లాలో ఉంది. తూర్పుకనుమల్లో, నల్లమలై కొండల్లో పుట్టింది. కొండలను దాటి మార్కాపురం మీదుగా ప్రవహించి బంగాళాఖాతంలో పడుతున్నది. ఈ నది 19 కి.లోమీటర్లు ఒంగోల్లో ప్రవహిస్తుంది, దీని నిడివి 255 కి.మీ. చందవరం, దూపాడు, చేజర్ల, గంధసిరి, కనుపర్తి వంటి బౌద్ధమతసంబంధి ఊర్లకు ప్రయాణ సౌకర్యం కలిగించింది. నల్లమలై కొండల్లో పుట్టిన నదుల్లో ఇదే పెద్దనది.

నదిమీద –కుమ్‌బమ్ అనేచోట ఆనకట్టు కట్టారు. 15వ శతాబ్దిలో గుండ్లకమ్మ రిజర్వాయిర్ కూడా ఉంది. గోదావరి స్టేషన్‌లాగే నది పేర వెలసిన స్టేషన్లలో గుండ్లకమ్మస్టేషన్ ఒకటి.

**8. పెదవాగు :** ఇది అదిలాబాద్ జిల్లాలో, సిరిపూర్‌గుండా ప్రవహిస్తోంది. గోదావరికి ఉపనది ప్రణహిత. ప్రణహితకు ఈ పెదవాగు ఉపనది. సిరిపూర్‌లో పెద్ద పేపరు మిల్లు ఉంది. అసలు ఈ ఊరికే కాగజ్‌నగర్ అనేపేరు ఉంది. కాగజ్ నగర్ అంటే కాగితం పట్టణం. ఇక్కడ సిల్కు ఫ్యాక్టరీ కూడా ఉంది. ఈ పరిశ్రమలకు అవసరమయిన నీటినంతా ఈ

పెదవాగు ప్రసాదిస్తోంది. చిన్ననది అయినా పెద్దగా ఉపయోగపడుతున్నది.

**9. పసుపులేరు :** ఈ నది మెదక్ జిల్లాలో ఉంది. ఇది మంజీరా నదికి ఉపనది పసుపులేరుకు మరో అయిదు ఉపనదులున్నాయి. మంజీర పసుపులేరు దాని అయిదు ఉపనదులు కలిసే ప్రదేశంలో నాగపానిపల్లె అనే ఊరు ఉంది. ఐదు నదుల దేశాన్ని పంజాబ్ అన్నట్లు దీన్ని 'సప్తాబ్' అనవచ్చు. ఈ నాగసాని పల్లెలో వనదుర్గా భవాని వెలసి ఉంది. ఈ నదుల గూర్చి ఇతిహాసం ఒకటి ఉంది. జనమేజయుడు సర్పయాగం చేసినది ఈ నాగపానిపల్లె లోనేనట. ఆ యుగంలో బూడిద అయిపోయిన పాముల బూడిద ఇక్కడ పోగుపడిందట. ఆ భస్మరాశి మీద ఈ ఏడు నదులు ప్రవహించి ఆ సర్పాలను పుణ్యలోకాలకి పంపాయట. పాయలు పారినా భస్మం ఇంకా ఇక్కడే ఉండిపోయిందట. నేటికీ ఆ ప్రాంతంలో ఎక్కడ తవ్వినా బూడిద తట్టలకొలది వస్తూ ఉంటుందట.

**10. వేణి :** కృష్ణా – గుంటూరు జిల్లాలకు సరిహద్దుగా ఈ నది ప్రవహిస్తోంది. ఆంధ్రుల రాజధానిగా పూర్వం ప్రసిద్ధి పొందిన శ్రీకాకుళానికి దగ్గరగా కొక్కిరి గడ్డ దగ్గర కృష్ణానది రెండు పాయలుగా చీలుతోంది. ఒకటి కృష్ణగా, రెండోది వేణిగా పిలువబడుతున్నాయి. పడమటి కనుమలలో రెండు వాగులు కృష్ణ, వేణి నామాలతో పుట్టి కలిసి కృష్ణవేణి అయినట్లే ఈ నది ఆంధ్ర దేశం సాగరతీరంలో రెండు పాయలుగా చీలి మళ్లీ కృష్ణ, వేణి అనే ఆ నామాల్ని పొందడం స్మరణీయ విషయం. ఈ రెండు ప్రవాహాల మధ్య ప్రదేశం దివిసీమ. కృష్ణానది మీద గల పులిగడ్డ ప్రాజక్టు దివిసీమకు నీటి సరఫరా చేస్తున్నది. ఈ వేణినది నాగాయలంక సమీపంలో ప్రవహిస్తున్నది.

* * *

# VIII నదులు – ఉపయోగములు

నదులతీరంలోనే మానవుడు జీవనం ఆరంభించాడు. పల్లెలు, నగరాలు వెలిసాయి. రాజధానులయ్యాయి. ఈజిప్టు నైలునదీ తీరంలోనే ప్రాచీన నాగరికత పుట్టిందని చెప్తారు. భారతదేశంలో సింధునదీ, సరస్వతీ నదీ తీరాల్లో జనజీవనం ఆరంభమైంది.

నది మానవుని జీవనానికి – పంటలకు జలాన్ని అందిస్తున్నది. మన హిందూదేశం వ్యావసాయక దేశం. వ్యవసాయం సాగాలంటే నీరు పుష్కలంగా కావాలి. నదులు లేనిదే నీరేలేదు. మనదేశం సస్యశ్యామలంగా ఉండడానికి కారణం ఈ నదీజలాలే. పంటలకు నీటిని సరఫరా చెయ్యడమే కాకుండా ఈ నదులు విద్యుత్తును కూడా ఇస్తున్నవి. సహజంగా ఏర్పడిన జలపాతాలు కాకుండా మానవుడు తన మేధస్సుతో డామ్‌లు నిర్మించి జలవిద్యుత్ కేంద్రాలు నిర్మించి విద్యుత్తును పొందుతున్నారు.

ఇకపోతే ఆహారంగా ఉపయోగపడే చేపల పరిశ్రమలు ఈ నదుల పాయలలో నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. మంచినీటి చేపలు ఉప్పునీటి చేపలకంటే విలువయినవి.

నదులు భూమిని సారవంతంగా చేస్తున్నాయి. తమ ప్రవాహంతో ఒండ్రుమట్టిని తెచ్చి పంటలు బాగా పండేలా చేస్తున్నాయి.

నదులు మనకు మంచి ఇసుకను ఇస్తున్నాయి. భవనాలు, ఇళ్లూ మొదలైనవి కట్టడానికి సిమెంటులో ఇసుక కలుపుతారు. సముద్ర తీరాల ఇసుకతో ఇళ్లు కడితే మూడు రోజులకి కూలిపోతాయి. కట్టడాలకు కావలసిన ఇసుక నదులు ఇవ్వవలసినదే.

నదులతో మానవ జీవితం ఎంతగానో ముడిపడి ఉంది.

నదిలోస్నానం – నదీతీరంలో దానం గొప్పఫలితాలను ఇస్తాయని నమ్మిక భారతీయులది. మానవుని ఆరోగ్యానికి నదీ స్నానం ఎంతో

ఉపయోగకారి. ప్రాతఃకాలంలో నదీ జలాలలో విద్యుత్తు ఉంటుంది. ఆ సమయంలో ప్రవాహంగల నీటిలో స్నానం చెయ్యడం వల్ల శరీరానికి మంచి జవసత్వాలు వస్తాయి. నదులు అడవుల గుండా కొండల మీదుగా ప్రవహిస్తూ వస్తాయి. కాబట్టి వీటి నీటిలో రకరకాల ఔషధుల సారం ఉంటుంది. అది కనిపించకుండానే మానవ శరీరానికి ఎంతో మేలు చేస్తుంది.

నదులను మాతృమూర్తులుగా సంభావించి పూజించడం భారతీయుల ఆచారం. 'నదీసూక్తము' వేదంలో నదుల మహత్తును కీర్తిస్తూంది. నదీజలాలలో అమృతం ఉందనీ, నదులలో ఔషధశక్తి ఉందనీ, రోగనిరోధక శక్తిని నదీస్నానం అందిస్తుందనీ వేదాలు ఘోషిస్తున్నాయి.

పర్వతాలమీద, సరస్సులలోనూ పుట్టిన నదులు అడవులగుండా ప్రవహిస్తూవస్తూ అనేకమైన వృక్షాలసారాన్ని, ఆయా మట్టిలోని సారాన్ని సంగ్రహించుకుని రావడంవల్ల అవి ఆరోగ్యాన్ని అందించగల శక్తిని కూడబెట్టుకుంటున్నాయి.

ఒకొక్కనది ఒకొక్క ప్రదేశంగుండా, అడవుల గుండా ప్రవహించి రావడంవల్ల ఒకొక్క ప్రత్యేక లక్షణాన్ని సంగ్రహించుకుటోంది. అందువల్ల ఒకొక్కనదికి వేరువేరు లక్షణాలు సంక్రమించాయి.

'మునిభావబోధిని' అనే గ్రంథం ఏ నదిలో ఏ విధమైన ఔషధశక్తి ఉందో వివరించింది.

**గంగానది** : ప్రజ్ఞను కలగజేస్తుంది. త్రిదోషాలను పోగొడు తుంది. త్రిదోషాలు అంటే వాతం, పిత్తం, కఫం.

**యమునానది** : పిత్తకఫములను పోగొడుతుంది. ఈ నదీజలాలు – రుచి కలిగి మధురమై ఉంటాయి.

**సరస్వతీనది** : ఈ నదీజలాలు ఆరోగ్య ప్రదాయకాలు దేహకాంతిని కలుగజేస్తాయి.



**చంద్రభాగానది** : ఈ నదీ జలం దాహపిత్తాలను అణచివేస్తుంది.

**సింధునది** : జలాలు బుద్ధి వికాసాన్ని కలుగజేస్తాయి.

**పయోష్ణినది** : పయోష్ణినదీ జలాలు – సర్వరోగాలను పోగొడతాయి. బలాన్ని, కాంతిని ఇస్తాయి.

**వితస్తనది** : ఈ నదీజలాలు తాపాన్ని పోగొట్టడంతో పాటు పుష్టిని కలుగజేస్తాయి.

**సరయూనది** : ఈ నదిలో నీళ్లు తియ్యగా ఉంటాయి. వీటిని త్రాగడం వల్ల శరీరానికి బలం చేకూరుతుంది.

**గోదావరీనది** : ఈ నదీజలాలు పైత్యాన్ని రక్తపీడనల్ని, కుష్ఠు దురదల్ని పోగొడుతుంది. శరీరానికి శక్తిని ఇస్తుంది.

**కృష్ణానది** : ఈ నదినీళ్లు పైత్యరోగాన్ని పోగొడతాయి.

**తుంగభద్రానది** : ఈ నదిలో నీళ్లు నిర్మలంగా ఉండి ఆకలిని తీరుస్తాయి.

**కావేరీనది** : ఈ నదీజలాలు – శ్రమను పోగొడతాయి. కుష్ఠురోగాన్ని తగ్గిస్తాయి.

ఇలా వివిధ నదులు వివిధరీతిల్లో మానవులకు ఆరోగ్యాన్ని కూర్చే ఔషధాలను అందిస్తున్నాయి.

* * *

# IX నదులు - పూజలు

జలం పంచభూతాలలో ఒకటి. పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము పంచభూతాలు. పంచభూతాల్ని మనం భక్తితో ఆరాధిస్తాం. ఆ దిశలో జలాన్ని కూడా పూజిస్తాము. జలాన్ని పూజించడం అంటే నదినిపూజించడమే.

నదులన్నీ స్త్రీస్వరూపాలనీ - సముద్రుడు పురుషుడనీ - నదులన్నీ తమ ప్రవాహమనే జీవితంలో ఎన్నెన్నో మలుపులు తిరిగి సముద్రాన్ని చేరుకుంటాయని భారతీయుల భావన. 'నదీనాం సాగరోగతిః' నదుల కన్నింటికీ సాగరుడే గతి - పతి కూడా. నదులజీవితానికి సముద్రంలో కలవడమే - పరమావధి. మానవ జీవితానికి కూడా భగవంతునితో ఐక్యంకావడమే మోక్షమని - నదులు మనకు భంగ్యంతరంగా సూచిస్తున్నాయి.

నదులను తల్లులుగా భావించి గంగామయ్యా! (గంగామాత) అంటూ సంబోధించి పూజించడం అనాదిగా ఉన్నదే. వరదలతో తమను ఇబ్బంది పెట్టవద్దనీ, తమకు సుఖశాంతులను కలుగజేయుమనీ, సత్‌సంతానాన్ని ప్రసాదించమని స్తుతిచేస్తున్నారు మానవులు.

రామాయణంలో - అయోధ్యకాండలో సీతాదేవి గంగను దాటి అరణ్యవాసానికి వెళ్లేసందర్భంలో తాము వనవాసం సలక్షణంగా పూర్తిచేసి వస్తే గంగానదికి, ఇచ్చినట్లు భావించి లక్షగోవుల్ని బ్రహ్మణులకు దానం చేస్తాననీ - అన్నదానం చేస్తానని మొక్కుకుంది. అలాగే మొక్కుతీర్చుకుంది.

నదులను పూజించడం మనకు అనాదిగా వస్తున్న ఆచారం. పూలతో, పసుపు కుంకుమలతో, నూతన వస్త్రాలతో, ఫలాలతో పూజించడమేకాకుండా డబ్బు బంగారము కూడా నదీమతల్లికి అర్పిస్తూ ఉంటాము. ఇప్పటికీ గోదావరి, కృష్ణా, తుంగభద్ర వంతెనల మీదుగా రైలువెళుతూఉంటే ప్రయాణీకులు నాణాలు వేసి నమస్కరిస్తూ ఉంటారు.



నదీ స్నానానికి వెళ్ళిన పుణ్యస్త్రీలు పసుపు కొంచెం, నదిలో వేసి గోరంత పసుపుతీసుకుని, కొండంత పసుపు నిమ్మని నదీమతల్లిని వేడుకుంటారు.

కార్తీక, మాఘ మాసాలలో తెల్లవారు ఝామున నదిలో స్నానం చేసి ఆవునేతి దీపాలు వెలిగించి, అరటి దొప్పల మీద పెట్టి నదిలో వదులుతారు. నదులంటే మనవారికి అంత భక్తి. పసుపు కుంకాలతో, పూలతో, దీపాలతో నిండిన నదిని చూస్తూ ఉంటే కన్నుల పండుగగా ఉంటుంది.

ఇవికాక పన్నెండేళ్ళకొకసారి ప్రసిద్ధనదులకు పుష్కరాలు వస్తాయి. అసలు పుష్కరము అంటే పండ్రెండు సంవత్సరాలని అర్థం. ఈ పుష్కరాలు పన్నెండేళ్ళకొకసారి పన్నెండు రోజులు జరుగుతాయి. సమస్త దేవతలూ కూడా ఏ నదికి పుష్కరాలయితే ఆ నదిని పూజింపవస్తారట. ఈ నాళ్ళలో నదులను పూజిస్తే పుణ్యప్రదమని చెప్తారు. పుష్కర దినాలలో ఏ దానం చేసినా రెట్టింపు ఫలం.

గోదావరీ పుష్కరాలు రాజమండ్రిలోనూ, కృష్ణాపుష్కరాలు విజయవాడ లోనూ భారీ ఎత్తున జరపడం మనకు తెలుసు.

కొన్ని తిథులలో కొన్ని నదుల పూజచేసే ఆచారం కూడా హిందువులకు ఉంది. దశపాపహరదశమి, గంగా సప్తమి అట్టివే.

**దశపాపహర దశమి :** ఇది జ్యేష్ఠశుద్ధ దశమినాడు వస్తుంది. ఈ దశమినాడు గంగానదికి పండితరాయలకు కలిపిపూజచేస్తారు. గంగానదిని గురించి చెప్పుకున్నప్పుడు మనం పండితరాయలు 'గంగాలహరి' అనే కావ్యం చెప్పాడని చెప్పుకున్నాము. ఈ పూజకి, ఆ కావ్యానికి గల సంబంధం ఏమిటో తెలుసుకుందాము.

పండితరాయలు గొప్పకవి. అతడు ఆ కాలంలో ఢిల్లీ నవాబుని తన కవితతో మెప్పించాడు. ఢిల్లీ నవాబు ఏంకావాలో కోరుకోమన్నాడు. వెంటనే

పండిత రాయలు 'మీకుమార్తె లవంగిని ఇచ్చి వివాహం చెయ్యండి' అన్నాడు. ఆడిన మాట ప్రకారం నవాబు తన కూతురిని ఇచ్చి వివాహం జరిపించాడు. అయితే తక్కిన వారికెవరికీ ఈ సంగతి నచ్చలేదు. శుద్ధబ్రాహ్మణుడు మహమ్మదీయ కన్యను వివాహమాడటమేమిటని అతణ్ణి వెలివేశారు.

దాంతో పండితరాయలకు కోపం వచ్చింది. తన భార్యను తీసుకుని గంగానది ఒడ్డుకి వచ్చాడు. గంగకు ఎదురుగా నిలబడ్డాడు. ఓ గంగా నేను చేసిన పని నీచమయినదే అయితే నవ్వు నన్ను క్షమించవద్దు. కాని నేను చేసిన పని మంచిపని అని నీకు తోచినట్లయితే గంగాదేవీ! మమ్మల్ని నీలో చేర్చుకోవలసింది అంటూ గంగానదిని స్తుతిస్తూ శ్లోకాలు చెప్పడం ప్రారంభించాడు. ఒక్కొక్క శ్లోకం పూర్తయ్యేసరికి గంగానది ఒక్కొక్క మెట్టే పైకి రావడం మొదలుపెట్టింది. పండితరాయలు భక్తి పారవశ్యంతో నలభై శ్లోకాలు చెప్పాడు. గంగానది నలభై మెట్లు ఎక్కివచ్చి పండితరాయలను సతీసమేతంగా తనలో చేర్చుకుంది. వెలివేసిన పెద్దలందరూ తెల్లబోయారు. పండితరాయలు చేసినది తప్పే అయితే గంగ ఒక్క అడుగు ముందుకు వేసేదా? కులాంతర మతాంతర వివాహం నేరం కాదని గంగకూడా ఒప్పుకుందన్న మాటేగా.

ఆనాడు పండితరాయలు చెప్పిన శ్లోకాలే 'గంగాలహరి'. పండితరాయలు గంగానదీ జలాలలో చేరిన రోజే దశమి. అదే దశపాపహరదశమి. నేటికీ ఉత్తర భారతదేశంలో ఈ దశమినాడు, పండితరాయలను శ్రద్ధతో పూజిస్తారు. గంగాలహరిలో ఒకశ్లోకం

**విభూషితానఙ్గరిపూత్తమాంగా**
**సద్య; కృతానేక జనార్తిభంగా।**
**మనోహరోత్తుంగ చలత్తరంగా గంగా**
**మమాంగాన్యమలీ కరోతు॥**



శివుని ఉత్తమాంగాన్ని శృంగారించేది తలచినంతలో అనేక జనుల దుఃఖాలను తొలగించేది, ఆనందాన్ని కలగజేసే ఉత్తుంగ తరంగాలు కలది అయిన గంగానది మా అంగములను పవిత్రము చేయుగాక!

**గంగా సప్తమి :** వైశాఖ శుద్ధసప్తమి గంగాసప్తమి. ప్రతి ఏటా ఈ రోజున గంగానది నర్మదానదిలో స్నానానికి వస్తుందట. అందుకే ఇది గంగా సప్తమి అయింది.

ఏడాది పొడుగునా ప్రజల పాపాలన్నీ తనలో కలపడం వల్ల గంగ కలుషితమైపోతుంది. ఆ మలినంతో నల్లని ఆవుగా మారి నర్మదానదిలో స్నానానికి వస్తుంది. నర్మదా నదిలో స్నానం చేసి బయటకు వచ్చేసరికి తన మలినమంతా పోగా తెల్లనిగోవుగా మారిపోతుంది. అంటే గంగాదేవి పాపాలన్నీ కడిగివేయబడ్డాయన్నమాట. గంగాదేవి పాపాలు కూడా పోగొట్టేటంత మహత్తుగలది నర్మదానది. నర్మదను చూస్తేనే పాపాలు పోతాయి. ఇక స్నానం అందునా ఈ గంగాసప్తమినాడు నర్మదకు పూజ చెయ్యడం అతిపుణ్యమన్న మాట. నర్మదానదీ స్నానానికి ఈ రోజున ప్రత్యేకించి వేలాది ప్రజలు వస్తారట.

ఆది శంకరాచార్యులు నర్మదా నది విశిష్టతను గుర్తించి 'నర్మదాష్ట'కాన్ని రచించారు.

**గంగాహారతి :** హరిద్వార్‌లోను, వారణాసిలోనూ ప్రతీరోజూ సాయం సంధ్యలో గంగా హారతిని నిర్వర్తిస్తారు. ఆ హారతిని చూడడానికి భక్తులు గంగ ఒడ్డున శ్రద్ధతో కూర్చుని వేచి ఉంటారు.

కన్నులపండుగగా గంగాహారతిని చూడగలగడం ఒక అదృష్టం.

గంగాలహరి, నర్మదాష్టకం యమునాష్టకం. నదులు కారణంగా పుట్టిన రచనలు.

## పుష్కరాలు - కుంభమేళాలు

ఒకొక్కనదికి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి పుణ్యకాలంవస్తుంది. వాటిని దక్షిణభారతదేశంలో పుష్కరాలనీ, ఉత్తరభారతదేశంలో కుంభమేళా అనీ వ్యవహరిస్తారు.

**జన్మప్రభృతి యత్పాపం, స్త్రియా వా పురుషేణవా!**
**పుష్కరే స్నానమాత్రేణ, సర్వమేవ ప్రణశ్యతి!!**

పుట్టినప్పటి నుండి తెలిసోతెలియకో చేసిన పాపాలన్నీ స్త్రీలకైనా, పురుషులకైనా – పుష్కర సమయంలో స్నానం చేస్తే ఆ పాపాలన్నీ నశించి పోతాయని మహాభారతం చెప్తోంది.

## నదులు - రాశులు - పుష్కరాలు

మనకు రాశులు పన్నెండు. ఈ రాశులలో గురుసంచారంవల్ల పుష్కరాలు ఏర్పడతాయి.

పుష్కరాలు వచ్చే నదులు పన్నెండు. గురుడు ఏ రాశిలో ఉంటే ఏ నదికి పుష్కరమో చూద్దాం.

| | | |
|---|---|---|
| 1. గంగానది | – | మేషరాశి |
| 2. నర్మదానది | – | వృషభరాశి |
| 3. సరస్వతీనది | – | మిథునరాశి |
| 4. యమునానది | – | కర్కాటకరాశి |
| 5. గోదావరి | – | సింహరాశి |
| 6. కృష్ణానది | – | కన్యారాశి |
| 7. కావేరీనది | – | తులారాశి |
| 8. భీమరథి | – | వృశ్చికరాశి |
| 9. బ్రహ్మపుత్రానది | – | ధనురాశి |
| 10. తుంగభద్రానది | – | మకరరాశి |
| 11. సింధునది | – | కుంభరాశి |
| 12. ప్రాణహిత / ప్రణహితనది | – | మీనరాశి |



భారతదేశంలోని పన్నెండు ప్రసిద్ధనదులలో గురుడు – (ఇతడినే బృహస్పతి అనికూడా అంటారు) ఒక రాశినుండి మరొక రాశికి మారినప్పుడు – పుష్కరుడు అనే పవిత్రపురుషునితో కలిసి గురుడు – ఒకొక్క నదిలో ప్రవేశిస్తాడు.

అసలు – నీటికి బృహస్పతికి గల సంబంధం ఏమంటే.

బృహస్పతి దేవతలందరికి గురువు. అందుకే అతనికి గురుడు అని పేరువచ్చింది. ఇతడి తాతపేరు ముచ్యుడు. ఈ ముచ్యుడు జలాధిపతి అయిన వరుణుని కొడుకు. ఒకసారి ఈ ముచ్యుని శరీరం నుండి అనేక రసాలు స్రవించాయి. ఆ రసం నుండి ఒక బాలుడు పుట్టాడు. అతడే అంగిరసుడు. అంగములనుండి స్రవించిన రసాలనుండి పుట్టడం వల్ల ఇతడు అంగిరసుడయ్యాడు. ఈ అంగిరసుని కుమారుడే బృహస్పతి.

ఋగ్వేదంలో – బృహస్పతి – జనోపకారి, బలవంతుడు – వర్ష ప్రదాయకుడుగా కీర్తించబడ్డాడు. జ్యోతిషశాస్త్రం గురుగ్రహాన్ని సకల శుభాలు కలిగించే గ్రహంగా కొనియాడింది.

ఇంతగా ప్రసిద్ధుడైన గురుడు, పుష్కరునితో కలిసి 12 నదుల్లో ప్రవేశిస్తూ ఉంటాడు.

ఈ పుష్కరునికి సంబంధించిన పురాణ గాథ ఒకటి వినదగింది.

పూర్వం తుందిలుడు అనే బ్రాహ్మణుడు మానవకల్యాణం కోసం పరమశివుణ్ణి గురించి మహాతపస్సు చేసినాడు. శివుడు మెచ్చి ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. ఆ బ్రాహ్మణుడు మరేమీ కోరకుండా శివునిలో తనను లీనం చేసుకొమ్మన్నాడు. శివుడు అతన్ని తన అష్టమూర్తులలో ఒకటైన జలమూర్తిలో లీనం చేసుకుంటూ ఆ బ్రాహ్మణునిడికి పుష్కరుడని పేరు

పెట్టినాడు. అంతేగాక విశ్వంలోని మూడున్నర కోటి తీర్థాలకు రాజును చేసినాడు. భూతత్వాన్ని కమండలంగా చేసి పుష్కరుని అందులో ఉంచి బ్రహ్మదేవుని కిచ్చినాడు. ఆ కమండల జలమే పుష్కర తీర్థంగా మారింది.

ఒకనాడు దేవగురువైన బృహస్పతికి ఒక కోరిక కలిగింది. మూడున్నర కోటి పుణ్యతీర్థాల రాజు ఎ క్కడో ఒక మూల తీర్థంలో ఉండి, కొందరిని మాత్రమే తరింపజేస్తున్నాడు. ఆయన అనుగ్రహం జనులందరూ పొందితే బాగుంటుంది అనుకున్నాడు. పుష్కరుని దగ్గరకు పోయి 'ఓ తీర్థరాజ భారతదేశంలోని ప్రజలందరూ నీ అనుగ్రహంతో ముక్తి పొందవలెనని ప్రార్థిస్తున్నాను. నేను గ్రహరూపంలో మేషం నుండి మీనం వరకూ 12 రాసులలోను ఒక్కొక్క సంవత్సరం ఉంటాను. నేనొక రాశిలో ప్రవేశించినపుడు నా కిరణాలు ప్రసరించే ఒక జీవనదిలో నీవు నాతో ఉండి జనులను ఉద్ధరించు' అన్నాడు. పుష్కరుడు అంగీకరించలేదు. బ్రహ్మదేవుని జోక్యంతో అంగీకరించినాడు. అప్పటి నుంచి బృహస్పతి ప్రవేశించిన రాశికి సన్నిహితమైన ప్రాంతంలోని ఒక జీవనదిలో ఆ సంవత్సరమంతా పుష్కరుడు సర్వతీర్థాలలో సకల దేవతలతో, సిద్ధులతో, పితృదేవతలతో నివసిస్తాడు. అందులో స్నానాదులు చేసిన వాళ్ళను అనుగ్రహిస్తాడు.

మామూలు నాళ్లలో కంటే ఈ పుష్కరసమయంలో స్నానఫలం అధికం అవుతుంది.

ఈ పన్నెండు రోజులూ చేయవలసిన దానాలుకూడా మన పెద్దలు నిర్ణయించి పెట్టారు.

| | |
|---|---|
| మొదటి రోజు | – బంగారము, భూమి, ధాన్యము |
| రెండో రోజు | – గోవులు, ఉప్పు, వస్త్రాలు |
| మూడోరోజు | – గోవులు, బెల్లం, పళ్లు |
| నాల్గోరోజు | – పాలు, పెరుగు, నేయి |
| అయిదోరోజు | – ధాన్యము, ఎద్దులు, నాగలి |
| ఆరోరోజు | – చందనము, ఔషధాలు, |
| ఏడోరోజు | – గృహము, మంచము |
| ఎనిమిదోరోజు | – పువ్వులు, కూరగాయలు |
| తొమ్మిదోరోజు | – కన్యాదానం చేయాలి |
| పదోరోజు | – రాగి పాత్రలు, ముత్యాలు |
| పదకొండోరోజు | – పుస్తకము, జందెము |
| పన్నెండోరోజు | – నువ్వులుదానం చేయాలి |



గంగ, త్రివేణీ సంగమమే భారతీయులకు పవిత్రస్నాన ఘట్టం. అందునా పుష్కరాలసమయంలో మరింత పవిత్ర మైనవని మన ప్రగాఢ విశ్వాసం. అట్లాంటి సందర్భంలో ఒక సంఘటన జరిగింది. అది తప్పక తెలుసుకోదగినది.

1924లో గంగా పుష్కరాలు వచ్చాయి. అప్పుడు భారతదేశం బ్రిటిష్‌పాలనలో ఉంది. ఆ ప్రభుత్వం త్రివేణి సంగమంలో ఈ పుష్కరాల సందర్భంలో స్నానం చేయరాదని నిషేధించింది.

లక్షలాది జనులు గంగలో స్నానం చేయడానికి వచ్చి వేచి ఉన్నారు. మదనమోహన మాలవ్యా స్నానానికి అంగీకరించమని సత్యాగ్రహం ఆరంభించాడు. అప్పుడు అలహాబాద్ నగరానికి ఛైర్‌మెన్ జవహర్‌లాల్ నెహ్రూ. ఆయన కూడా గంగాతీరానికి వచ్చాడు. అపహార్ణం తిరిగింది. మిట్టమధ్యాహ్నం దాటింది. జనులెవ్వరు నిషేధాజ్ఞను అధిగమించి స్నానానికి ముందుకు రాలేదు. ఇంతలో మెరుపులా ఒకదేశభక్తుడు ప్రభుత్వ శాసనాన్ని ధిక్కరించాలనే అభిప్రాయం గలవాడు నెహ్రూజెండా చేతబట్టి అడ్డంగా

కట్టిన తడకను దాటి గంగలోకి ఒక్క దుముకు దుమికి మూడు మునకలు వేసి బయటకు వచ్చాడు విజయోత్సాహంతో. వెంటనే మాళవ్యా మహాశయుడు కూడా గంగలోకి దిగిస్నానం ప్రారంభించాడు. ఒడ్డుతెగిన గంగలా జనం బిలబిల గంగలోకి దిగి పవిత్రస్నానం తృప్తిగాచేసి పుణ్యం ఆర్జించారు. జవహర్‌లాల్ నెహ్రూ వెంటనే పురపాలక సంఘఅధ్యక్ష పదవి విడిచిపెట్టాడు. నదులమీద, నదీస్నానం మీద పుష్కరాల మీద భారతీయులకు గల పరమభక్తికి ఈ సంఘటన ప్రబలమైన ఉదాహరణ. (మా నాన్నగారు ఆంధ్ర శేషగిరిరావు గారు 1938లో వారి ఆంధ్రభూమి నవంబరు మాసపత్రికలో జవహర్‌లాల్ నెహ్రూ (నవ్యభారతభాగ్యవిధాత) అనే శీర్షికలో వ్రాసినవ్యాసంలోని విషయం ఇది.)

**కుంభమేళా**

పుష్కరాలు పన్నెండు నదులకు వస్తాయి కదా!

కుంభమేళాలు నాలుగు నదులవిషయంలోనే జరుగుతాయి. అయితే ఈ కుంభమేళా కూడా పుష్కరాల్లోలాగే బృహస్పతి (గురుడు) సంచారాన్ని బట్టే ఏర్పడతాయి.

**1. గంగానది ద్వారంలో –** హరిద్వార్‌లో కుంభమేళా బృహస్పతి కుంభరాశిలో ఉండి సూర్యుడుమేషరాశిలో ఉన్న సమయంలో జరుగుతుంది.

**2. త్రివేణీసంగమం –** ప్రయాగలో కుంభమేళా బృహస్పతి మేషరాశిలో ఉండి సూర్యచంద్రులు మకరరాశిలో ఉన్న సమయంలో వస్తుంది.

**3. నర్మదానదికి –** ఉజ్జయినీలో – బృహస్పతి, సింహరాశిలో ఉన్నప్పుడు, సూర్యుడు మేషరాశిలో ఉన్నవేళ – కుంభమేళా జరుపుతారు.

**4. గోదావరినదికి –** నాసికాత్రయంబకం వద్ద బృహస్పతి, సూర్యుడూ ఇద్దరూ సింహరాశిలో ఉన్నప్పుడు ఈ కుంభమేళా నిర్వహిస్తారు.



ఈ 'కుంభమేళా' అనే పేరు రావడానికి గలకారణం స్కాందపురాణం వివరిస్తోంది.

పూర్వం అమృతం కోసమని దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని చిలకడం ఆరంభించారు. అప్పుడు మందర పర్వతాన్ని కవ్వంగాచేసి, వాసుకి అనే పాముని తాడుగాచేసి, తోకవైపుగా దేవతలు, తలవైపున రాక్షసులు పట్టుకుని చిలికారు.

చిలకగా చిలకగా ముందు హాలాహలం, ఆ తరువాత ఐరావతం, ఉచ్ఛైశ్రవం, అప్సరసలు, లక్ష్మీదేవి పుట్టారు. చివరగా అమృత కుంభం పుట్టింది. ఆ అమృతకుంభం కోసం దేవతలు దానవులు పెద్దగా పెనుగులాడారు. ఆ పెనుగులాటలో – అమృతకుంభం జారి భూమిమీద పడింది. ఆ పడడంలో నాలుగు ముక్కలై నాలుగు చోట్ల పడింది. అవి హరిద్వార్, ప్రయాగ, ఉజ్జయనీ, నాసికాత్రయంబకం.

**'వివాదేకాశ్యపేయానాం యత్రయత్రావనీ స్థలే**
**కలశేన్యపతత్తత్ర ఆకుంభపర్వదోచ్యతే'॥**

ఎక్కెడెక్కడ ఈ అమృత కుంభం పడిందో అక్కడక్కడ ఈ కుంభపర్వం – కుంభమేళా ఏర్పడింది.

ఈ నాలుగు కుంభమేళాలలో స్నానంవల్ల విశేషమయిన ఫలితాలు లభిస్తాయని పురాణాలు పేర్కొన్నాయి.

**యమునాపూజా**

భారతీయులు ఆచరించే వ్రతాలలో అనంత వ్రతమని ఒక వ్రతం ఉంది. ఇది భాద్రపదశుద్ధ చతుర్దశిరోజున చేస్తారు. ఈ వ్రత పూజావిధానంలో యమునాపూజ అని ప్రత్యేకంగా ఒక అంశం ఉంది. ఒకబిందె నిండుగా నీళ్లు పెట్టి దానిలో మామిడి రెమ్మలు వేసి యమునా నదిని ఆవాహనచేసి పూజిస్తారు.

అయితే ఈ యమునాపూజలో యమునతోపాటుగా – తుంగభద్ర, కృష్ణవేణి, భీమరథి, గోదావరి నదులు, అంగపూజలో గోదావరి, భవనాశిని, తుంగభద్ర, భాగీరథి, యమున, గంగాదినదులు ప్రస్తావనకురావడం నదులన్నీ పూజనీయమైనవనీ, గంగా స్వరూపాలనీ స్పష్టం చేయడానికే.

**పూజావిధానం :**

మయా కరిష్యమాణా అనంతవ్రతపూజాంగ యమునాపూజాం కరిష్యే॥

క్షీరోదార్ణవసంభూతే ఇంద్రనీలసమప్రభే।

ధ్యానం కరోమి యమునే విష్ణురూపిణి తే నమః॥
యమునాయై నమః–ధ్యాయామి॥
యమునేతే నమస్తుభ్యం సర్వకామప్రదాయిని॥

.................................................................

సర్వపాపప్రశమని తుంగభద్రే నమోస్తుతే।

.................................................................

కృష్ణవేణి నమస్తుభ్యం కృష్ణవేణి సులక్షణే।

.................................................................

సర్వలోకహితే తుభ్యం భీమరథ్యై నమోస్తుతే।

.................................................................

కృష్ణపాదసముద్భూతే గంగే త్రిపథగామిని।

.................................................................

సర్వలక్షణసంయుక్తే భవనాశిని తేనమః।

.................................................................

గోదావరి నమస్తుభ్యం సర్వాభీష్టప్రదాయిని ।
స్వీకరుష్వ జగద్వంద్యే అక్షతా నమలాన్ శుభాన్।
అక్షతాన్ సమర్పయామి॥



మందారైః పారిజాతైశ్చ పాటలాశోకచంపకైః ।
పూజయామి తవ ప్రీత్యై వరదేభక్త వత్సలే॥

**పుష్పైః పూజయామి.** అథాంగపూజాః

.................................................................

గోదావర్యై నమః – స్తనౌ పూజయామి।

.................................................................

భవనాశిన్యై నమః – కంఠం పూజయామి

.................................................................

తుంగభద్రాయై నమః – ముఖం పూజయామి

.................................................................

భాగీరథ్యైనమః – శిరః పూజయామి

.................................................................

యమునాయైనమః – సర్వాణ్యంగాని పూజయామి

## నదులు కాలుష్యము

ఇంతటి పవిత్రమైన, జనోపయోగకారకములయిన ఈ నదులకు నేటికాలంలో పెద్ద ఆపద వాటిల్లింది.

మానవుల పాపాలనేకాక – గంగానది పాపాన్ని కూడా క్షాళనచేసింది నర్మదానది అనేవిషయాన్ని తెలుసుకున్నాము.

ఔషధ భరితములై అమృతోపమానములైన ఈ జలాలను నేటి నాగరిక ప్రపంచం – యంత్రాగారాలు స్థాపించి – వాటి అభివృద్ధితో మానవ జీవితాన్ని సుఖమయం చేసుకుంటున్నారు. అంతవరకు బాగానే ఉంది. కాని ఆ యా ఫ్యాక్టరీలలోవాడే రసాయనాలు, మురుగు పదార్థాలను నదులలోకి వదిలివేయడం ఆరంభించారు. దాంతో నదీజలాలన్నీ కలుషితమై పోతున్నాయి.

ఎంతో ఔషధ శక్తి కలిగిన గంగానది కూడా ఈ కాలుష్యపు బారినిపడింది. హైదరాబాదులో మూసీనది 'ముక్కుమూసి నడవండంటుంది' అనేపేరు పొందింది. మానవులు అంతగా ఆ నీటిని పాడుచేసారు.

రాజమండ్రి వద్ద గోదావరిలో పేపర్‌మిల్లులోని అనేక కలుషిత రసాయనాలను వదలడం వల్ల ఎంతగానో పాడైనట్లు శాస్త్రజ్ఞులమాట. ఫ్యాక్టరీలే కాదు ప్రజలు కూడా చెత్తనంతా నదుల్లో పోసేస్తున్నారు. ఎంతో ఉపకారం చేస్తున్న నదీ జలాలను ఇలా పాడుచేసుకోవడం మనకు మనం ద్రోహం చేసుకోవడమే.

శాస్త్రవేత్తలు – ఈ కాలుష్యనివారణ చర్యలు తీవ్రంగానే చేపట్టారు. రకరకాల ప్రాజక్టుల వల్ల కాలుష్యపు బారినపడిన నదీజాలల పరిశుభ్రత కోసం రాత్రింబవళ్లు కృషిచేస్తున్నారు. గంగా ప్రక్షాళన ప్రాజెక్టును భారత ప్రభుత్వం పెద్దఎత్తున చేపట్టింది.

యంత్రాగారాలనుండి వచ్చే వ్యర్థపదార్థాలను మురుగు నీటిని ముందర శుద్ధిచేసి తరువాత ఆ నీటిని నదులలోకి పంపే ఏర్పాటు చేస్తోంది. జలకాలుష్య నియంత్రణ మండలి దీని కోసమే ఏర్పడింది.

భగవత్స్వరూపాలు, ప్రాణాధారాలు అయిన ఈ నదీమతల్లు లను పూజించడం అంటే వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవడమే.

ప్రతి భారత పౌరుడు ఈ విషయంలో బాధ్యత వహించి నదీజలాలను పుణ్యజలాలుగా ఉంచుదురు గాక!

* * *



# X నదులు - దేశసమైక్యత

దేశ ప్రజలలో సమైక్యభావం పెంపొందించడానికి ఈ నదులను ముఖ్యంగా చెప్పవలసి ఉంది.

ఏ నదిలో స్నానం చేస్తున్నా, చివరకు నూతిగట్టున స్నానం చేస్తున్నా మనవాళ్లు అన్ని నదుల జలాలు తమ సన్నిధిని ఉండాలనుకుంటారు. కలశపూజ చేసి ఆ కలశంలోకి ఈ నదుల జలాలన్నీ రావాలని ప్రార్థిస్తారు.

**"గంగేచ యమునే చైవ**
**గోదావరీ సరస్వతీ**
**నర్మదే సింధు కావేరీ**
**జలేస్మిన్ సన్నిధింకురు"**

ఎక్కడి గంగ ఎక్కడి కావేరి ఆ చివరి నుండి ఈ చివరకు గల నదుల జలాలన్నీ తమ సన్నిధిని ఉండాలని కోరుకుంటున్నారు.

ఈ నదులు ఏదో ఒక్క రాష్ట్రంలో మాత్రమే ప్రవహించక ఎక్కడో పుట్టి రెండు మూడు రాష్ట్రాలలో ప్రవహిస్తూ – ఆ తీర ప్రజలందరూ తాము ఆ నదీతీరవాసులమే అనుకునేలా చేస్తున్నాయి.

భారతీయులందరూ ఈ నదులను పూజించడంలో నదీ స్నానాలు చేయడంలో ఒకే భావన కలిగి ఉన్నారు.

భారతదేశంలోని పన్నెండు నదులకు గురు సంచారాన్ని బట్టి పన్నెండు పుష్కరాలు పెట్టి దేశ సమైక్యత పెంపొందించే ఆచారాన్ని ఏర్పాటు చేశారు మన పెద్దలు.

ఈ పుష్కరాలు సాంఘిక జీవనతత్వాన్ని, దేశసమైక్యతను పరిరక్షించుకోవడమేకాదు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెప్పి – దేశసమగ్రతను పదికాలాలు పదిలంగా ఉంచుకోవడానికి నదులు ఇలా పరోక్షంగా దోహద పడుతున్నాయి.

గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుండి జనం రాజమండ్రికి వస్తున్న సంగతి మనం చూస్తున్నదే కదా. గోదావరి మన ఒక్కరిదే కాదు. ప్రతి నదిని గురించి ఈ నది భారతీయులది అనే భావన అందరిలో ఉంది.

గంగానదిలో స్నానానికి, త్రివేణి సంగమంలో స్నానానికి దేశం నలుమూలల నుండి లక్షలాది జనులు రావడం మనం వింటున్నదే.

భారతీయులను సమైక్య భావనతో నడిపించే వాటిలో నదీమతల్లులను ముందు చెప్పాలి.

మానవతను గౌరవించి, ఐక్యతను వర్ధింపచేసి, వికాసమార్గానికి దోహదం చేసే పర్వాలు నదీమాతలు కలగజేస్తున్నాయి.

భారతీయ సంస్కృతిలోని మాతా పిత్రు ఋషి ఋణాలను తీర్చుకోవడానికి, నదీస్నానంతో శారీరకంగా శుద్ధులై, శ్రాద్ధక్రియలు చేసి మానసికంగా పరిశుద్ధులు కావడమే గాక పరితృప్తులను చేస్తూ – ఐక్యతా భావతరంగాలను మన అంతరంగాల్లో నిలిపేవి – నదులే.

* * *

# XI నదులు - ప్రాజెక్టులు

ఆ యా నదులను గురించి చెప్పుకునేటప్పుడు ఈ ప్రాజెక్టులను గురించి కూడా చెప్పుకున్నాం. మళ్ళీ ఒకసారి అన్నిటిని ఇక్కడ క్రోడీకరించుకుందాం.

1. జాయక్వాడి ప్రాజెక్టు – గోదావరి మీద పైఠాన్ వద్ద, ధవళేశ్వరం వద్ద కాటన్ దొరకట్టిన బ్యారేజీ.
2. ఇచ్చంపల్లి ప్రాజెక్టు – మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఆంధ్రప్రదేశ్‌ల ఉమ్మడి ప్రాజెక్టు
3. నాగార్జునసాగర్ ప్రాజెక్టు– కృష్ణానది మీద, నందికొండ గ్రామం వద్ద ప్రకాశం బ్యారేజీ – విజయవాడ
4. తుంగభద్రా ప్రాజెక్టు – మల్లాపురము / హొసపేటకు దగ్గర
5. గండక్ ప్రాజెక్టు – గండకీనది మీద, బీహార్‌లోని వాల్మీకి నగర్‌వద్ద.
6. కృష్ణ సాగర్ డ్యామ్ – కావేరీ నదిపైన కన్నంబాడి అనేచోట మెట్టూర్ డ్యామ్ – మద్రాస్ రాష్ట్రంలో
7. కూసీ ప్రాజెక్టు – కూసీనది మీద, నేపాల్‌లోని హనుమాన్ నగర్ వద్ద
8. కక్రపర ప్రాజెక్టు – తపతీనది మీద–కక్రపర గ్రామం వద్ద
9. ఉకాయ్ ప్రాజెక్టు – తపతీనది మీద – ఉకైవద్ద
10. పెరియార్‌వాలీ ప్రాజెక్టు– పెరియార్‌నది మీద ఎర్నాకులం జిల్లాలో
11. తప ప్రాజెక్టు – తప నర్మదకు ఉపనది, మధ్యప్రదేశ్‌లో హొషంగాబాద్ జిల్లా వద్ద

12. చంబల్ ప్రాజెక్టు - గాంధీసాగర్ డామ్, రాణాప్రతాప్‌డామ్ అనే రెండు డామ్‌లు.

13. హీరాకుడ్ ప్రాజెక్టు - మహానది మీద, ఒరిస్సాలో

14. మలప్రభ ప్రాజెక్టు - కృష్ణకు ఉపనది మలప్రభ, బెల్గాం జిల్లాలో

15. భాక్రానంగల్ ప్రాజెక్టు - సట్లేజ్‌నది మీద, భక్ర, నంగల్ అనే ఊళ్ళ దగ్గర.

16. బియాస్ ప్రాజెక్టు - బియాస్ నదీ మీద

16. నిజాం సాగర్ ప్రాజెక్టు- మంజీరానది మీద, నిజమాబాద్‌లో

ఈ చెప్పుకున్నవి కాక ఇంకా ఎన్నో చిన్న పెద్ద ప్రాజెక్టులు ఉన్నాయి.

అవిగాక జలవిద్యుత్ కేంద్రాలు కూడా నదుల మీద కట్టినవి చాలా ఉన్నాయి.

మన ఆంధ్రదేశంలోనే శ్రీశైలం, రామగుండం, సీలేరు మొదలైన చోట్ల ఈ జలవిద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. వీటన్నిటి గురించి తెలుసుకోవలసినది ఎంతో ఉంది.

## భారతీయనదులు పుట్టిన ప్రదేశము మరియు నిడివి

| నదిపేరు | పుట్టిన ప్రదేశము | నిడివి కి.మీ |
|---|---|---|
| 1. గంగానది | హిమాలయాలు గంగోత్రి | 2525 |
| 2. సోని | అమర్‌కంటర్ | 569 |
| 3. కౌశికి | గుసైల్‌ధామ్‌పార్-హిమాలయాలు | 730 |
| 4. రామగంగ | ధూధ్‌లీకొండలు | 590 |
| 5. గోమతి | గోమతీతాల్-ఫిలిబిత్ | 900 |
| 6. శోణభద్ర | అమరకంటకం | 100 |
| 7. తమసా | మధ్యప్రదేశ్, తమకుండం, కైమూర్‌రేంజ్ | 264 |



| | | |
|---|---|---|
| 8. గండకీ | హిమాలయాలు | 630 |
| 9. సరయూ | హిమాలయలు | 350 |
| 10. యమున | హిమాలయాలు-యమునోత్రి | 1375 |
| 11. చంబల్ | ఆరావళీపర్వతాలు | 960 |
| 12. క్షిప్ర | కొక్రిబద్దికొండలు | 192 |
| 13. కౌన్ | కైమూర్‌కొండలు | 161 |
| 14. బెట్వా | వింధ్యాచలం | 304 |
| 15. సరస్వతి | హిమాలయాలు బందాపుంచ్ | 494 |
| 16. బ్రహ్మపుత్ర | మానససరోవరం | 2900 |
| 17. సింధు | టిబెట్-మానససరోవరం | 2880 |
| 18. జీలం | వేరినాగ్ (కాశ్మీర్‌కొండలు) | 725 |
| 19. చీనాబ్ | హిమాలయాలు | 960 |
| 20. రావి | కులూవాలీ | 720 |
| 21. బీయాస్ | కులూవాలీ | 460 |
| 22. సట్లెజ్ | మానససరోవరం | 1448 |
| 23. మహానది | రాయపూర్ దగ్గరసిహవాకొండలు | 858 |
| 24. నర్మద | అమరకంటక్-సాత్పురాపర్వతాలు | 1057 |
| 25. తపతి | మూలతపి-సాత్పురా | 724 |
| 26. పూర్ణ | సాత్పూరా | 334 |
| 27. మహి | మధ్యప్రదేశ్ - మైహడ్‌సరస్సు | 583 |
| 28. సబర్మతి | ఆరావళీపర్వతాలు | 416 |
| 29. గోదావరి | నాసికాత్రయంబకం | 1465 |
| 30. శబరి | ఒరిస్సా - సింకరం | 240 |
| 31. ప్రణహిత | మహారాష్ట్ర-గడ్‌చిరోలి | 113 |
| 32. మంజీరా | బాలాఘాట్ పర్వతాలు | 724 |
| 33. కృష్ణానది | సహ్యపర్వతాలు-మహాబలేశ్వరం | 1327 |
| 34. తుంగభద్ర | పదమటికనుమలు-గంగమూల | 640 |

| | | | |
|---|---|---|---|
| 35. | భీమరథి | పడమటికనుమలు–గుహనపర్వతం | 861 |
| 36. | మూసీ | అనంతగిరికొండలు వికారాబాద్ | 240 |
| 37. | పినాకిని–పెన్నా | నందిదుర్గం | 570 |
| 38. | కావేరి | బ్రహ్మగిరిపర్వతం | 805 |
| 39. | తామ్రపర్ణి | పశ్చిమకనుమలో అగస్త్యమల | 112 |
| 40. | పంపా | సహ్యాద్రికొండలు | 176 |
| 41. | బాహుదా | రామగిరి కొండలు ఒరిస్సా | 96 |
| 42. | పెరియారు | పశ్చిమకనుమలు – శివగిరిలో | 177 |
| 43. | అడయారు | చెంబరంబక్కమ్‌లేక్ | 42 |
| 44. | పాలార్ | కర్ణాటకలో–నందికొండలు | 348 |
| 45. | వైగై | పళనికొండలు | 258 |
| 46. | లూని | ఆరావళీపర్వతాలు | 450 |
| 47. | అంబ | సహ్యాద్రి | 76 |
| 48. | బ్రాహ్మణి | ఛోటానాగపూర్ | 799 |
| 49. | రంగమతి | జామ్‌నగర్ దగ్గరకొండల్లో | 34 |
| 50. | వంశధార | ఒరిస్సాతూముల్‌రామ్‌పూర్ | 254 |
| 51. | నాగావళి | ఒరిస్సా –కలహంది | 256 |
| 52. | శారద | తూర్పుకనుమలు | 122 |
| 53. | గుండ్లకమ్మ | తూర్పుకనుమలు–నల్లమలై కొండలు | 225 |
| 54. | గోస్తనీ | అనంతగిరి | 120 |

## నదీనామ విశేషములు

సీసమాలిక. గంగ సరస్వతి కాళింది గౌతమి
చిత్రోత్పల విశాల శీత చంద్ర
భాగ కావేరి విపాశి సితాలక
శీతలవాహిని సింధు సరయు



గిరి విరావతి గండకి దశార్ణ కృష్ణవే
ణిక శంఖమాల దేవిక తృణఘ్ని
బహుళ విశాఖిని బ్రహ్మభాగ సురస
వాలుకా వాహిని వర్ధమాన
శోకవధూత పినాకినీ ఋభు తామ్ర
వర్ణివలని తామ్రవతి వితద్రు
నర్మదబాహుక నందచిత్రిత యుత్ప
లావతి కపిల మాల్యవతి త్రిదివ
లక్షణ హరిణిక లాంగలిని త్రినామ
ద్యుమతి కుముద్వతి తుంగభద్ర
ఋషిత జితాపగ ఋజ్వభద్ర సునంది
భృగు వరగండకి భీమరథి మ
హాజల గోమతి హంసావళీశ్వర
గండక హరిగండక శతభద్ర
బ్రహ్మగండక నీల పద్మావతీశావ
తి హిరణ్య శాఖావతి హిమ క్రౌంచ
హరితల మానస హంసకంబు సుమేఘ
సౌభద్ర కౌశిక చక్రధార
శ్యామ మహోత్కట సోమ మహావక్త్ర
శౌక్లి పాశావతి చంద్రమత్త
పంచగంధ్యరుణ ప్రభాంజని వలరవ
వజ్రవాలుక శూక వరుణవక్త్ర
పంచమహామాయి ఫల్గుణి సురకర్ర్ణ
ష ధనుష్మతి వితస్త చంద్రవక్త్ర
స్కందావతి సమూలచక్షు కదంబక
పుండరీక పయోష్ణి భూతపాద
కూటవైఘయుఁ జిత్రకూట వేదవతి న
క్రవతి వేగవతి వేత్రవతి గర్భ

వతి యింద్రనందియుఁ గృతమాల కృష్ణపా
ద జయంత వంద శాత్రాఖ్య శుక్తి
మతి హరిద్ధృతి సువర్ణతటీ మణిప్రభా
ప్లక్ష కుజల పిప్పల శుచి సింధు
వర్ణ కాశ్యపి మణికర్ణిక మందాకి
ని మలప్రహారి సానుమతి క్షీర
కౌమోదకీ సఖీమోదితకరతాల
వేదత్రయి మయూఖ విలయవిదిత
భవనాశనియు సర్వపాపహ కటక క్షి
ప్రోద వేదస్మ జంబూర కుంభ
కరణి త్రిసంధ్యయు గాయత్రి ఋషికుల్య
ప్రభవిష్ణువు వికూటరత్నకృష్ణ
తోయ పాపఘ్న విద్యుత దౌర్గ్య సర్వదా
వైర్ణదృష్టిద్యుతి వందవార
శ్రీఘ్రోదయుఁ బ్రణీత చెయ్యేరు గుండ్లక
మ్మయుఁ గుంద మొదలుగా మహిఁ దనర్చు

తే.గీ. పుణ్యకూలంకషా బృందముల సమంద
వికసదరవిందగంధిల విమల కమల
ఝరరవంబుల నురుభక్తి జలకమాడి
సకలదానాదిసత్క్రియల్ సలిపెనంత.

– హంసవింశతి, 4–205

వ్యాఖ్య : గంగ, సరస్వతి, కాళింది, గౌతమి, చిత్రోత్పల, విశాల, శీత, చంద్రభాగ, కావేరి, విపాశి, సితాలక, శీతలవాహిని, సింధు, సరయు, గిరి, విరావతి, గండకి, దశార్ణ, కృష్ణవేణిక, శంఖమాల, దేవిక, తృణఘ్ని, బహుళ, విశాఖిని, బ్రహ్మభాగ, సురస, వాలుకావాహిని, వర్ధమాన, శోకావధూత, పినాకిని, ఋభువు, తామ్రపర్ణి, వలని, తామ్రవతి, వితద్రువు, నర్మద, బాహుక, నంద, చిత్రిత, ఉత్పలావతి, కపిల, మాల్యవతి, త్రిదివ, లక్షణ, హరిణిక,



లాంగలిని, త్రినామ, ద్యుమతి, కుముద్వతి, తుంగభద్ర, ఋషిత, జితాపగ, ఋజ్వ, భద్ర, సునంది, భృగువరగండకి, భీమరథి, మహాజల, గోమతి, హంసావళి, ఈశ్వరగండక, హరిగండక, శతభద్ర, బ్రహ్మగండక, నీల, పద్మావతి, ఈశావతి, హిరణ్య, శాఖావతి, హిమ, క్రౌంచ, హరితల, మానస, హంసక, సుమేఘ, సౌభద్ర, కౌశికి, చక్రధార, శ్యామ, మహోత్కట, సోమ, మహావక్త్ర, శౌక్లి, పాశావతి, చంద్రమత్త, పంచగంధి, అరుణ, ప్రభాంజని, వలరవ, వజ్రవాలుక, శూక, వరుణవక్త్ర, పంచమహామాయి, ఫల్గుణి, సురకర్షృష, ధనుష్మతి, వితస్త, చంద్రవక్త్ర, స్కందావతి, సమూలచక్షు, కదంబక, పుండరీక, పయోష్ణి, భూతపాద, కూటవైఘ, చిత్రకూట, వేదవతి, నక్రవతి, వేగవతి, వేత్రవతి, గర్భవతి, ఇంద్రనంది, కృతమాల, కృష్ణపాద, జయంత, వంద, శాత్రాఖ్య, శుక్తిమతి, హరిద్ధృతి, నంది, సువర్ణతటి, మణిప్రభా, ప్లక్ష, కుజల, పిప్పల, శుచి, సింధువర్ణ, కాశ్యపి, మణికర్ణిక, మందాకిని, మలప్రహారి, సానుమతి, క్షీర, కౌమోదకి, సఖీమోదిత, కరతాల, వేదత్రయి, మయూఖ, విలయవిదిత, భవనాశని, సర్వపాపహ, కటక, క్షిప్రోద, వేదస్మ, జంబూర, కుంభకరణి, త్రిసంధ్య, గాయత్రి, ఋషికుల్య, ప్రభవిష్ణువు, వికూటరత్న, కృష్ణతోయ, పాపఘ్న, విద్యుత, దౌర్గ్య, సర్వద, వైర్ణ, దృష్టిద్యుతి, వందవార, శ్రీఘ్రోద, ప్రణీత, చెయ్యేరు, గుండ్లకమ్మ, కుంద – ఇత్యాదిగా భూమి యందలి పుణ్యనదీ సముదాయాలలో – బాగుగా వికసించిన పద్మాల పరిమళంతో కూడిన జల (కమలమ్ = నీరు) ప్రవాహాలలో మిక్కిలి భక్తితో స్నానం చేసి, షోడశమహాదానాలు మున్నగు సత్కర్మలు నెరవేర్చాడు అంతట.

ఈ సీసమాలికలో **నూట అరవైనాలుగు నదులను** పేర్కొన్నాడు నారాయణామాత్యుడు.

* * *

# XII నదీ స్తోత్రాలు

## శ్రీగంగాస్తోత్రమ్

దేవి! సురేశ్వరి! భగవతి! గంగే త్రిభువనతారిణి తరళతరంగే!
శంకరమౌళివిహారిణి! విమలే! మమ మతిరాస్తాం తవ పదకమలే! 1

భాగీరథి! సుఖదాయిని మాతః! తవజలమహిమా నిగమే ఖ్యాతః,
నాహం జానే తవ మహిమానం పాహి కృపామయి! మామజ్ఞానమ్. 2

హరిపదపాద్యతరంగిణీ! గంగే! హిమవిధుముక్తాధవళతరంగే!
దూరీకురు మమ దుష్కృతిభారం కురు కృపయా భవసాగరపారమ్. 3

తవ జలమమలం యేన నిపీతం పరమపదం ఖలు తేన గృహీతమ్,
మాతర్గంగే! త్వయి యో భక్తః కిల తం ద్రష్టుం న యమః శక్తః. 4

పతితోద్ధారిణి! జాహ్నవి! గంగే! ఖండితగిరివరమండితభంగే!
భీష్మజనని! హే మునివరకన్యే! పతితనివారిణి! త్రిభువనధన్యే. 5

కల్పలతామివ ఫలదాం లోకే ప్రణమతి యస్త్వాం న పతతి శోకే,
పారావారవిహారిణే! గంగే! విముఖయువతి కృత తరలాపాంగే! 6

తవ చేన్మాతః! స్రోతస్స్నాతః పునరపి జఠరే సోఽపి న జాతః,
నరకనివారిణి! జాహ్నవి! గంగే! కలుష వినాశిని! మహిమోత్తుంగే. 7

పునరసదంగే పుణ్యతరంగే! జయ జయ జాహ్నవి! కరుణాపాంగే!
ఇంద్రమకుటమణిరాజిత చరణే! సుఖదే! శుభదే! భృత్యశరణ్యే! 8

రోగం శోకం తాపం పాపం హర మే భగవతి కుమతి కలాపమ్,
త్రిభువన సారే వసుధాహారే త్వమసి గతిర్మమ ఖలు సంసారే. 9

అలకానందే! పరమానందే! కురు కరుణామయి కాతరవంద్యే!
తవ తటనికటే యస్య నివాసః ఖలు వైకుంఠే తస్య నివాసః. 10



వరమిహ నీరే కమఠో మీనః కింవా తీరే శరటః క్షీణః,
అథవా శ్వపచో మలినో దీనః తవ నహి దూరే నృపతి కులీనః. 11

భోభువనేశ్వరి! పుణ్యే! ధన్యే! దేవి! ద్రవమయి! మునివరకన్యే!
గంగాస్తవమిదమమలం నిత్యం పఠతి నరో యః స జయతి సత్యమ్. 12

యేషాం హృదయే గంగాభక్తిః తేషాం భవతి సదా సుఖముక్తిః,
మధురాకాంతాపజ్ఝటికాభిః పరమానందకలితలలితాభిః. 13

గంగాస్తోత్రమిదం భవసారం వాంఛితఫలదం విమలం సారమ్,
శంకరసేవక శంకరరచితం పఠతి సుఖీ స్తవ ఇతి చ సమాప్తః. 14

## యమునాష్టకమ్

మురారికాయ కాలిమాలలామవారి ధారిణీ
తృణీకృత త్రివిష్టపా త్రిలోక శోక హారిణీ ।
మనోఽనుకూల కూల కుంజ పుంజ ధూత దుర్మదా
ధునోతు నో మనోమలం కలింద నందినీ సదా ॥ 1

మలాప హారి వారి పూరభూరి మండితామృతా
భృశం ప్రపాతక ప్రభంజనాతి పండితానిశమ్ ।
సునందనందనాంగ సంగరాగరంజితా హితా
ధునోతు నో మనోమలం కలింద నందినీ సదా ॥ 2

లసత్తరంగ సంగధూత భూతజాత పాతకా
నవీన మాధురీ ధురీణ భక్త జాత చాతకా ।
తటాంతవాస దాస హంస సంవృతాహ్ని కామదా
ధునోతు నో మనోమలం కలింద నందినీ సదా ॥ 3

విహార రాస ఖేద భేద ధీర తీర మారుతా
గతా గిరామగోచరే యదీయ నీర చారుతా ।

ప్రవాస సాహచర్య పూత మేదినీ నదీ నదా
ధునోతు నో మనోమలం కలింద నందినీ సదా ॥ 4

తరంగసంగ సైకతాంతరాంచితా సదాऽసితా
శరన్నిశాకరాంశు మంజుమంజరీ సభాజితా ।
భవార్చనా ప్రచారణా అంబునాధునా విశారదా
ధునోతు నో మనోమలం కలింద నందినీ సదా ॥ 5

జలాంత కేలికారి చారురాధికాంగ రాగిణీ
స్వభర్తురన్య దుర్లభాంగతాంగతాంశ భాగినీ ।
స్వదత్త సుప్త సప్త సింధు భేదనాతి కోవిదా
ధునోతు నో మనోమలం కలింద నందినీ సదా ॥ 6

జలచ్యుతా అచ్యుతాంగ రాగ లంపటాలి శాలినీ
విలోల రాధికాకచాంత చంపకాలి మాలినీ ।
సదావగాహనావతీర్ణ భర్తృ భృత్య నారద
ధునోతు నో మనోమలం కలింద నందినీ సదా ॥ 7

సదైవ నంద నందకేలి శాలికుంజ మంజులా
తటోత్థ ఫుల్లమల్లికా కదంబరేణు సూజ్జ్వలా ।
జలావగాహినాం నృణాం భవాబ్ధి సింధు పారదా
ధునోతు నో మనోమలం కలింద నందినీ సదా ॥ 8

– శ్రీశంకరాచార్య రచిత యమునాష్టకం సంపూర్ణమ్



## యమునాష్టకమ్

కృపాపారావారాం తపనతనయాం తాపశమనీం
మురారిప్రియస్యాం భవభయదవాం భక్తివరదామ్ ।
వియజ్జ్వాలోన్ముక్తాం శ్రియమపి సుఖాప్తేః పరిదినం
సదా ధీరో నూనం భజతి యమునాం నిత్యఫలదామ్ ॥ 1

మధువనచారిణి భాస్కరవాహిని జాహ్నవిసంగిని సింధుసుతే
మధురిపుభూషిణి మాధవతోషిణి గోకులభీతివినాశకృతే ।
జగదఘమోచిని మానసదాయిని కేశవకేలినిదానగతే
జయ యమునే జయ భీతినివారిణి సంకటనాశిని పావయ మామ్ ॥ 2

అయి మధురే మధుమోదవిలాసిని శైలవిదారిణి వేగపరే
పరిజనపాలిని దుష్టనిషూదిని వాంఛితకామవిలాసధరే ।
వ్రజపురవాసిజనార్జితపాతకహారిణి విశ్వజనోద్ధరికే
జయ యమునే జయ భీతినివారిణి సంకటనాశిని పావయ మామ్ ॥ 3

అతివిపదంబుధిమగ్న జనం భవతాపశతాకులమానసకం
గతిమతిహీనమశేషభయాకులమాగతపాదసరోజయుగమ్ ।
ఋణభయభీతిమనిష్కృతిపాతకకోటిశతాయుతపుంజతరం
జయ యమునే జయ భీతినివారిణి సంకటనాశిని పావయ మామ్ ॥ 4

నవజలదద్యుతికోటిలసత్తనుహేమభయాభరరంజితకే
తడిదవహేలిపదాంచలచంచలశోభితపీతసుచేలధరే ।
మణిమయభూషణచిత్రపటాసనరంజితభానుకరే
జయ యమునే జయ భీతినివారిణి సంకటనాశిని పావయ మామ్ ॥ 5

శుభపులినే మధుమత్తయదూద్భవరాసమహోత్సవకేలిభరే
ఉచ్చకులాచలరాజితమౌక్తికహారమయాభరరోదసికే ।
నవమణికోటికభాస్కరకంచుకిశోభితతారకహారయుతే
జయ యమునే జయ భీతినివారిణి సంకటనాశిని పావయ మామ్ ॥ 6

కరివరమౌక్తికనాసికభూషణవాతచమత్కృతచంచలకే
ముఖకమలామలసౌరభచంచలమత్తమధువ్రతలోచనికే ।
మణిగణకుండలలోలపరిస్ఫురదాకులగండయుగామలకే
జయ యమునే జయ భీతినివారిణి సంకటనాశిని పావయ మామ్ ॥ 7

కలరవనూపురహేమమయాచితపాదసరోరుహసారుణికే
ధిమిధిమిధిమిధిమితాలవినోదితమానసమంజులపాదగతే ।
తవ పదపంకజమాశ్రితమానవచిత్తసదాఖిలతాపహరే
జయ యమునే జయ భీతినివారిణి సంకటనాశిని పావయ మామ్ ॥ 8

భవోత్తాపాంభోధౌ నిపతితజనో దుర్గతియుతో
యది స్తౌతి ప్రాతః ప్రతిదినమన్యాశ్రయతయా ।
హయాహ్రేషైః కామం కరకుసుమపుంజై రవిసుతాం
సదా భోక్తా భోగాన్మరణసమయే యాతి హరితామ్ ॥ 9

– శ్రీశంకరాచార్య విరచిత యమునాష్టకం సంపూర్ణమ్



## నర్మదాష్టకం

సబిందు సింధు సుస్ఖలత్ తరంగ భృంగ రంజితం
ద్విషత్సు పాపజాతజాతకారివారి సంయుతం ।
కృతాంత దూత కాల భూత భీతి హారి వర్మదే
త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే ॥ 1

త్వదంబులీన దీనమీన దివ్య సంప్రదాయకం
కలౌమలౌఘ భారహారి సర్వతీర్థ నాయకం ।
సుమచ్ఛ కచ్ఛనక్ర చక్రవాక చక్రశర్మదే
త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే ॥ 2

మహాగభీర నీరపూర పాతధూత భూతలం
నమత్ సమస్త పాతకారి దారితాపదాచలం ।
జగల్లయే మహాభయే మృకణ్డు సూనుహర్మ్యదే
త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే ॥ 3

గతం తదైవ మే భయం త్వదంబు వీక్షితం యదా
మృకణ్డు సూను శౌనకా సురారి సేవితం సదా ।
పునర్భవాబ్ధి జన్మ సంభవాబ్ధి దుఃఖవర్మదే
త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే ॥ 4

అలక్ష్య లక్ష కిన్నరామరాసురాది పూజితం
సులక్ష్య నీర తీర ధీర పక్షిలక్ష కూజితం ।
వసిష్ఠ శిష్ట పిప్పలాది కర్దమాది శర్మదే
త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే॥ 5

సనత్కుమార నాచికేత కశ్యపాత్రి షట్పదైః
ధృతం స్వకీయమానసేషు నారదాది షట్పదైః ।
రవీందురంతిదేవ దేవరాజ కర్మ శర్మదే
త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే ॥ 6

అలక్ష-లక్ష-లక్ష-పాప లక్ష సార సాయుధం
తతస్తు జీవజంతు తంతు భుక్తి ముక్తి దాయకం ।
విరించి విష్ణు శంకర స్వకీయ ధామ వర్మదే ।
త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే ॥ 7

అహో ధృతం స్వనం శ్రుతం మహేశ కేశజాతటే
కిరాత సూత వాడవేషు పండితే శఠే నటే ।
దురంత పాప తాపహారి సర్వజంతు శర్మదే
త్వదీయ పాదపంకజం నమామి దేవి నర్మదే ॥ 8

ఇదం తు నర్మదాష్టకం త్రికాలమేవ యే సదా
పఠంతి తే నిరంతరం న యాంతి దుర్గతిం కదా ।
సులభ్య దేహదుర్లభం మహేశధామ గౌరవం
పునర్భవా నరా న వై విలోకయంతి రౌరవం ॥ 9



## కావేరీ ప్రార్థన

మరుద్ధృత మహాభాగే మహాదేవి మనోహరే ।
సర్వాభీష్టప్రదే దేవీ స్నాస్థితాం పుణ్యవర్ధిని ॥ 1

సర్వపాపక్షయకరే మమ పాపం వినాశయ ।
కవేరకన్యే కావేరి సముద్రమహిషిప్రియే ॥ 2

దేహి మే భక్తిముక్తి త్వం సర్వతీర్థస్వరూపిణి ।
సింధువర్యే దయాసింధో మాముద్ధర దయాంబుధే ॥ 3

స్త్రియం దేహి సుతం దేహి శ్రియం దేహి తతః స్వగా ।
ఆయుష్యం దేహి చారోగ్యం ఋణాన్ముక్తమ్ కురుష్వ మామ్ ॥ 4

తాసాం చ సరితాం మధ్యే సహ్యకన్యాఘనాశిని ।
కావేరి లోకవిఖ్యాతా జనతాపనివారిణి ॥ 5

ఇతి బ్రహ్మాండ పురాణే కావేరీ ప్రార్థనా ॥

**ఈరచనకు తోడ్పడిన గ్రంథాలు**

1. రామాయణము
2. భారతము
3. భాగవతము
4. హరివంశము
5. వివిధపురాణాలు
6. భీమఖండము – శ్రీనాథుడు
7. పాండురంగమాహాత్మ్యము – తెనాలి రామకృష్ణుడు
8. హంసవింశతి – అయ్యలరాజు నారాయణామాత్యుడు
9. మార్గదర్శకులు మహర్షులు – మహామహోపాధ్యాయ శివానందమూర్తి
10. రివర్స్ ఆఫ్ ఇండియా – సునీల్ విద్యానాథన్ సయోనిమిత్ర (ఆంగ్లం)
11. మనపుణ్యనదులు – మలయవాసిని
12. భారతదేశనదుల చరిత్రలు వైభవం – ఎన్.టి.జి. అంతర్వేదికృష్ణమాచార్య
13. వివిధ పత్రికలలోని వ్యాసాలు
14. అంతర్జాలము (ఇంటర్‌నెట్)